ఆదివారం
నా సంగతులు నా మాటలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
18-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 106 పేజీలు: 10+4 వెల: 8.00

## తుర్కియే యాపిల్స్ బ్యాన్ చేయండి
5లో

## ముంబయి ఎయిర్‌పోర్టులో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు



పిఎస్ఎల్వి-సి61 రాకెట్

## రక్షణ ఉపగ్రహం నేడే నింగిలోకి
### ఉదయం 5.59 గం.కే ముహూర్తం
### షార్‌లో పర్యటిస్తున్న కేంద్రపార్లమెంటరీ బృందం సభ్యులు

**శ్రీహరికోట (తడ), మే 17 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు రక్షణ ఉపగ్రహాన్ని పిఎస్ ఎల్వి-సి61 రాకెట్ నింగికి మోసుకెళ్ల నుంది. ఇందుకు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు సీనియర్ శాస్త్రవేత్తలు, షార్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. రెండు, నాలుగవ దశలలో ఘన ఇంధనం నింపడం కాకుండా రాకెట్‌లోని అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పనితీరును కౌంట్‌డౌన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. శ్రీహరికోట మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ నింగికి >>2

# ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు
### స్వాతంత్ర్య దినోత్సవ కానుక ప్రకటించిన సిఎం చంద్రబాబు
### ఆగస్టు నాటికి చెత్తలేని పరిశుభ్ర రాష్ట్రంగా ఎపి
### హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారు చేస్తాం
### కర్నూలు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి



శనివారం కర్నూలులో జరిగిన సభకు హాజరైన ప్రజానీకం

**కర్నూలు, మే 17, ప్రభాతవార్త :** స్వచ్ఛాంధ్ర లక్ష్యయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగుదేశం హయాంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకలించివేశామని, భవిష్యత్తులోనూ సీమ గడ్డపై ఫ్యాక్షన్ మాట వినబడనివ్వమని స్పష్టం చేశారు. సీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారుచేస్తామని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. కర్నూలు నగరంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహించాలి. దుమ్ము దులిపి స్వచ్ఛమైన



శనివారం కర్నూలు సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

ఆలోచనలు చేయాలి. ఆధునిక ప్రపంచంలో చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతిరోజూ అందరూ యోగా చేయాలి. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ యోగా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తాం. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిపోయింది. అక్టోబర్ 2నాటికి రాష్ట్రంలో చెత్తలేకుండా చేస్తాం. చెత్త నుంచి ఎనర్జీ తీసే ప్రాజెక్టులు ప్రస్తుతం రెండు పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో రాజమండ్రి, విజయవాడ, >>2

## కొన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచన
### పిడుగులు పడే అవకాశం

**విజయవాడ,మే 17,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో శనివారం పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సగటు పగటి ఉష్ణోగ్రతలు 38డిగ్రీలు పలు జిల్లా నమోదయితే, ఇందుకు భిన్నంగా పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిసాయి. రాష్ట్రంలో మరో 48గంటలుఅక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసాయి విజయనగరం, మన్యం, ఏలూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. కర్నేలు, నంద్యాల, వైఎస్సా ర్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. పిడుగులు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్, చెట్లక్రింద, శిథిలావస్థలో నున్న గోడలు, భవనాల వద్ద నిలబడవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈదురు గాలులతో కూడిన భారీ >>2



## మార్కెట్లో నాసి విత్తనాల హల్‌చల్

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** వానలు పలకరించడంతో వాణిజ్య పంటల రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో నాసిరకం పత్తి విత్తన విక్రయదారులు తమ మోసాలకు తెరదీసారు. కీలకంగా పత్తి నాసిరకం, జిన్నింగ్ విత్తనాలు మార్కెట్లోకి జోరుగా విక్రయింప చేస్తున్నారు. పత్తిసాగు అధికంగా ఉండే తెల్లబంగారపు గనులు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ విత్తనాలు ఎక్కువ సర్కులేషన్‌లో ఉన్నాయి. ఈ నాసిరకం ప్యాకింగ్ కేంద్రాలు గుంటూరు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా, తెలంగాణ రాష్ట్రం జిల్లా ఖమ్మం, నల్గొండ జిల్లాల సరిహద్దుల్లో కేంద్రీకరించి సాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల. మైలవరంల నుంచి నాసిరకం జిన్నింగ్ విత్తనాలు గుట్టు చప్పుడు కాకుండా ఇతర కేంద్రాలకు పంపిస్తున్నట్లు సమాచారం గత సంవత్సరం బాగా పంట దిగుబడి వచ్చిందంటూ ఆ విత్తనాలను పలు మండలాల్లో విక్రయిస్తున్నారు. 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.901గా ఉంది. కానీ ఒక >>2



శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని కలిసి మామిడి పండ్లను బహూకరిస్తున్న మంత్రి లోకేష్ దంపతులు

## ప్రధాని మోడీతో లోకేష్ భేటీ
### 'యువగళం' కాఫీటేబుల్ బుక్ ఆవిష్కరణ
### దేవాన్ష్‌తో ఆప్యాయంగా మాట్లాడిన పిఎం

**న్యూఢిల్లీ, మే 17:** ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీశాఖల మంత్రి నారా లోకేష్ , భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శనివారం న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాన మంత్రి ఖియువగళంఖి కాఫీ టేబుల్ బుక్‌ని ఆవిష్కరించి, మొదటి ప్రతిని అందుకున్నారు. ప్రధానితో జరిగిన ఈ సమావేశం లోకేష్ కుటుంబానికి ముఖ్యమైన, మరపురాని భేటీగా కలకాలం నిలిచిపోతుంది. 2024 ఎన్నికలకు ముందు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన చారిత్రాత్మకమైన >>2

# మహిళలకు 'వర్క్ ఫ్రం హోం'

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళలకు వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక కుటుంబానికి ఆదాయ వనరులను సృష్టించే దిశలో మహిళల పడే శ్రమ ప్రశంసనీయమన్నారు. వర్క్ ఫ్రమ్ హోం పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తోందన్నారు, "ఎక్స్' వేదికగా వర్క్ ఫ్రం హోంతో సహా పలు అంశాలను సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం, సైన్స్ రంగంలో విజయాలు సాధిస్తున్న మహిళలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో స్టెమ్ కోర్సుల పట్ల ఆసక్తి చూపించే మహిళలను ప్రోత్సాహిస్తామన్నామని స్పష్టం చేశారు. స్టెమ్ కోర్సులు చేస్తున్న మహిళలకు శుభాకాంక్షలు సీఎం తెలిపారు. కొవిడ్ అనంతర పరిణామాలు, అందుబాటులో ఉన్న సాంకేతికత వర్క్ ఫ్రమ్ హోంఖి ప్రాముఖ్యతను పెంచాయని గుర్తు చేశారు.

రిమోట్ వర్క్, కోవర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్క్ స్పేస్ వంటి కాన్సెప్టులు అనువైన ఉత్పాదక వాతావరణాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఇవి వ్యాపారులు, ఉద్యోగులకు సమర్థవంతమైన ఫలితాలు అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన పని, జీవిత సమతుల్యతను సాధించడంలో సహాయపడతాయని

### ఆసక్తి కలిగిన వారిని ప్రోత్సహిస్తామన్న సిఎం చంద్రబాబు
### స్టెమ్ కోర్సుల పట్ల మహిళల్లో ఉత్సాహం
### ప్రతి నియోజకవర్గంలో స్పెషాలిటీ హాస్పిటల్

చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ, జీసీసీ పాలసీ 4.0 ఆ దిశగా గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు వెల్లడించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పబ్లిక్ పీపుల్స్ పార్టనర్‌షిప్(పీ4) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించి వారి అభ్యున్నతికి దాతల ద్వారా సహాయ సహకారాలు అందించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఎంపిక చేసిన కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, నివాస ప్రాంతాల్లో, ఇంటి ఆవరణలో జీవనానికి వీలుగా మౌలిక వసతులు కల్పించడం, ఆదాయ పరంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చే మార్గదర్శకులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే దిశగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి నగరం, పట్టణం, మండలంలో ఐటీ కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అందుకు తగ్గ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో 300 పడకలతో స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామని "ఎక్స్"లోనే సీఎం చంద్రబాబు వివరించారు. ఇంకా పేదలకు మెరుగైన పాలన అందించేందుకు ఉగాది నుంచి పీ4 మోడల్ విధానాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మరో మూడు నెలల్లో అయిదులక్షల మందిని పీ-4 పరిధిలోకి తీసుకుని వస్తామన్నారు. వైద్య ఖర్చుల్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులు పరీక్షల పేరిట ప్రజలను దోచుకుంటే సహించేది లేదు. త్వరలో ఆయుష్మాన్‌భవలో భాగస్వాములవుతాం. నేచురల్ ఫుడ్‌లో రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తున్నామన్నారు. అందుకు వీలుగా అనేక కార్యక్రమాలు కార్యచరణలో ఎక్స్"లోనే సీఎం చంద్రబాబు పెట్టామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 ఏపీలో చేయబోతున్నాం. ప్రతిఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వాడే రోజు రావాలి. కాలుష్యం, పారిశుద్ధం మెరుగు పడితే రోగాలు దూరమవుతాయి. >>2

# 'సేఫ్‌జోన్'గా తిరుమల ఘాట్ రోడ్లు!
### రెండో ఘాట్‌లో అధునాతన సిసికెమెరాలు
### మరింత పటిష్టంగా నిఘా వ్యవస్థ



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** భారత్-పాక్ దేశాల మధ్య తలెత్తిన యుద్ధ పరిణామాల నేపథ్యంలో ప్రపంచప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను మరింత పూర్తిస్థాయిలో "సేఫ్ జోన్"గా ఉంచడానికి కేంద్రనిఘా వర్గాలు రాష్ట్రపోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఇందుకోసం తిరుపతి జిల్లా పోలీసువిభాగానికి ,టిటిడి నిఘాభద్రత విభాగం అవసరమైన భద్రత, నిఘా పరికరాలు సమకూర్చుకునే దిశగా ఆదేశాలు జారీచేసింది. తిరుమలకు ఉన్న రెండు ప్రధాన ఘాట్‌రోడ్లతోబాటు మూడు కాలినడక మార్గాలు, శేషాచలం అడవిలో 14 ప్రవేశద్వారాలు ఉండటం, ఇక్కడ భద్రతను మరింత పటిష్టం చేసేదిశగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే తిరుమల ఆలయ భద్రతతోబాటు నిత్యంవస్తున్న లక్షమంది వరకు భక్తులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని మార్గాల్లో అధునాతన టెక్నాలజీ సాయంతో భద్రతను పటిష్టం చేయాలనే లక్ష్యంగా చకచకా పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా తిరుమల ఆలయం భద్రతపై పూర్తిస్థాయిలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా దళాలకు సదుపాయాలు, టెక్నాలజీతో కూడిన ఆయుధాలు, శిక్షణ అంశాలు సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధానంగా దేశం నలుమూలల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వాహనాల్లో వచ్చే యాత్రికులు తిరుపతి అలిపిరి మార్గంలో సప్తగిరి తనిఖీకేంద్రం మీదుగా రెండోఘాట్‌లో తిరుమలకు చేరుకుంటారు. ఇక్కడ మూడంచెల తనిఖీలు కోసం 24గంటలూ టిటిడి విజిలెన్స్, ఎస్‌పిఎఫ్, హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు విధుల్లో ఉంటారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత తిరుమలకు అనుమతిస్తారు. అయితే ఇక్కడ వస్తున్న భక్తులు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, వారెవరు, తీవ్రవాదులా, నేరస్థులా, దొంగలు అనేది కనిపెట్టేవ్యవస్థ లేకపోయింది. అంతేగాక ఘాట్‌లో తిరుమలకు చేరుకునే సమయంలో వాహనాల వేగం, యాత్రికుల కదలికలపై మరింత నిఘా ఉంచేందుకు వీలుగా తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు పర్యవేక్షణలో అధునాతన సిసి కెమెరాలు, సోలార్ సిసికెమెరాలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే అలిపిరి తనిఖీ కేంద్రందాటిన తరువాత వినాయకుడి గుడి సమీపంలోంచి ఘాట్‌లో హరిణివిశ్రాంతి కేంద్రం, లింకురోడ్డు వరకు సోలార్ సిసికెమెరాలు అమర్చారు. వీటికి విద్యుత్‌తో అవసరం లేకుండా పూర్తిగా సౌరశక్తితో పనిచేసేలా సాంకేతికత ఉంది. వీటిని తిరుపతిలోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి, జిల్లా ఎస్పీ చరవాణికి(మొబైల్‌ఫోన్)కు అనుసంధానం చేశారు. ఈ సోలార్ సిసికెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు ఎస్పీనే స్వయంగా పరిశీలించే అవకాశం ఉంది.

తిరుపతి నుండి తిరుమలకు వచ్చేరెండోఘాట్‌లో ఇప్పటికే నాలుగు ప్రధాన చోట్ల సోలార్‌తో పనిచేసే సిసికెమెరాలు ఐదుచోట్ల ఏర్పాటుచేశారు. ఘాట్‌లో 18కిలోమీటర్లు దూరం. ఈ మధ్యలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ఇక్కడ వాహనాలు అదుపుతప్పినా, చిరుతపులులు సంచరించినా వెంటనే గుర్తించి భద్రత సిబ్బందిని అప్రమత్తం చేసే వీలుంటుంది. ఘాట్‌లో భద్రతను మరింత పటిష్టంచేసేందుకు రెండు రోజుల క్రిందట అనంతపురం డిఐజి >>2



## హైదరాబాద్-విశాఖ ఇక 8 గంటలే!
### గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే ప్రారంభానికి సిద్ధం
### విజయవాడకు రాకుండా నేరుగా విశాఖకే
### తగ్గనున్న 125 కి.మీ దూరం

**విజయవాడ.మే17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల నడుమ దూరాభారం తగ్గనుంది. ఇప్పటి వరకు ఆంధ్రనుంచి కీలక నగరాలకు వెళ్ళాంటే విజయవాడ నగరం నడిబొడ్డు నుంచి వెళ్ళాల్సి వచ్చేది. ఇక ముందు ఆ అవసరం లేకుండా నగర శివారులు. ఇంకా ఎగువ నుంచి వాహనాలు వెళ్ళే విధంగా జాతీయరహదారులు, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్నాయి. ఆంధ్ర-తెలంగాణలను కలుపుతూ కేంద్రం నిర్మిస్తోన్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే 365 బిజి ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే నిర్మాణం పూర్తవ్వాల్సి ఉన్నా భూ సేకరణలో జాప్యం, అధిక వర్షాలతో నిర్మాణం పూర్తి కాలేదు. ఖమ్మం దేవరపల్లి మధ్య 162 కిలోమీటర్ల మేర నిర్మితతస్తోన్న ఈ రహదారి మిగతా వాటికంటే పూర్తి భిన్నమైనది. పచ్చని పొలాల మధ్యలోంచి, ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించవచ్చు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ విశాఖ మధ్య విజయవాడ వెళ్లకుండానే వేగంగా వెళ్ళిపోవచ్చు హైదరాబాద్ నుంచి విశాఖ మధ్య 125 కిలోమీటర్ల దూరం తగ్గించడానికి మూడేళ్ల క్రితం ఖమ్మం నుంచి ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. దేవరపల్లితల్లాడ జాతీయ రహదారి డైమండ్ జంక్షన్ కు రెండు కిలోమీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది. 162 కిలోమీటర్ల దూరం ఉన్న నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే365 ను పచ్చని పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 4,609 కోట్ల రూపాయలతో నిర్మించే ఈ రోడ్డుకు >>2




## నీట్ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే

**చెన్నై, మే 17:** నీట్ ఫలితాల విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టుకీలక నిర్ణయం తీసుకుంది. ఫలితాలను విడుదల చేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేస్తూ తదుపరి విచారణ జూన్ 2వ తేదీకి వాయిదావేసింది. కాగా ఇప్పటికే నీట్ ఫలితాలపై మధ్యప్రదేశ్ హైకోర్టుకూడా స్టేవిదించింది. తమ ఎగ్జామ్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం కారణంగా పరీక్ష సరిగ్గారాయలేకపోయామని కొంతమంది విద్యార్థులు పిటిషన్ దాఖలుచేసారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ అంతరాయం >>2



## 'సీజ్‌ఫైర్' నేటితో పూర్తి
### కొద్ది రోజుల్లో మళ్లీ చర్చలు: పాక్ డిప్యూటీ ప్రధాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** భారత్ పాకిస్తాన్‌లమధ్య కాల్పుల విరమణ ప్రతిపాదనలు ఆదివారంతో ముగుస్తున్నాయి. మరోసారి డిజిఎంలు సమావేశం అయి సరిహద్దుల వెంబడి నెలకొన్న పరిస్థితులను సమీక్షిస్తారని అంచనా. వాస్తవాధీన రేఖవెంబడి ఉద్రిక్తతలు తగ్గించి, కాల్పులు నిలిపివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భారత్ పాకిస్తాన్‌లు రెండూ కూడా >>2



ఇఓఎస్09 ఉపగ్రహం సోలార్ ప్యానళ్లు

# రక్షణ ఉపగ్రహం నేడే నింగిలోకి

>> నిస్సైన వేయనుండగా, రక్షణ ఉపగ్రహం ఇఓఎస్09 దీని ద్వారా ప్రయోగిస్తున్నారు. ప్రయోగ సమయంలో రాకెట్ బరువు 321 టన్నులు కాగా, ఉపగ్రహం బరువు 1696.24 కిలోల బరువుగా ఉంది. అంతరిక్షంలోని 534 కిలోమీటర్ల దూరంలో 18 నిమిషాలలోపే ఇఓఎస్9ను నిర్ణిత కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఈ ప్రయోగం జరుపుతున్నారు. ఇఓఎస్09 భారత రక్షణ దళానికి ఎంతో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే పేర్కొన్నారు. ఈ కీలక ఉపగ్రహ ప్రయోగ వేళ పార్లమెంటరీ కమిటీ బృందం షార్‌లో పర్యటన చేస్తోంది. శనివారం కూడా సుమారు 18 మందితో కూడిన ఎంపీలు, ఇతర ముఖ్య అధికారులు శ్రీహరికోటలోని వివిధ అంతరిక్ష కేంద్రాలను పరిశీలించారు. రాకెట్ అనుసంధాన భవనాలు, ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్ తదితర ప్రాంతాలు పర్యటన అనంతరం స్థానిక నక్షత్ర హోటల్‌లో ఇస్రో పెద్దలతో కీలక సమావేశాలు జరిపారు. ఈ పర్యటన కేవలం రాకెట్ ప్రయోగ వీక్షణ కోసమే కాకుండా శ్రీహరికోట అభివృద్ధికి సంబంధించి విస్తృతమైన చర్చలు జరిపినట్లు తెలిసింది. భవిష్యత్‌లో నిర్మాణం జరుపుకోనున్న మూడవ ప్రయోగ వేదిక లాంటివి ఇందులో ఉన్నాయి. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు కొత్త కొకపోయినా ఇప్పటికే వంద పూర్తి చేసుకుని, ప్రస్తుతం 101 ప్రయోగం జరుగుతున్నప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, తిరుపతి జిల్లా పోలీసులు, ఇంటలిజెన్స్, నావికా దళ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# 'సీజ్‌ఫైర్' నేటితో పూర్తి

>> తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. ఇందులోభాగంగానే సరిహద్దులవెంబడి పాక్ చొరబాట్లు, రెచ్చగొట్టే కాల్పులు కూడాజరగలేదు. అయితే ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారంతోముగుస్తున్నది. స్వయంగా పాకిస్తాన్ ఉపప్రధాని ఇషాక్‌దార్ ఆదేశ ఎగువసభలోనే ప్రకటించారు. డెడ్‌లైన్‌ను మరింత పొడిగించే అవకాశం ఉందని, దశలవారీగా చర్చలు కూడా జరుపుతామన్నారు. డైరెక్టర్‌జనరల్స్ మిలిటరీ ఆపరేషన్స్ చర్చల్లో ముందు కాల్పులు విరమణకు అంగీకారం కుదిరిందని, 12వ తేదీవరకూ ఉన్న గడువును 14వ తేదీవరకూ పొడిగించారు. ఆతర్వాత 18వ తేదీవరకూ పొడిగించినట్లు చెప్పారు. భారత్ ఈ వివాదంపై చర్చలకు అంగీకరించవచ్చని ఇషాక్‌దర్ అన్నారు. పిపిపి చీఫ్ బిలావల్ భుట్టో తీవ్రస్థాయి వ్యాఖ్యలతో కొంతమేర చర్చలకు విఘాతం జరిగినా డిజిఎంఒల స్థాయిలో చర్చలుజరిగాయి. పాక్ ఆక్రమిత కాశ్మీర్, సరిహద్దులలో చొరబాట్లు, కాల్పులు, ఉగ్రవాద నిర్మూలన మినహా మరేమీ ఇతరచర్చలుండబోవని ఇప్పటికే భారత్ స్పష్టంచేసింది. ఈ క్రమంలో మరోసారి డిజిఎంఒల చర్చలకు స్పష్టమైన తేదీ అనేది ఖరారుకాలేదు.



# భారీ అగ్నిప్రమాదం:త్రుటిలో తప్పిన ప్రాణనష్టం

**కోవూరు (నెల్లూరు), మే 17, ప్రభాతవార్త :** అందరూ గాఢనిద్రలో ఉన్నారు.. ఉన్నట్టుండి. ఆ ప్రాంతంలో పొగలతో కూడిన మంట రావడం జరిగింది. హుటాహుటిన ఆ ప్రాంత వాసులు లేచేసరికే మంటలు గువ్వెత్తున ఎగసాయి. ఈ సంఘటన కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది ఈ ప్రాంతంలో సుభహాన్ అనే వ్యాపారి చిత్తు కాగితాలు పేపర్లు రబ్బర్ టైర్లు ఖాళీ సిలిండర్లు ఫ్రిజ్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేస్తూ స్టాక్ పెట్టి ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా ఆ ప్రాంతంలో పొగలతో కూడిన మంటలురావడం జరిగింది. ఈమెకు సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు దేవి రెడ్డి సురేష్ రెడ్డి మండల పార్టీ సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి సాయిరెడ్డి తదితరులు ఆ ప్రాంతానికి చేరుకుని ఫైర్ ఇంజన్ రావడంతో సహాయ చర్యలు చేపట్టారు మంటలు చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు వ్యాపించకుండా ఫైర్ ఆఫీసర్ వేణుగోపాల్ బృందం ఆధ్వర్యంలో ఫైర్ ఇంజన్ ద్వారా రాత్రి మూడు గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు మొత్తం మీద ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాన్స్కో సిబ్బంది అధికారులు సంఘటన స్థలానికి వచ్చి విద్యుత్ సరఫరా నిలిపియడంలో కీలక పాత్ర పోషించారు దాదాపు మూడు గంటల వరకు మంటలు తీవ్రంగా వ్యాపించడంతో చుట్టుపక్కల గృహాల వాళ్ళు భయాందోళనలకు గురయ్యారు.

# కొన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచన

>> వర్షం అనంతపురం జిల్లా ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం దాటికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూఏదగవి వంక ఏరు పారుతోంది. పెంచలపాడు-పొలికి గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాత్రి నుండి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనివలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమిద్యాల గ్రామంలో పిడుగుపాటుకు నరసింహులు అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు మృతిచెందాయి. లక్షన్నర నష్టం వాటిల్లిందని రైతు నరసింహులు వాపోయాడు. చాయపురం వద్ద హంద్రీనీవా కాలువ వర్షపు నీటితో నిండిపోయింది. అల్లూరి జిల్లాలో మోస్తరు నుండి భారీ వర్షాలకు అవకాశం ఉంది. పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. విజయనగరం, మన్యం, ఏలూరు, కర్నేలు, నంద్యాల జిల్లాలకు కూడ హెచ్చరికలు జారీ చేశారుతూర్పు గోదావరి, ప్రకాశం, వైఎస్సార్, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. మన్యం-5, అల్లూరి-2, విజయనగరం-2, తూర్పు గోదావరి-1 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. పలు ప్రాంతాల్లో పిడుగులు, గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. చెటల క్రింద, శిథిల గోడలు, భవనాల వద్ద ఉండొద్దని అధికారులు సూచించారు. ఏపీలో మిగితా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రక్షణరంగ కొనుగోళ్లకు రూ.40 వేలకోట్లు ఆమోదం

## రక్షణశాఖ కొనుగోళ్ల కమిటీ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, మే 17:** భారత్‌పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణ దళాలకు మరింత బలాన్ని ఇచ్చేలా భారీ ప్రోత్సాన్ని అందించనున్నారు. పరిశోధన, ఆయుధాలు, మందుగుండు, యుద్ధ సామాగ్రిని కొనుగోలు కోసం రూ.40 వేల కోట్లకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. అత్యవసర అధికారాల కింద ఈ కొనుగోళ్లకు ఇటీవల రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక ఉన్నతాధికారుల సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అత్యవసర అధికారాల కింద, రక్షణ దళాలు నిఘా డ్రోన్లు, కమికజ్ డ్రోన్లు, లాంగ్ రేంజ్ లూటరింగ్ క్షిపణులు, రాకెట్లు వంటి సామగ్రిని కొనుగోలు చేయడంపై రక్షణ శాఖ దృష్టి సారిస్తుంది. అత్యవసర అధికారాల కింద ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పరికరాలను నిర్ణీత వ్యవధిలోపు బలగాలను అందిచాలని నిర్ణయించారు. గత ఐదు సంవత్సరాల్లో ఇలా కొనుగోలు కోసం కేటాయించడం ఇది ఐదోసారి. రక్షణ ఆర్థిక విభాగం, ఆర్థిక సలహాదారులతో కలిసి ఈ కొనుగోళ్లను చేస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్‌స్థావరాలపై దాడి చేయడానికి ఉపయోగించిన రాంపేజ్ మిసైల్ కూడా కూడా అత్యవసర కొనుగోలు అధికారాల కింద రక్షణ దళాలు కొనుగోలు చేశాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రత్యక్ష కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఉపయోగించిన హెరాన్ మార్క్2 డ్రోన్‌లను కూడా భారత్ ఇలానే కొనుగోలు చేసింది.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.50వేల కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని సంబందిత వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఆ దిశగా సన్నాహాలు చేస్తుందని తెలిపాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం విధిగా లభిస్తుంది. దీంతో డిఫెన్స్‌కు కేటాయించిన నిధులు రూ. 7లక్షల కోట్లు దాటేస్తాయి.

# మహిళలకు ఉచిత బస్సు

>> నెల్లూరు, కడపలో అందుబాటులోకి వస్తాయి. వీటి వల్ల 90 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండే చెత్త ఎనర్జీగా తయారవుతుంది. పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులు శుభ్రం చేయబోతున్నాం. చెరువుల మట్టుల వాకింగ్ ట్రాక్స్ వేస్తాం. 123 మున్సిపాలిటీ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లు పెట్టాం. అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఓడీఎఫ్ ప్లస్ గా నిలిచాయి. 15, 995 గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గా చేయాలని నిర్ణయించాం. 2026 మార్చి నాటికి పందశాతం ఓడీఎఫ్ ప్లస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మరికొన్ని రైతు బజార్ల ఏర్పాటు .....రైతులకు గిట్టుబాటు ధర రావాలి, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందాలనే లక్ష్యంతో 1998లో నేను రైతు బజార్ లు ప్రారంభించాను. పల్లె వెలుగు పేరుతో ఆర్టీసీ బస్సులు ప్రారంభించాం. బస్సు వెనుక సీట్లు ఖాళీ చేయించి అందులో కూరగాయలు వేసి రైతు బజార్లకు రైతులు తరలించేలా ఏర్పాట్లు చేశాం. దీనివల్ల దళారీ బెడద తగ్గించాం. రూ.6 కోట్లు కేటాయించి కర్నూలులోని రైతుబజార్ ని ఆధునికీకరిస్తాం. ప్రస్తుతమున్న 125 రైతు బజార్ల సంఖ్యను పెంచుతాం. ఒకప్పుడు మొబైల్ రైతు బజార్లు కూడా విజయవంతంగా నడిపించాం. సీమ అభివృద్ధి నా బాధ్యత...... నేను సీమ బిడ్డను సీమ అభివృద్ధి నా బాధ్యత. ఒకప్పుడు రాయలసీమ అంటే కరువు, ఫ్యాక్షన్ అనేవారు. నేను వచ్చాక సీమలో ఫ్యాక్షనిజం మాటే వినబడకుండా చేశాను. కరువు రక్కసి నుంచి సీమ ప్రజలను కాపాడాను. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తాం. ప్రస్తుతం సీమలో 18 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ ఉంది. రాబోయే ఐదేళ్లలో 36 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ పెడతాం. 16 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లు వారు పట్టించుకోలేదు. మైక్రో ఇరిగేషన్ కింద ప్రతి రైతుకు 10 ఎకరాల వరకూ 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. సీమ నాలుగు జిల్లాలకూ నాలుగు ఎయిర్ పోర్టులు (తిరుపతి, కడప, పుట్టపర్తి, ఓర్వకల్లు) ఉన్నాయి. టీడీపీ చొరవతో ఈ జిల్లాలకు జాతీయ రహదారులు అనుసంధానమయ్యాయి. రాబోయే రోజుల్లో సీమ గ్రీన్ ఎనర్జీకి హబ్ గా తయారవుతుంది. సోలార్ ఇక్కడి నుంచే ఉత్పత్తవుతుంది. విండ్ ఎనర్జీ ఇక్కడి నుంచే వస్తుంది. దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి సీమ కేంద్రంగా పనిచేస్తుంది. ఓవైపు సంక్షేమం మరోవైపు పెట్టుబడులుఎన్డీఏ ప్రజా ప్రభుత్వం. అర్హులకు సంక్షేమం అందిస్తూనే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నాం. ఇప్పటికే 76 ప్రాజెక్టులు తెచ్చాం. రూ.4.96 లక్షల పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా రాష్ట్రంలో 4.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 4 వేలు మొదలు రూ. 15 వేల వరకూ పింఛను అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాం. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. స్కూళ్ల తెరిచేలోగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు జమ చేస్తాం. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. సోలార్ వెలుగులు తెస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటిపై కరెంటు తయారీ సౌకర్యం కల్పిస్తాం. అందరం కలిసి పేదలకు అండగా ఉందాం. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా రూపుదిద్దుకుందాం. అవసరమైన సంక్షేమ పథకాలన్నీ అందజేస్తాం. ఆదాయాన్ని పెంచే మార్గం చూపిస్తాం. పేదల జీవితాల్లో వెలుగు తేవడానికి పని చేస్తా. నేను పడే కష్టం నా కోసం, ధనవంతుల కోసం కాదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండే నిర్భాగ్యులు తృప్తిగా ఉండాలని ఆలోచిస్తున్నాను. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్తలను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హైదరాబాద్-విశాఖ ఇక 8 గంటలే!

>> 31 గ్రామాల్లో 19వందల 96 ఎకరాలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 56.7 కిలోమీటర్ల మేర ఈ రహదారి విస్తరించింది. దీనిని రెండు ప్రాజెక్టులుగా చేపట్టారు. గత ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. మొదటి ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తవ్వగా రెండో ప్రాజెక్ట్ లో 70 శాతం మాత్రమే చేశారు. ఇంకా మూడు కిలోమీటర్ల మేర అసలు రహదారి పనులు మొదలు పెట్టలేదు. భూ సేకరణ అంశం కొలిక్కి రాకపోవడంతో మూడు కిలోమీటర్లు పనులు నిలిచిపోయాయి. ఖమ్మందేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని హైదరాబాద్ విశాఖ మధ్య దూరం తగ్గించేందుకు ప్రధానంగా నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 676 కిలోమీటర్లు 12 గంటలపాటు ప్రయాణించాలి. ప్రధానంగా విజయవాడ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ నూతన రహదారి పూర్తయితే విజయవాడ వెళ్లకుండానే సుమారు 125 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. 8 గంటల్లోనే విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారి 162 కిలోమీటర్ల దూరంలో కేవలం 8 చోట్ల మాత్రమే దీనిపై ప్రవేశించడానికి వీలుంది. తెలంగాణాలోని ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి ఏపీలో తిరువూరు, జంగారెడ్డిగూడెం, గురవాయిగూడెం, దేవరపల్లి వద్ద మాత్రమే ఈ రహదారిపైకి రావడానికి అనుసంధాన రహదారులు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో నాలుగు చోట్ల టోల్ ప్లాజాలు, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల పరిధిలో భూ సేకరణ అంశం కొలిక్కి వస్తే అక్కడ కూడా నిర్మాణం చేపట్టి రహదారిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్రం దృష్టిని కేంద్రీకరించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్ర హోంశాఖకు ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కార్ల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ భేటీకి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్ర హోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతిహైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖకు హోంశాఖ ఆదేశాలిచ్చింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్ ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని ఏపీ ప్రభుత్వం అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని రెండు సంవత్సరాల్లో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖకు ఆదేశాలు జారీ చేసింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ సూచించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ లోని వెనకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచనలు చేసింది.



శనివారం న్యూఢిల్లీలో మంత్రి లోకేష్ తనయుడు దేవాన్ష్‌ను ఆప్యాయంగా పలుకరిస్తున్న ప్రధాని మోడీ

# ప్రధాని మోడీతో లోకేష్ భేటీ

>> 3,132 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలను ఈ కాఫీ టేబుల్ బుక్ లో పొందుపరిచారు. యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయానికి బాటలు వేసింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాన మంత్రి, పుస్తకంపై సంతకం చేసి లోకేష్‌కు మరపురాని జ్ఞాపకంగా అందించారు. ఈ సందర్భంగా లోకేష్ కుటుంబాన్ని ప్రధాని ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని ఆశీస్సులు, మార్గదర్శకత్వం కావాలని లోకేష్ కోరారు. రాష్ట్ర పురోగతికి ప్రధానమంత్రి అందించిన నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా, జాతీయ భద్రత, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ప్రధానమంత్రి బలమైన నిర్ణయాత్మక నాయకత్వానికి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ తమ వంతు సహకారం అందించేందుకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా ప్రధానిని లోకేష్ కోరారు

# మహిళలకు 'వర్క్ ఫ్రం హోం'

>> పేదలకు అందుబాటులో మెరుగైన పాలన ఇచ్చేలా ముందుకెళ్తున్నాం అన్నారు. ఇటీవలే రాష్ట్రానికి ఆదాయ వనరులను పెంచే దిశలో ఆలోచన చేసామన్నారు. ఏపీలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్'లోనే సీఎం చంద్రబాబుతెలిపారు. రూ.వేలకోట్ల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని దీనిని విక్రయించడం ద్వారాపెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు.

# 'సేఫ్‌జోన్'గా తిరుమల ఘాట్‌రోడ్లు!

>> షిమోషి ఆధ్వర్యంలో గ్రేహౌండ్స్ కమాండర్ ఎస్పీ డాక్టర్ గరుడ్‌సుమిత్‌సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్‌హఫీజ్, తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, డిఎఫ్ఒ వివేక్‌ఆనంద్, వివిధ భద్రత దళ అధికారులు కీలక సమావేశం నిర్వహించారు. తిరుమలలో, తిరుపతిలో భద్రత సిబ్బందికి రసాయన, జీవ, కిరణ, అణు ముప్పులపై శిక్షణ ఇచ్చే ప్రతిపాదనలు చేశారు. ఏపిఎస్‌పి, ఏఆర్, ఎస్‌పిఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టిటిడి భద్రత సిబ్బంది అన్ని భద్రత దళాలను సమన్వయ పరిచి ప్రతి దళానికి స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసైటీజర్స్ రూపొందించారు. ఇంకా ఇప్పటికే తిరుమల ఘాట్‌లో అడవివైపు 30అడుగుల వరకు ఫోకస్‌లైట్లు ,500ట్రాఫ్ సిసికెమెరాలు కూడా పని చేస్తున్నాయి. భద్రత విషయంలో ఇంకా పూర్తి స్థాయి అధునాతన సాంకేతిక పరికరాలు ఏర్పాటుతో భక్తులు మరింత ప్రశాంతంగా తిరుమలకు చేరుకుని పూర్తిస్థాయి రక్షణలో దేవదేవుని దర్శనం చేసుకునే వీలుకల్పిస్తున్నారు.

# నీట్ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే

>> కలిగినపుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని వారన్నారు. దీనితో హైకోర్టు ఫలితాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఫలితాలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. కాగా ఫలి తాల విడుదలకు సంబంధించిన తేదీపై ప్రభుత్వ అధికారిక ప్రకటన ఇంకా వెలువడ లేదు. 2024-25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యకళాశాలల్లోప్రవేశాలకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మే 4న పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు 23 లక్షలమంది దరఖాస్తుచేసుకోగా 20.8 లక్షలమంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల ఫలితాలను వెల్లడించాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 18-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
పంచమి ఉ.5.57
ఉత్తరాషాఢ సా.6.49
వర్జ్యం రా.10.55-12.33
దు.సా.4.45-5.37
శుభసమయం :ఉ.7.30-8.40
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

మేషం:వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వస్తులాభం. దైవదర్శనాలు.

వృషభం:నూతన ఉద్యోగయోగం. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

మిథునం: దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. బంధువులను కలుస్తారు.

కర్కాటకం : పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణ బాధలు తప్పవు. వాహనసౌఖ్యం.

సింహం: సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

కన్య : ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

తుల: కుటుంబంలో సమస్యలు ఎదురై చికాకులు పెట్టినా అధిగమించి ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

వృశ్చికం: కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విందు, వినోదాలు.

ధనుస్సు: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

మకరం: పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. నూతన వస్తు, వస్త్రాల లాభాలు పొందుతారు.

కుంభం: పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మీనం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మార్కెట్లో నాసి విత్తనాల హల్‌చల్

>> ప్యాకెట్‌ను రూ.1800 నుంచి రూ.2000లకు అమ్ముతున్నారు. వీటిపై తమకెలాంటి ఫిర్యాదులు రాలేదని వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులే సర్దుబాబు చేసే ప్రయత్నం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొన్ని హైబ్రీడ్, బ్రాండెడ్ కంపెనీల పత్తి విత్తనాలను కొనుగోలు చేసేందుకు వెళ్తున్న అన్నదాతలకు షరతులు విధిస్తున్నారు. కొంత మేరకు ఇతర కంపెనీల పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తేనే ఇస్తామని డీలర్లు షరతులు పెట్టారు. 6 ప్యాకెట్లు బ్రాండెడ్ కంపెనీలవి, మరో 4 సాధారణ పత్తి రకాల ప్యాకెట్లను విక్రయిస్తున్నారు.

విత్తనాలు కొనుగోలు చేసిన అన్నదాతలకు మాత్రం రూ.901కే రసీదు ఇస్తున్నారు. కానీ అధిక ధరలకు అమ్ముతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఎమ్మార్పీ కంటే రెట్టింపు ధరకు అమ్ముతుండటం గమనార్హం. రాయలసీమ ప్రాంతాల్లోను పత్తి నాసిరకం జోరు అధికంగా ఉంది. తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి లూజు విత్తనాలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. బహిరంగ మార్కెట్లో పత్తి విత్తన ప్యాకెట్ (450 గ్రాములు) ధర రూ.901 ఉంది. అదే లూజు విత్తనాలు కిలో రూ.1000 నుంచి రూ.1200లు తీసుకుంటున్నారు. కర్నూలు, నందికొట్కూరు, గూడూరు, కల్లూరు, కోసిగి మండలాల పరిధిలో అన్నదాతలు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

హాలహర్వి, హుళగుంద ప్రాంతాల్లోని అన్నదాతలు కర్ణాటక రాష్ట్రం బళ్లారి, శిరుగుప్ప ప్రాంతాల్లో పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ఒక ప్యాకెట్ రూ.680 నుంచి రూ.840కే లభిస్తుండటంతో వాటినే కొనుగోలు చేస్తున్నారు. పల్లెల్లో బహిరంగంగా కిలోల చొప్పున పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారు. కానీ అధికారులు ఇప్పటి వరకు ఒక్కచోట కూడా తనిఖీలు చేయకపోవడం విమర్శలు తావిస్తోంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అధికార, విపక్షాలకు చెందిన కొందరు చోటా, మోటా నాయకులు స్వయంగా రాజకీయాలకతీతంగా ఈ విత్తనాల దందా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

# తుర్కియేకు భారీ షాక్: డెస్టినేషన్ వెడ్డింగ్ మార్కెట్‌కు రూ.770 కోట్ల రాబడి నష్టం

**ఇస్తాంబుల్, మే 17:** పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న తుర్కియేకి భారత్ నుంచి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో భారతీయులు బాయ్‌కాట్ తుర్కియే పిలుపునిచ్చారు. ఈ ప్రభావం ఆదేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా డెస్టినేషన్ వెడ్డింగ్స్ ద్వారా ఆ దేశం ఆర్జించే ఆదాయంపై తీవ్ర ప్రభావంచూపింది. ఈ పరిణామాల వల్ల టర్కీ దాదాపు 90 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని నష్టపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొంతకాలంగా విదేశాల్లో వివాహాలు చేసుకోవాలనుకునే భారతీయ సంపన్నులకు తుర్కియే ఒక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇస్తాంబుల్‌లోని చారిత్రక రాజభవనాలు, అందమైన సముద్ర తీర ప్రాంతాలు నూతన వధూవరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో 2018లో కేవలం 13 భారతీయ జంటలు తుర్కియేలో పెళ్లి చేసుకోగా, గత ఏడాది నాటికి ఈ సంఖ్య ఏకంగా 50కి చేరింది. ప్రముఖ వెడ్డింగ్ ప్లానింగ్ సంస్థ కెస్టోన్ ఉత్సవ్ సీనియర్ ప్రతినిధి నిఖిల్ మహాజన్ మాట్లాడుతూ భారత్ నుంచి డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం తుర్కియేకి వెళ్లే వారి ద్వారా ఆ దేశ పర్యాటక రంగానికి ఏటా సగటున 140 మిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తోందన్నారు. సాధారణంగా ఒక్కో వివాహానికి సగటున 3 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 కోట్లు వరకు ఖర్చవుతుందని, కొన్ని సందర్భాల్లో ఇది 8 మిలియన్ డాలర్లు మన కరెన్సీలో సుమారు రూ. 68 కోట్లు వరకు కూడా ఉంటుందని అక్కడి గణాంకాలు తెలియజేస్తున్నాయి. పెళ్లికి హాజరయ్యే అతిథులు స్థానికంగా పర్యటించడం వల్ల కూడా టర్కీకి అదనపు ఆదాయం సమకూరుతోంది. అయితే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆదేశం బహిరంగంగా మద్దతు ప్రకటించడం భారతీయులతీవ్ర ఆగ్రహానికి కారణమైంది. దీంతో దేశవ్యాప్తంగా బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఇప్పటికే దాదాపు 2,000 మంది భారతీయ పర్యాటకులు తమ తుర్కియే పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఈ ఏడాది ఆదేశంలో వివాహం చేసుకోవడానికి సుమారు 30 భారతీయ జంటలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. కానీ ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో వీరంతా ప్రత్యామ్నాయ వివాహ వేదికలను ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల తుర్కియే సుమారు 90 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 770 కోట్లు ఆదాయాన్ని కోల్పోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నిరసన పర్యాటకం, వివాహాలకే పరిమితం కాలేదు. ఆదేశంతో వ్యాపార సంబంధాలను కూడా భారతీయులు క్రమంగా తగ్గించుకుంటున్నారు. పండ్లు, ఆభరణాల వ్యాపారులు అక్కడినుంచి దిగుమతులను నిలిపివేయాలని నిర్ణయించుకున్నారు. అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) కూడా తుర్కియే కంపెనీలతో ఎలాంటి వ్యాపార సంబంధాలు పెట్టుకోవద్దని పిలుపునిచ్చింది.

## మెగా డిఎస్సీకి రాష్ట్ర వ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు దరఖాస్తు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డీఎస్సీకి రాష్ట్రవ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. దరఖాస్తుల గడువు ఈ నెల 15 అర్ధరాత్రితో ముగిసింది. దాంతో అన్ని పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా 39,997 మంది అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి దరఖాస్తు చేయగా అత్యల్పంగా కడప జిల్లా నుంచి 15,812 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 7,159 మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 30 నుంచి హాల్‌టికెట్ల జారీకి పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ మెగా డీఎస్సీలో మొత్తం 16,347 పోస్టులు భర్తీ చేయనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జూన్ 6వ నుంచి జులై 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

## రెండ్రోజుల పాటు రైళ్లు రద్దు

**గుంతకల్లు రైల్వే,మే 17,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న రైల్వే నిర్వహణ పనుల కారణంగా రెండ్రోజుల పాటు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఆది, సోమవారాల్లో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో తిరిగే 30రైలు సర్వీసులతో పాటు జంట నగరాల్లో తిరిగే 13ఎంఎంటిఎస్ రైలు సర్వీసులను, హైదరాబాద్ డివిజన్‌లో తిరిగే 10రైలు సర్వీసులను, విజయవాడ డివిజన్‌లో తిరిగే 8రైలు సర్వీసులను, నాందేడ్ డివిజన్‌లో తిరిగే 6రైలు సర్వీసులను కలిపి మొత్తం 67రైలు సర్వీసులను ఆది,సోమ వారాల్లో రద్దు చేశారు.



## తిరుమల మఠాల్లో భద్రతపై నిశిత తనిఖీలు

**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూ కాశ్మీర్‌లో గతంలో జరిగిన ఉగ్రదాడితో ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో పోలీసు వర్గాలు భద్రతను కట్టుదిట్టంచేస్తున్నాయి. ఇందులో భాగంగా తిరుమలలో స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌తోబాటు తిరుమలలోని మఠాలు, గోగర్భమ్‌డ్యామ్‌వద్ద మఠాలను శనివారం ఉదయం తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది, బాంబుడిస్పోజల్ టీమ్, పోలీసుజాగిలాలతో తనిఖీలు చేశారు. మఠాల్లోని గదుల్లో ఉన్న భక్తులు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, శ్రీవారి దర్శనం టిక్కెట్లు ,ఆధార్‌కార్డులు పూర్తిస్థాయిలో తనిఖీ చేసి వారికి భద్రతకు సంబంధించి,అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు పై అవగాహన కల్పించారు. తిరుమలలో ఇప్పటికే భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. టిటిడి సివిఎస్‌ఒ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో శనివారం ఉదయం ఆయా ప్రాంతాల్లో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు, విజిలెన్స్ సిబ్బంది భక్తులను ,వారి ఆధార్‌కార్డులను, దర్శన టిక్కెట్లను తనిఖీ చేశారు. ఇదివరకే అలిపిరి వద్దనుండే భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు తిరుమలకొండపై డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. ఆలయం పరిసరాలు, ఆలయ మాఢవీధులుల్లో పోలీసులు, విజిలెన్స్ నిఘాతో బాటు ఆక్టోపస్ బలగాలు మొహరించి పర్యవేక్షిస్తున్నారు.

# దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలకు సెల్యూట్,

## మన సైనికులలకు అండగా ఉందాం

### - రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్య కుమార్ యాదవ్



అనంతపురంలో నిర్వహిస్తున్న తిరంగ ర్యాలీ, పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు

**అనంతపురము, మే 17 ప్రభాతవార్త బ్యూరో** భారతదేశ సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ కార్యక్రమంతో మన సైనికులు ఉగ్రవాదులను మట్టుపెట్టారని, మన సైనికులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రులు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఫీుభావంగా తెలుపుతూ తిరంగా యాత్ర నిర్వహించారు. శనివారం అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గ్రౌండ్ నుండి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా.. సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు నిర్వహించిన తిరంగా యాత్రను రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, వై.సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. మంత్రులతో పాటు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివనారాయన్ శర్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, అన్ని వర్గాల నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఎన్జీఓలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెషనల్స్, వ్యాపార సంస్థలు, టీచర్లు, పోలీసులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్స్, తదితరులు పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం మీద జరుగుతున్నటువంటి తిరంగా యాత్రలో భాగంగా ఈరోజు నా అనంతపురం జిల్లాలో హాజరైన వేలాదిమందికి హృదయపూర్వక నమస్కారాలు తెలుపుతున్నామన్నారు. దేశం ఒక్కటే అన్నటు వంటిది మన గుండెచప్పుడని ఈ రోజు అర్థం అవుతుందన్నారు. ఇంత ఉదయాన్నే వేలమంది ఇక్కడ హాజర య్యారంటే దేశభక్తి ప్రతి గుండె చప్పుడుగా మారింది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరంలేదన్నారు. మొన్నటి దాకా సైన్యంలో పనిచేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయిన ఎం.మురళినాయక్ ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగిందని, వారు మన రక్షణ కోసం చేసినటువంటి త్యాగాలకు బాసటగా నిలవాలన్నారు. త్రివిధ దళాలకు సంబంధించిన సైన్యానికి మద్దతుగా ఈ దేశం మీ వెనకాలే ఉందని, దేశం కోసం మీరు చేస్తున్న త్యాగాలకు దేశం గుర్తిస్తుందని మేము మీకోసం సెల్యూట్ చేస్తున్నామన్నారు.

## అభయా యాప్ ద్వారా రోగులకు వైద్యసేవలు

**విజయవాడ,వేం17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్పత్రులకు వెళ్ళే అవకాశంలేకుండానే అత్యావసర సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకమైన యాప్ అందుబాటులోకి వచ్చింది.ప్రభుత్వాసుపత్రులకు వెళ్ళినపుడు గతంలో రోగికి ఉన్న అనారోగ్య సమస్యలను వైద్యులు అడిగి తెలుసు కుం టుంటారు. దీని కోసం మనం పాత రికార్డులు తీసుకెళ్తుంటాం. ఒక్కోసారి అవి కనిపించకపోతే ఇబ్బందే. ఇప్పుడు ఆ అవసరం లేకుండా రోగి ఆరోగ్య చరిత్ర డిజిటలీకరణ చేస్తున్నారు. దీవల్ల సమయంతో పాటు వైద్య పరీక్షల ఖర్చులు తగ్గనున్నాయి. ప్రస్తుతం నమోదు ప్రక్రియ జరుగుతోంది.రోజుకి 50కి తక్కువ కాకుండా: ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. రోజుకు 50 మంది రోగుల వివరాలు చొప్పున ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషనరీ(ఏబీడీఎం) యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీని కోసం ఒక్కో ఆస్పత్రిలో ఒక్కో వ్యక్తిని నియమించారు. రోగి ఆధార్‌కార్డుకు అనుసంధానమైన చరవాణి సంఖ్య నమోదు చేసి,14 అంకెలతో ఉన్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య డిజిటల్ కార్డు జారీ చేస్తున్నారు.సెల్‌ఫోన్‌లో యాప్‌ను పెట్టుకునే అవకాశం కల్పించారు.

వైద్య సిబ్బంది రోగి ఆరోగ్య చరిత్ర ఏబీడిఎం యాప్‌లో నమోదు చేశాక రోగుల స్మార్ట్‌ఫోన్‌లోనే వారితోనే అభాయాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఈ యాప్ కలిగిన రోగి,

ఓపీ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిల్చోవాల్సిన అవసరం లేదు. ఓపీ చీటీలు ఇచ్చే చోట క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. చరవాణీలో ఉన్న యాప్ సాయంతో స్కాన్ చేయగానే కొన్ని వివరాలు నమోదు చేయనమి చూపిస్తుంది. ఆ విధంగా నమోదు చేస్తే ఓపీ నెంబరు వస్తుంది. ఇందులోనే రోగికి అవసరమైన వైద్యుడి వివరాలు కూడ కనిపిస్తాయి.

దాని ఆధారంగా వైద్యుడిని సంప్రదిస్తే చాలు వైద్యసేవలు సులువుగా పొందవచ్చు.

## రూపాయికే సారవంతమైన మట్టి

### -రైతుల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:** రైతుల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.రసాయన ఎరువుల వాడకంతో చప్పగా ఉన్న నేలలను సారవంతంగా మార్చుకోడానికి బహుళత ప్రయోజనాలను సర్కార్ కల్పిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వంత గ్రామాల పరిసరాల్లో ఉన్న చెరువు,జలాశయాల్లో మట్టిని పొలాల్లోకి తీసుకెళ్ళడానికి సర్కార్ అనుమతినిచ్చింది. మట్టిని పొలాల్లో కలపడం వల్ల పంట దిగుబడి రెట్టింపు స్థాయిలో వస్తుందన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా మోతాదుకు మించి వాడుతున్న రసాయన మందులు, ఎరువులకు చెక్ పెట్టడానికి ఇదొక మంచి సదుపాయంగా ప్రభుత్వం తెలిపింది. మీటర్ లోతు దాకా: చెరువు,జలాశయాల్లోని ఒండ్రు మట్టిని అన్నదాతలు తమ పొలాల్లో తీసుకెళ్ళడానికి కూటమి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఎక్కడికక్కడ జలవరనురల శాక (ఎంఐ) డివిజన్ల ఈఈలకు అర్జీ చేసుకోవాలి.నిర్ధేశిత ప్రాంతాల్లోని జలాశయాలు, చెరువు పరిస్థితిని బట్టి అనుమతిస్తారు. క్యూబిక్ మీటర్ ఒండ్రు మట్టిని తవ్వుకొని తీసుకెళ్ళడానికి రూపాయి చెల్లించాలి.,ఎప్పటికప్పుడు మట్టిని తీసుకెళ్ళాలి. గుట్టగా ఉంచకూడదు. ఒక మీటర్ లోతు దాకా మాత్రమే తవ్వుకోవాలి. జలాశయం/చెరువు కట్ట పక్కనే త్వకూడదని అధికారులు పేర్కొన్నారు. మండలాల ఏఈల ద్వారా ఈఈలకు ధరఖాస్తు చేసుకుంటే సత్తరమే అనుమతిస్తామని చెప్పారు.



## ఐ ఫోన్‌లోనూ ఎస్పీడిసిఎల్ మొబైల్‌యాప్

**తిరుపతి,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుజిల్లాల పరిధిలోని ఎస్‌పిడిసిఎల్ వినియోగదారుల సౌకర్యార్థం ఐఫోన్‌లో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ సిఎండి కె.సంతోషరావు తెలిపారు. గతంలో ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో మాత్రమే ఎస్‌పిడిసిఎల్ యాప్ వినియోగదారులకు అందుబాటులో ఉండేదన్నారు. అయితే యాపిల్ ఐఫోన్ వినియోగదారులకు కూడా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంస్థ ఐటి విభాగం ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సహకారంతో యాపిల్ ఐఓఎస్ మొబైల్‌యాప్‌ను రూపొందించామని వివరించారు. ఈ యాప్ ద్వారా ఇకపై యాపిల్ ఐఫోన్ వినియోగదారులు కూడా ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌సేవలను పొందవచ్చని సిఎండి తెలిపారు. వినియోగదారులు ఈ యాప్‌ను యాపిల్‌స్టోర్‌నుండి గానీ ఏపిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. యాండ్రాయిడ్ యాప్ తరహాలోనే ఐఓఎస్ మొబైల్ యాప్‌లో కూడా సర్వీస్ నంబర్ నమోదు/తొలగింపు ,విద్యుత్ బిల్లు చెల్లింపు, మొబైల్ నంబర్ అనుసంధానం, చెల్లింపుల వివరాలు, వినియోగదారుని వివరాలు ,బిల్లు గణింపు తదితర సేవలు వినియోగించుకోవచ్చన్నారు.

## బెజవాడలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారీ మోసం

### - నిరుద్యోగుల నుండి లక్ష రూపాయలు దోచేసిన కేటుగాళ్లు

**విజయవాడ,మే17,ప్రభాతవార్తప్రతినిధి:**నిరుద్యోగ ులకు ఉద్యోగం పేరుతో తెలివిగా ఎర వేసి,దండిగా దోచుకుని పరాయ్యారు,బెజవాడలో ఉద్యోగాలిప్పిస్తామని లక్షల రూపాయలు దోచేశారు. .ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలను ఇస్తామనే పేరుతో విజయవాడ మొగల్రాజపురం లోని నాగరాజు ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సంస్థ మోసం చేసింది.ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుండి రూ.మూడు లక్షల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేశ్వారు నాగరాజు ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకులు.,..మాచవరం పోలీసు స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చినా న్యాయం జరగలేదని విజయవాడ పోలీసు కమీషనర్‌ను కలిసేందుకు వెళ్ళారు భాధితులు.రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది భాధితులు ఉన్నారని అంటున్నారు భాధిత నిరుద్యోగులు.ఫిర్యాదు చేసి నెలరోజుల గడిచినా ఇప్పటి వరకు అరెస్ట్ చేయలేదని భాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థ ప్రతినిధులు నాగరాజు అండ్ అండ్ హెచ్ఆర్ శిరీషను అరెస్ట్ చేయకుంబా మాచవరం పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని మండిపడుతున్నారు.మోసపోయిన వాళ్ళందరూ ఒకేసారి వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకునే సరికి పది సంవత్సరాలైనా సమయం పట్టవచ్చు అని హేళనగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. దీంతో...చేసేది లేక విజయవాడ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన భాధితులు తమకు న్యాయం చేయాలని సీపీ రాజశేఖర్ బాబు వేడుకుంటున్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులకు రు.25.65 కోట్లతో టెండర్లు



**రాజంపేట అర్బన్, మే17 ప్రభాతవార్త** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్ డి ఎస్ ఎ) హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులపై దృష్టి సారించింది. శ్రీశైలం ప్రాజెక్టు సమగ్రతకే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించిన తర్వాత జలవనరుల శాఖ స్పందించి వెంటనే రక్షణ పనులు ఈ సీజన్లోనే చేపట్టేందుకు 25.65 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం రక్షణ పనులు చేపట్టేందుకు టెండర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద ఉధృతి ఏటా పెరుగుతుండడంతో డ్యామ్ రక్షణకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి అనివార్యమని ఇప్పటికే నిపుణులు హెచ్చరించారు. ఈ హెచ్చరికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ సేఫ్టీ అథారిటీ కి ఓ లేఖ రాసింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించి సలహాలు, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ఎన్ డి ఎస్ ఏ చైర్మన్ అనిల్ జైన్ గత నెల 29న శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. కేంద్ర జల సంఘం (సి డబ్ల్యూ సి) సహాయాన్ని కూడా తీసుకొని డ్యామ్ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఎన్డిఎస్ఏ సిఫార్సు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దిగువ కుడిగట్టు పటిష్టపరిచేందుకు నిర్ణయం తీసుకుంది. అలాగే 780 అడుగుల నుంచి 550 అడుగుల వరకు కూడా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు 20.93 కోట్లతో టెండర్లను పిలిచారు. అలాగే కుడి, ఎడమ కొండగట్టులకు 904 అడుగుల పైన గల భాగంలో షాట్ క్రీటింగ్ చేపట్టాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు 4. 72 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఈ రెండు పనులకు టెండర్లను ఆహ్వానిస్తూ శ్రీశైలం ప్రాజెక్టు ఎస్.ఇ. టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు దాఖలు చేసేందుకు జూన్ 2 చివరి గడువుగా పేర్కొన్నారు.

## పోలవరంపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,మే 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఉద్ధరిస్తున్నామని చెప్తున్నవన్నీ పచ్చి అబద్ధాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు.రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంలో జీవం తీసి కుట్రపూరితంగా జీరో చేశారన్నారు."ఎక్స్" వేదికగా ప్రాజెక్ట్ లో నీటి నిల్వ ఎత్తు 45.7 మీటర్ల నుంచి 41.15కు తగ్గించి విధ్వంసం చేశారు. నీటి నిల్వ సామర్థం 119.4 గిలీదిలకు కుదించి బహుళార్థ సాధక ప్రాజెక్టు కాస్త బ్యారేజీగా మార్చారు. ఆర్ఆర్ ప్యాకేజీని ఎగ్గొట్టేందుకు పోలవరాన్ని మొత్తంగా చంపేశారు. కేవలం రూ.22వేల కోట్ల మిగులు కోసం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ ఘోరంగా దెబ్బతీస్తుంది. గ్రావిటీ బేస్డ్ ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించి ఎత్తిపోతల పథకంగా మారుస్తున్నారు. 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే కుడి, ఎడమ కాలువలకు సహజంగా నీరు పారదనే నిపుణుల హెచ్చరికలు బేఖాతర్ చేస్తున్నారు. ఎత్తు తగ్గింపుతో ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుంటే కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా మోడీ గారి ప్రయోజనాలే మిన్న అన్నారు. నీటి నిల్వ ఎత్తు తగ్గింపుపై చంద్రబాబు గారి తీరు చూస్తుంటే "జంకు లేని బొంకు తత్వం" అన్నట్లు ఉంది. బనకచర్ల మీదున్న ప్రేమ బాబు గారికి పోలవరం మీద లేదు. అనుసంధానం అనుమతుల మీద పెట్టిన శ్రద్ధ .. పోలవరానికి పూర్తిస్థాయి నిధుల సాధన మీద పెట్టడం లేదు.పార్లమెంట్ వేదికగా 41.15 మీటర్ల నీటి నిల్వ ఎత్తు వరకే నిధులు పరిమితం చేస్తామని బీజేపీ చెబుతుంటే నిలదీసే దమ్ము కూటమిలోని టీడీపీ, జనసేన సభ్యులకు లేదు. పోలవరానికి శుభవార్త చెప్తామంటూ ఈ నెల 28న సమీక్ష చేస్తున్న ప్రధాని మోడీకి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరం బాధ్యత పూర్తిగా కేంద్రానిదే. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఫేజ్ 1, ఫేజ్ 2లు మాకొద్దు అన్నారు. మొదటి దీశళి ప్రకారం నీటి నిల్వ సామర్థం 45.7 మీటర్ల ఎత్తుకు ప్రాజెక్ట్ నిర్మాణం ఇప్పుడు జరగాల్సిందే. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 194.6 టీఎంసీలుగా ఉండాల్సిందేనన్నారు. పోలవరం ద్వారా 30 లక్షల ఎకరాలకు సాగునీరు, 28.50లక్షల మందికి తాగునీరు ఇవ్వాల్సిందే. 45.7 మీటర్ల ఎత్తు ప్రకారం ళి ళి ప్యాకేజీలో మిగిలిన 94వేల కుటుంబాలకు 100శాతం పరిహారం ఇవ్వాలన్నారు. మీ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, పోలవరం ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రజలు, రైతాంగం పక్షాన చేతులు జోడించి వేడుకుంటున్నామన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమల పరిశుభ్రత మనందరి బాధ్యత

### - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అదనపు ఇఒ చౌదరి



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రం తిరుమల పరిశుభ్రత మనందరిపై ఉందని, ఇక్కడకు వచ్చే యాత్రికులు కూడా స్వచ్ఛతిరుమలకు సహకరించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తిరుమల క్షేత్రానికి లక్షమంది భక్తులు వస్తున్నారని, పరిశుభ్రత కాపాడుకోవాల్సిన అవసరం స్థానికులపై కూడా ఉందన్నారు.స్వచ్ఛతకు తిలోదకాలు ఇవ్వకుండా భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు.వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుని భక్తులకు దుకాణాల వద్ద మంచినీరు అందించి పరోపకారం చేయాలన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఉదయం తిరుమలలోని బాలాజీనగర్‌లో స్వచ్ఛతిరుమల కార్యక్రమం చేపట్టారు. డిప్యూటీ ఇఒ సోమన్‌నారాయణన్,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఆరోగ్యఅధికారి మధుసూదన్,విఎస్‌ఒ సురేంద్ర,ఆరోగ్యవిభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి శనివారం మధ్యాహ్నం తిరుమలకు చేరుకున్నారు. పద్మావతివిశ్రాంతి భవనం సముదాయంలోని శ్రీకృష్ణ అతిధిగృహం వద్ద కేంద్రమంత్రికి డిప్యూటీ ఇఒ (ఆర్1)భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుంటారు.


## శ్రీవారి దర్శనంతో ఆనందం:మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని మహారాష్ట్ర మంత్రి రాధాకృష్ణ తెలిపారు.తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పక్కాగా ఆలయాల నిర్వహణ

### - నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీపనైవేద్యాలకు సహకారం :టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 17 ప్రభాత వార్తప్రతినిధి:** సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోనికి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పక్కాగా నిర్వ హించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు దోహదపడుతాయని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. నిరాదరణకు గురైన ఆలయాల ధూపదీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు,వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలనభవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, ఎఫ్ఎసిఎఒ బాలాజీ. సిఇ సత్యనారాయణతో కలసి ఇఒ శ్యామలరావు సమీక్షించారు. శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పున:సమీక్షించుకుని మరింత మెరుగ్గా, పారదర్శకంగా ఉండేలా ప్రణాళికలు తయారుచేయాలని ఇఒ ఆదేశించారు. సనాతనధర్మాన్ని జనంలోకి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివని, ఆలయాల నిర్మాణాలతో దైవచింతన,ఆధ్యాత్మికత, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే సమరసత సేవాఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్మితమవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధారణ పనులు ఏ దశలో ఉన్నాయో నివేదిక తయారుచేయాలన్నారు. ఆలయాల నిర్మాణం జరుగుతున్నపుడు, పూర్తయిన తరువాత ఆలయాల నిర్వహణను టిటిడి తరచూ తనిఖీలు చేపట్టాలని ఇఒ సూచించారు.


## వేసవిసెలవులు.. వారాంతం - భక్తులతో కొండ కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు



**తిరుమల,మే 17 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవి సెలవులు.. ఆపై వారాంతం శని,ఆదివారాలు కలసి రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఐదుగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు....ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 49వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు రావడం పరిపాటి.

## తిరుమలను పలకరించిన 'నైరుతి' - మోస్తరు వర్షంతో భక్తులకు ఉపశమనం



**తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతిరుతుపవనాలు సకాలంలో ప్రభావం చూపడంతో శనివారం సాయంత్రం కొంతసమయం మోస్తరుగా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చల్లటిగాలులు వీచినా సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో వర్షం మొదలైంది. బలమైన గాలులు, వర్షంతో తిరుమలకొండ సేదదీరింది. వేసవిలో ఎండవేడికి తట్టుకోలేని భక్తులకు కాస్త వర్షం ఉపశమనం కలిగించింది.

టీవల మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వం ధాన్యంసేకరణలో వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. రైతులు చనిపోతుంటే పట్టించుకోకుండా అందాల పోటీల మీద రివ్యూలు పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. రోమ్ నగరం తగులబడుతుంటే నీరో చక్రవర్తిఫిడేల్ వాయించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో వచ్చే పదిరోజుల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. రైతులు సాగు స్నాహాలు చేసుకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపు కాస్తున్నారు. ధాన్యం ఎప్పుడు మిల్లుకు తరలిస్తారో కొందరు ఎదురు చూస్తుంటే, మరికొందరు నగదు ఎప్పుడు బ్యాంకు ఖాతాలో చేరుతుందో అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన దొడ్డు,సన్నరకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధరకు మొత్తంరూ.3328.36 కోట్లు రైతులకు చెల్లించలేదు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. పౌర సరఫరాల సంస్థకు చెందిన ఓపీఎంఎస్ సాఫ్ట్వేర్ పోర్టల్లో ధాన్యం కొనుగోళ్ల వివరాలు నమోదు చేశాకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ఇంకా తెలంగాణలో 19 లక్ష మె.ట.పైగా వివరాల నమోదు చేయాల్సి ఉంది.సివిల్ సప్లయ్ సన్నాలకు చెల్లించాల్సిన బోనస్ బకాయిలు ఖరీఫ్‌కు చెందినవి రూ.250 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రబీ సీజన్ సన్నాలకు సంబంధించి రూ.767కోట్ల బోనస్ చెల్లింపులు ఇంకా చేపట్టలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో కనీస వసతులు లేక వడదెబ్బతో ధాన్యం రాశులపైనే రైతులు ప్రాణాలు వదులుతున్నా రని, ఇవి ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని హరీష్ డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ బిఆర్ఎస్ డిమాండ్ చేస్తే రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

# మబ్బులు ముసురుతున్నా రైతుకు వెతలే!

భాగ్యనగర్ భాస్కర్ కుమార్

'నాదని భూమిని నమ్మేవాడికి నాగలిపట్టి దున్నేవాడికి ఉన్నది ఎంతో సంతృప్తి ఉందిరా సుఖ సంపత్తి' -1971లో వచ్చిన రైతుబిడ్డ సినిమాలో కొసరాజు రాసిన పాటకు భిన్నంగా ప్రపంచీకరణతో వచ్చిన మార్పులతో రైతుబతుకు తల్లకిందై 'అన్నదాత జీవితమల్లా అశాంతేరా' అని పాడుకొనేలా తయారైంది. ప్రకృతి ప్రకోపంతో ఓవైపు తెలంగాణ రైతు తల్లడిల్లుతుంటే మరోపై ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులు తాలు, తరుగు, చేట, సడెం అంటూ కొల్లగొడుతున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతుక్వింటాకు 10కిలోల తరుగుతీస్తున్నారని ఆత్మ హత్య చేసుకున్నారు. ముగిసిన వ్యవసాయ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి రైతుల నుంచి రూ.6283 కోట్లు మార్కెట్‌లో దళారులు దోచుకున్నారు. రబీ సీజన్‌లోనే ఇప్పటి వరకు 13లక్షల టన్నుల ధాన్యం తరుగు, తాలు రూపంలో దళారుల గిడ్డంగుల్లోకి చేరుతోన్నది. టన్ను ధాన్యానికి 22వేల చొప్పున ధర కడితే సుమారు రూ.2860 కోట్లు. ఈ సీజన్ రైతు కష్టాన్ని దోచుకున్నారు. ఖరీఫ్,రబీ సీజన్‌లో 281లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తెలంగాణలో జరిగింది. యాసంగి సీజన్‌లోనే 127లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా అందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి వస్తాయని అంచనా వేశారు. శుక్రవారం నాటికి 44.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 40కిలోల గన్నీ బ్యాగు 850 గ్రాముల బరువు వుంటుంది. ధాన్యం తూకం వేసేప్పుడు 40.850 గ్రామలు మాత్రమే తూకం వేయాలి. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తాలు, తేమ అంటూ పేచిపెడుతూ నాలుగున్నర కిలోలు అధికంగా తూకం వేస్తున్నారు. క్వింటాల్‌కు పది కిలోలు తరుగు దళారుల జేబుల్లో నింపుకొంటుంటే రైతు కళ్లలో కన్నీళ్లు నింపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ధాన్యం సేకరణలో కూడా జాప్యం జరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇద్దరు మహిళా రైతులతో పాటు పదకొండు మంది రైతులు ఎండదెబ్బతో మృతి చెందారు. ఒక రైతు తాను అమ్మకాని తీసుకొచ్చిన వరిధాన్యం కుప్పపైనే మృతి చెందిన హృదయవిదారకమైన దృశ్యం ఈ రబీసీజన్‌లో ఆవిష్కృతమైంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్లకు చెందిన ఎండీ యాకూబ్ 38 రోజుల క్రితం వరి కోసి గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. పూర్తిస్థాయిలో ఆరబెట్టిన తరువాత తేమశాతం వచ్చినా తన వడ్లు కాంటాలు పెట్టకుండా తాత్సారం చేస్తుండటంతో సోమవారం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యా



యత్నం చేశాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మడానికి అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు.సాయంత్రం ఆకాశం మేఘావృతం వుతుండటంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత ఉండటంతో ధాన్యం తడిసిపోతుందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దాదాపు 60 శాతం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు దుబాటులో లేవు. కేంద్రాలకు ఊహించిన దానికంటే ఎక్కువ ధాన్యం రావడంతో జాప్యం భగుతోంది. దీనికితోడు తేమ పేరుతో కేంద్రాల నిర్వాహకులు అధిక తూకం వేస్తుండటంతో కర్షకులు నష్టపోతున్నారు. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోతుండటంతో అనంతకోటి దరిద్రాలకు శతకోటి ఉపాయాలు అన్నట్లుధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దొంగలు కూడా పెరిగిపోతున్నారు. రాళ్లతో రైతులపై దాడులు చేసి ధాన్యం ఎత్తుకుపోయే ముఠా కూడా ఇటీవల తయారైంది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొందరు తమ అక్రమార్జనకు అనువుగా మలచుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించటంతో అన్నదాతలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి వారు నానా తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కుటుంబ సభ్యులందరూ శ్రమిస్తున్నారు. తెలంగాణలో యాసంగిలో 54.89లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 8381ఇందిరా క్రాంతి, పీఏసీఎస్. మార్కెట్యార్డు, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దొడ్డురకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320,సన్నరకానికి రూ.2,320, బోనస్ రూ.500లను ప్రభుత్వం ప్రకటించింది. వరికోతలు పూర్తిచేసి నెలరోజులు గడిచింది. 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రబీలో పంట దిగుబడిగా వస్తుందనీ అంచనా వేయగా 100లక్షల మెట్రిక్ టన్నులలోపే దిగుబడి అయింది 70లక్షల మె.ట ధాన్యం కొంటామనీ ప్రభుత్వం ప్రకటించినా కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేక తేమ యంత్రాలు పనిచేయక అకాల వర్షంతో కొనుగోళ్ల జాప్యం చేయడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. తూకాల్లో జాప్యం, లారీల కొరత రైతులకు తీవ్ర మానసిక ఇబ్బందిగా మారింది. అకాల వర్షాలతో పలుకొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. భారీ ఈదురుగాలు లకు టార్పాలిన్లు ఎగిరిపోతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో దోపిడి మాత్రం ఆగడంలేదు. తుంగతుర్తి మండలంలోని కేంద్రాల నిర్వాహకులు కొందరు రైతుల నుంచి వంద బస్తాలకు ఒక డబ్బా, ఆపైన బస్తాలకు బస్తా వడ్లు వసూలు చేస్తున్నారు. తామేమీ తక్కువ కాదన్నట్లు హమాలీలు కూడా అదనంగా వడ్లుకాదంటే నగదు వసూలు చేస్తున్నారు.వాస్తవానికి ధాన్యం బస్తా 41కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41,200 కిలోలు తూకం వేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాకు అరకిలో దగాచేస్తున్నారు. దీనికితోడు లారీ డ్రైవర్ మామూలు పేరుతో బస్తా ఒక్కంటికి రూ.2చొప్పున వసూలు చేస్తున్నారు. నిర్వాహకులు ఇప్పటికే ఒక్కో కేంద్రం నుంచి 30 క్వింటాళ్ల వరకు రైతుల పేరునలారీల్లో తరలించినట్లు తెలుస్తోంది. కొనుగోళ్ల పూర్తయ్యే నాటికి నిర్వాహకులు, హమాలీలు కలిసి ఇంకెంత సమకూర్చుకుంటారోనని రైతులు వాపోతున్నారు.ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో నిజామాబాద్ జిల్లా లోని ధర్పల్లి.ఇందల్వాయి, నందిపేట,రెంజల్ మండలాల్లో రైతుల నుంచి లారీ డ్రైవర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో లింగంపల్లి, నిజాంసాగర్ తదితర మండలాల్లోనూ ఇదే సమస్య. మహబూబా బాద్ జిల్లాలోని పెద్దవంగర, నర్సింహుల పేట, ఇనుగుర్తి మండలాల్లోని కొన్ని సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలు, మరికొన్ని ఐకేపీ కేంద్రాల వద్ద ఎంతో కొంత ఇవ్వకపోతే ధాన్యం తరలించడం లేదని రైతులు వాపోతున్నారు.వరంగల్ జిల్లాలో బస్తాకు ఇంత అని కాకుండా ధాన్యం అమ్మిన రైతు నుంచి రూ.300వసూలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయలేని పరిస్థితుల్లో డబ్బులు ఇవ్వక తప్పటంలేదని రైతులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం మిల్లుకు చేరేవరకు వారం పదిరోజుల అవుతుండటంతో ఎండిపోయి బరువు తగ్గుతోందని బరువుతగ్గిందని కోత పెడుతున్నారని రైతుల అంటున్నారు. లారీ డ్రైవరు కూడా బస్తాకు రూ.2 చొప్పున ఎన్ని బస్తాలుతెస్తే అన్ని రూపాయలు ముడుపులు చెల్లించుకుంటున్నారు రైతులు. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్న ఈక్రమంలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిల్లు వద్ద క్వింటాకు రూ.5 ఇస్తుంటే కొనుగోలు కేంద్రం వద్దక్వింటా లారీలోకి ఎక్కిస్తే రూ.14నుంచి రూ.15 ఇస్తుంటారు. దీంతో హమాలీలు.. పక్క జిల్లాల్లో కొనుగోళ్ల వద్దకు వెళ్తున్నారు. దీంతో లారీల్లోంచి ధాన్యం మిల్లుల వద్ద ఆన్ లోడింగ్ ఆలస్యమవుతోంది. ఇది సదరు మిల్లరు ట్రక్ట్ తయారీపై పడుతోంది. కాంటా వేశాక మిల్లుకు తరలించటంలో ఆలస్యం ఆన్లోడింగ్లో జాప్యంతో వడ్లు ఎండిపోతున్నాయి. కాంటాలు వేసిన చోట తూకానికి.. మిల్లరు ఇచ్చే ట్రక్లో తూకానికి వ్యత్యాసాలుంటున్నాయి. దీంతో వివాదాలు తలెత్తుతున్నాయి. తాము అమ్మిన సరకు తక్కువగా చూపారంటూ రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు క్షేమం కోసం ప్రభుత్వం సమాజం కదలిరావాలి. ●

# మళ్లీ పేర్ల కయ్యం!

ఎ.వి.వి ప్రసాద్

అరుణాచల్ ప్రదేశ్

గిల్లికజ్జాలు పెట్టుకోవడంలో పాకిస్థాన్ కంటె రెండాకులుఎక్కువే చదివింది చైనా. కానీ పాక్ మాదిరిగా ఏ ఉగ్రవాదం మీదో ఆధారపడి ప్రత్యక్ష దాడికిప్రయత్నించదు. మూలాల నుంచి మొక్కను పెకలించే దౌత్యవివాదాల ద్వారా ఆక్రమణలకు ప్రయత్నిస్తూంటుంది. కాశ్మీర్ విషయంలో పాక్ తగాదా పడుతున్నట్లే, అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా మనమీద పెత్తనం చెలాయించాలని చూస్తోంది. ఈ తగాదా ఇప్పటిది కాకపోయినా, అప్పుడప్పుడు గుర్తుచేస్తూ భారత్‌కు శిరోభారం పెంచుతోంది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాక్‌లోని కొన్ని ఉగ్రశిబిరాలపై మన సైన్యం దాడులు జరపడంతో యుద్ధం దిశగా పరిస్థితులు పరిణమిస్తున్న వేళ.. చైనా కూడా భారత్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు మరోసారి మొదలు పెట్టింది. దానిలో ఒక భాగమే అరుణాచల్‌లోని కొన్ని ప్రాంతాలకు పేర్లు మార్చి చైనా తాను భావించిన పేర్లు పెట్టడం. పొరిగింటిలోని వారి పిల్లలకు పేర్లుమార్చాలని ఎవరైనా అనుకుంటారా! అనుకుంటే మాత్రం మార్చగలరా? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేక కాదు.. కానీ ఏదో విధంగా కయ్యానికి కాలు దువ్వాలన్నదే చైనా సంకల్పం. దాదాపు పదేళ్లుగా ఈ ' పేర్ల మార్పిడి' ప్రక్రియతో చైనా వృధా ప్రయత్నం చేస్తూనే ఉంది. భారత్ ఎన్ని రకాలుగా నిరసనలు ప్రకటించినా, దౌత్య పరంగా ఎన్ని చర్చలు జరిపినా ' అబ్బే! అదేం లేదు.. ఊరికేనే' అంటూనే అరుణాచల్ పై అధికారం చెలాయించడానికి చైనా ఏదో ఒక కుట్ర పన్నుతూనే ఉంది. అరుణాచల్ తమదే అని చెప్తూ రాష్ట్రం పేరునే 'జంగ్నాన్' గా గతంలోనే మార్చేసింది.అనేక ప్రాంతాలు,గ్రామాల పేర్లను ఇప్పటికి అయిదు మార్లు మార్పులు చేసి సొంత పేర్లతో పిలుస్తోంది. అరుణాచల్‌ను చైనాలో అంతర్భాగంగా భావిస్తూ తానుమార్చిన పేర్లతో మ్యాప్‌ను కూడా తయారు చేసి ప్రపంచానికి చూపుతోంది. ఈ దుందుడుకు చర్యలన్నిటిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ 'అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం. చైనా వాదాన్ని తిరస్కరిస్తున్నాం' అంటూ ప్రపంచ వేదికలపై ఎన్నోమార్లు ప్రకటించింది కూడా. అయినా చైనా వక్రబుద్ధిలో మార్పు రాకపోవడమే విచిత్రం. ఒక వంక పాక్‌తో తాజా ఉద్రిక్తతలు పూర్తిగా చల్లారకుండానే గతవారం చైనా కొత్త మంట పెట్టింది. టిబెట్‌కు దక్షిణ ప్రాంతంగా అరుణాచల్‌ను చైనా భావిస్తోంది కానీ భారత్ అంతర్భాగంగా మాత్రం గుర్తించడం లేదు. ఇది ప్రాదేశిక హద్దులు తెలియకపోవడం వల్ల కాదు, చైనా దురహంకార, దురాక్రమణ ధోరణి వల్లనే. భారత్ చుట్టూ ఇప్పటికే అనేక రకాలుగా, చాలా వ్యూహాత్మకంగా చైనా దురాక్రమణలకు పాల్పడుతున్నట్లే కనిపిస్తుంది. భారత్ చుట్టూ సముద్ర తీర ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా తన ప్రాబల్యం పెంచుకుంటోంది. పాక్‌లో గ్వాదర్ పోర్ట్, శ్రీలంకలో హంబంటోటా పోర్ట్,బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ పోర్ట్, మయన్మార్‌లో కయాక్ప్యు పోర్ట్‌లపై పెత్తనం సాగిస్తూతద్వారా భారత్‌కు తరచుగా ఇబ్బందులను సృష్టించే యత్నాలు చేస్తోంది. చైనా హ్యాకర్ల ద్వారా భారత్‌లోని కీలక సంస్థలపై సైబర్‌దాడులు కూడా పెంచుతోంది. ఈ చర్యలన్నీ భారత్‌కు నిరంతరం నిద్రపట్టకుండా చేయాలనే. కొద్ది రోజులుగా చైనా గూఢచారి నౌక ఒకటి భారత్ సముద్ర జలాల్లో సంచరించడం కూడా అటువంటిదే. భారతీయ నౌకల కదలికలు, నిఘా,ప్రతిస్పందనసామర్థ్యం, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా నౌక పసిగడుతోందని నిపుణులు అంటున్నారు.'ఆపరేషన్ సిందూర్' తర్వాత మన నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం ఉత్తరతీరం వైపు చాలా అప్రమత్తంగా ఉంటోంది. ఎందుకంటే పాక్‌తో తాజాగా జరిగిన పోరు తాటాకు చప్పుళ్ల వంటిది కాదు. మరికొంచెం ముందుకు వెళ్లి ఉంటే,రెండు దేశాలకు జరిగే నష్టాన్ని అంచనా వేయలేం.కానీ బెడద పాక్‌తో తప్పినంత మాత్రాన సరిపోదు కదా! అదే సమయంలో చైనా కవ్వింపులు మొదలయ్యాయి. చైనా గూఢచారి నౌకలో అత్యంత అధునాతన సెన్సర్లుకూడా ఉన్నాయనిఅంటున్నారు. వాటివల్ల మన ఐఎన్ఎస్ విక్రాంత్ సహా, యుద్ధ నౌకల కదలికలను చైనా పసిగట్టి ఏదైనా ముప్పు తేవడానికి ప్రయత్నించవచ్చు. బెల్ట్అండ్ రోడ్ ఇనీషియేటివ్ కింద చైనా పాక్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా సీపెక్ ప్రాజెక్టును నిర్మించడంపై భారత్ మొదటి నుంచి అభ్యంతరం చెబుతూనే ఉంది. అయినా చైనా ఈ ప్రాజెక్టును కొనసాగిస్తూనే ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులుండాలి. చైనా నిఘా పెట్టడానికి ఇదికూడా ఒక కారణం కావొచ్చని తెలుస్తోంది. ఇలా ఏదో ఒక రకంగా భారత్‌కు 'స్థిమితం' లేకుండా చేయడమే చైనా వ్యూహం. డ్రాగన్ దేశం ఎప్పుడు ఏం చేస్తుందోననే అంశంపై భారత్ తన దృష్టిని కేంద్రీకరించవలసిరావడంతో ప్రాధమ్యాలు కూడా మారిపోతుంటాయి. పాక్ వైపు కంటె చైనా వైపు ఎక్కువ దృష్టి పెట్టిన సమయంలో దాయాది దేశం మళ్లీ ఏ కుట్రకైనా పాల్పడవచ్చు. పేర్ల మార్పు వ్యూహం కూడా అటువంటిదే. అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు తాజాగా చైనా తాననుకున్న పేర్లను పెట్టింది. చైనా ఇలాపేర్లుమార్చడం ఇది ఐదోసారి. ఇంతకు ముందు 2017, 21, 23, 24 లో నాలుగుసార్లు చాలా గ్రామాలకు కొత్త పేర్లుపెట్టింది. దాదాపు 90 ప్రాంతాలు, గ్రామాల పేర్లను ఇప్పటిదాకా మార్చేసింది. గత సంవత్సరం నాలుగో విడతలో 30 ప్రాంతాల పేర్లు మార్చినప్పుడు భారత్ చాలా తీవ్రంగానే ప్రతిస్పందించింది.అయినా వక్రబుద్ధిమార్చుకోని చైనా గత బుధవారం (14,మే ) మరో 27 ప్రాంతాల పేర్లు మార్చినట్లు ప్రకటించింది. ఇది పైకి చిన్నదిగా కనిపించినా చాలా ప్రమాదకరమైన అంశమే. పాక్ చేసే ప్రత్యక్ష దాడి కంటే ఎక్కువ ప్రమాదకరం. భారత్ తగిన విధంగా వ్యూహం రూపొందించకపోతే ముందు ముందు మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ●




డ్రాగన్

# మరో కొత్త 'సుంకం'!

గన్ని మోహన్

అమెరికా

ప్రపంచంలో ఎన్నడూ వినని, చూడని కొత్త చట్టాలు, బిల్లులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. డోజ్ వ్యవస్థను స్థాపించి ప్రభుత్వ ఉద్యోగుల్లో కోత విధించడం, ఖజానాకు భారం అనిపిస్తే చాలు ఎలాంటి చర్యనైనా చేపట్టేందుకు ట్రంప్ వెనకాడటంలేదు. ఈక్రమంలో దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ నుంచి చీవాట్లు ఎదురవుతున్నా కూడా ట్రంప్ తనదారిలో తాను వెళ్లడం అలవాటుగా మార్చేసుకున్నారు. మనం మళ్లీగ్రేట్ అమెరికాను నిర్మిద్దాం, అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్‌నినాదమే లక్ష్యంగా వెళుతున్న ట్రంప్‌ముందు వలసదారులపై వేటువేసారు. ఫలితంగాసుమారు ఆరులక్షలమందికిపైగా స్వదేశాలకు పలాయనం చిత్తగించారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించేస్తామంటూ పుతిన్‌తో తానుమాట్లాడితే తప్ప సంధి కుదరదని చెపుతున్న ట్రంప్ పాకిస్థాన్ భారత్‌ల మధ్య నేనే మధ్యవర్తిత్వం చేసామని, ఒత్తిడి చేయడంతో రెండుదేశాలు అంగీకరించాయని అందువల్లనే అతిపెద్ద అణ్వస్త్రదాడి ముప్పు తప్పిందంటూ విదేశాల్లో సైతం ఆయన చెప్పుకుంటున్నారు. ఈ విధానాల్లో ఎలాంటి మార్పు లేకపోయినా అదేదారి అదే పద్ధతి ఎంతమాత్రం తీరుమార్చుకోని ట్రంప్ఇప్పుడు అమెరికా ఖజానా పరిపుష్టం చేసే పనిలో పడినట్లుంది. గోల్డ్‌కార్డ్ వీసానుప్రవేశపెట్టి 10 మిలియన్ డాలర్ల రుసుం విధించారు.తనకంటూ సొంతంగా ఒకకొత్త క్రిప్టో కరెన్సీని ప్రవేశపెట్టారు. అక్కడితో ఆగకుండా ఇప్పుడు ఖజానా సమృద్ధిగా ఉండాలంటే కొంత మేర కఠిన కార్యాచరణ తప్పదంటూ ఇప్పుడు ట్రంప్ వలసదారులపై మరో భారం మోపారు. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులంతా తమ స్వదేశానికి సొమ్ములు పంపించుకుంటేఐదుశాతం సుంకం విధిగా చెల్లించాలి. ఇందుకోసంఅమెరికా ఉభయసభల్లో ప్రత్యేక బిల్లును తెస్తోంది. ఈనెల 12వ తేదీనే ప్రతినిధుల సభలో ఈబిల్లు ప్రతిపాదించారు. బిల్లు అమలుకు వస్తే అంతర్జాతీయ నగదు బదిలీలపై ఐదుశాతం పన్ను విధిస్తారు. అలాగే ప్రామాణిక తగ్గింపును పెంచడం, చిన్న పిల్లలపై పన్ను క్రెడిట్ 2028 వరకూ, 2500 డాలర్లకు పెంచడం ద్వారా 2017 పన్నుకోతలు, ఉద్యోగాల చట్టాన్ని శాశ్వతం చేయాలనే లక్ష్యంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాహాటంగానే ఈ చట్టాన్ని 'గ్రేట్' అని వర్ణించారు. ఈనెల 26వ తేదీ మెమోరియల్ డే ఉన్నందున ఈలోపే ఈ బిల్లు ఆమోదింపచేసుకోవాలని ట్రంప్ యోచనచేస్తుండటం చూస్తే అమెరికాలో నివసించే ప్రతి విదేశీయుడు తన కుటుంబానికి సొమ్ములు పంపిస్తే ఐదుశాతం పన్నులు రూపంలో చెల్లించుకోవాలి. కష్టపడి సంపాదించుకున్న సొమ్ములపై మళ్లీ పన్నులేమిటని ఇప్పటికే ప్రవాసులంతా పెదవి విరుస్తున్నా ట్రంప్ మాత్రం ట్రెజరీ పరిపుష్టం కావాలంటే పన్నులుతప్ప వన్న భావనతోనే ఉన్నారు. ఒక్క భారత్‌కే విదేశాలనుంచి ఏటా 8300 కోట్ల డాలర్ల జమలు వస్తున్నాయి. అందులో అత్యధికభాగం అమెరికానుంచే కావడం విశేషం. ఇపుడు కొత్త బిల్లు అమలుకు వస్తే ప్రతి లక్ష రూపాయలకు ఎన్నారైలు ఐదువేల రూపాయలు పన్ను రూపంలో చెల్లించుకోవాలి. భారతీయ రిజర్వు బ్యాంకు నివేదికల ప్రకారం2011 సంవత్సరంలో 55.6బిలియన్ డాలర్ల జమలు భారత్‌కు వచ్చేవి. అదే 2024 నాటికి 118.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి.అంటే గత ఏడాది భారత్ అందుకున్న మొత్తం జమలలో అమెరికా నుంచే అత్యధికంగా ఉన్నాయి.అంటే27.7శాతం వాటాతోఉంది. అంటే మొత్తం 32.9 బిలియన్ డాలర్ల జమలకు ఈ 27.7శాతం వాటా సమానంగా ఉంటుంది. అంటే ఐదుశాతం చొప్పున పన్నులు విధిస్తే సుమారు 1.64 బిలియన్ డాలర్లు ప్రవాసులంతా చెల్లించుకోవాలి.గడచిన రెండు దశాబ్దాల నుంచి భారత్ అత్యధిక విదేశీ జమలు రాబట్టుకునే దేశాల్లో మొదటిదిగా ఉంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం ప్రపంచ స్థాయి చెల్లింపుల్లో భారత్‌కు అత్యధిక వాటా ఉంది. 14శాతం ఉన్నట్లు అంచనావేసింది. గత ఏడాది ఈ జమలు భారత్‌కు 129 బిలియన్ డాలర్లవరకూ వచ్చాయి. ఆతర్వాత మెక్సికో 68 బిలియన్ డాలర్లు, చైనా 48 బిలియన్‌డాలర్లు, ఫిలిప్పీన్స్ 40 బిలియన్ డాలర్లు, పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లు విదేశీ జమలరూపంలో అందాయి. ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకువస్తే ఈ దేశాలకు వెళ్లే జమలన్నింటిపైనా అదనపు భారం పడుతుంది. నిజానికి అమెరికా అంటేనే వలసదార్ల రాజ్యం అన్న పేరుంది. ప్రపంచంలోనే అత్యధిక వలసజనాభా ఉన్నదేశంగా అమెరికా నిలిచింది. ప్రపంచదేశాల నుంచి 53.3 మిలియన్ల మంది నివాసితులు అమెరికాలో ఉపాధి పొందేందుకు వచ్చినవారు, స్థిరనివాసాలు ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నవారున్నారు.మొత్తం అమెరికా జనాభాలో వీరు 15.8 శాతం వాటాతోఉన్నారు. అమెరికాలో విదేశీ సంతతి జనాభా 47.78 మిలియన్లకు చేరిందని అమెరికా లెక్కలే చెపుతున్నాయి.అంతకుముందు సం॥ కంటే 1.6 మిలియన్లు పెరిగారు. ఇక ఇతరదేశాలకంటే భారత్‌నుంచి అమెరికాకు వెళ్లి నివసిస్తున్న పౌరులు 5.4మిలియన్లమంది ఉన్నారు. అమెరికా జనాభాలో వీరివాటా 1.6 శాతంగా ఉంది.ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకు వస్తే ప్రతి లక్షకు ఐదువేలు భారత కరెన్సీలో ఎన్నారైలు చెల్లించుకోవాలి.ఈ రూపేణా ట్రంప్ అమెరికా ట్రెజరీని పరిపుష్టం చేయాలన్న బలమైన లక్ష్యంతోఉన్నారు. ప్రవాసుల కారణంగానే అమెరికన్లకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న భావనఅక్కడి అమెరికన్లలో నెలకొన్న తరుణంలోట్రంప్ విధానాలువారికి ఎంతో ఆమోదయోగ్యంగా కనిపిస్తున్నాయి. కానీ ట్రంప్ వలసదారులపై మరిన్నిఅస్త్రాలు ఎక్కుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్లిష్టకాలంలో భారత్ తనకున్న సంబంధాలను అమెరికావద్ద ప్రస్తావిస్తేతప్ప ప్రవాసులకు ఎదురయ్యే ముప్పు నుంచి తప్పుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. ●



ట్రంప్

# తుర్కియే, అజర్‌బైజాన్‌ల పర్యాటకం కుదేలు



యేచన్ చంద్రశేఖర్

పాకిస్థాన్ ప్రేరేపిత లష్కర్ ఏ తోయిషిబా అనుబంధ సంస్థగా చెప్పబడుతున్నది రెజిస్టెంట్ ఫ్రంట్ పహల్గామ్‌లో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్న తరువాత భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్" నేపథ్యంలో తుర్కియే అజర్‌బైజాన్‌లు పాకిస్థాన్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించాయి. అంతేకాదు, తుర్కియేఅందించిన మూడు నుండి నాలుగు వందల డ్రోన్‌లను భారతదేశంలోని సైనిక పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ప్రయోగించింది. లడఖ్‌లోని లేహ్ నుండి గుజరాత్‌లోని సర్ క్రీక్‌వరకు మొత్తం పశ్చిమ సరిహద్దులో 36ప్రదేశాలలో భారత గగనతలంలోకి చొరబడి డ్రోన్‌లను ప్రయోగించారని భారత ప్రభుత్వం ప్రత్యేక పత్రికా సమావేశంలో తెలిపింది. పాకిస్థాన్ పంపిన దాదాపు 400 డ్రోన్లలో, చాలా వాటిని భారత సైన్యం సమర్థవంతంగా కూల్చివేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఫోరెన్సిక్ నిపుణుల ప్రాథమిక అధ్యయనం ప్రకారం ఇవి తుర్కియేకి చెందిన 'సిస్ గార్డ్ సోంగర్" డ్రోన్లుగా తేలింది. ఇటీవలి ఘర్షణలలో అజర్‌బైజాన్ పాకిస్థాన్‌కు సైనిక సహాయం అందించినట్లు ప్రత్యక్ష ఆధారాలు లేనప్పటికీ, దౌత్యపరంగా కాశ్మీర్ సమస్యపై ఆ దేశం వైఖరిని బహిరంగంగా సమర్థించింది.భారతదేశం దాడికి పూనుకోక ముందే తుర్కియే వైమానిక దళం విమానం నగరంలో దిగిన కొద్ది రోజులకే తుర్కియే నావికాదళం యుద్ధనౌక కరాచీ ఓడరేవుకు చేరుకుంది. ఇది భారతదేశానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తుర్కియే రాష్ట్ర ప్రసారకర్త టిఆర్‌టి వరల్డ్ భారత వ్యతిరేక కథనాలను విస్తృతం చేస్తోందని, ముఖ్యంగా కాశ్మీర్ పరిస్థితికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపిస్తూ మే 14, 2025న టిఆర్‌టి వరల్డ్ అధికారిక ఎక్స్‌ఖాతాను భారత దేశం బ్లాక్ చేసింది. ఆగస్టు 2019లో ఆర్టికల్ 370 రద్దు సమయంలో తరువాత కూడా అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పదే పదే కాశ్మీర్ సమస్యను లేవనెత్తిన విషయం మనకు తెలుసు. ఇదిలా ఉంటే, గత ఐదు సంవత్సరాలలో భారత్ తుర్కియే దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 13.8 బిలియన్ డాలర్లకు చేరింది. భారత్ నుండి ఎగుమతులు 6.65 బిలియన్ డాలర్లకు తుర్కియే నుండి దిగుమతులు 3.78 బిలియన్ డాలర్లకు చేరుకున్న పరిస్థితులలో భారత్‌కు వ్యతిరేకంగా తుర్కియే పాకిస్థాన్‌తో అంటకాగడాన్ని భారతీయులు జీర్ణించుకోలేకపోయారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదముందని తుర్కియే విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొనడంతోపాటు పాకిస్థాన్‌కు సైనిక మద్దతు అందించడం, అజర్‌బైజాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ఇస్లామాబాద్‌కు మద్దతుగా పాకిస్థాన్ ప్రజలతో సంఘీభావంగా ఉంటూ, అమాయక బాధితుల కుటుంబాలకు మేము సంతాపం తెలియజేస్తున్నాము,గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము" అని ఒక ప్రకటన విడుదల చేయడం భారతీయులను తీవ్ర అసహనానికి గురిచేసింది. భారతదేశం,పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాపారులు టర్కిష్ ఆపిల్‌లను బహిష్కరించడంతో తుర్కియేని నిషేధించాలనే ధోరణి ఊపందుకుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాక్ మధ్య ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతల నడుమ తుర్కియే పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు అందించిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా తుర్కియేని నిషేధించు" అన్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 11.76 టన్నుల ఆపిల్‌లను దిగుమతి చేసుకుంది. ఇందులో పూణే మార్కెట్‌కు రూ.1,000 నుండి 1,200 కోట్ల వరకు దిగుమతి అయ్యాయి. కాగా తుర్కియే పాకిస్థాన్‌కు మద్దతు అందించిన నేపథ్యంలో పూణేలో వ్యాపారులు తుర్కియే ఆపిల్‌లను బహిష్కరించడం ద్వారా నిర్ణయాత్మక చర్య తీసుకు




న్నారు. దీంతో స్థానిక మార్కెట్ల నుండి తుర్కియే ఆపిల్‌లు ఒక్కసారిగా అదృశ్యమయ్యాయి. కేవలం వ్యాపారులే కాదు పౌరులు కూడా ఈ ఉద్యమంలో చేరడం గమనార్హం. ఈ బహిష్కరణ నగర పండ్ల మార్కెట్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. అంతేకాదు, పూణేలోని వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీ మార్కెట్‌లో ఆపిల్ వ్యాపారి సుయోగ్ జెండే ఇటీవలి రోజుల్లో తుర్కియే ఆపిల్‌లకు డిమాండ్ గణనీయంగా తగ్గిందని ధృవీకరించారు. తుర్కియే దిగుమతులకు బదులుగా హిమాచల్,ఉత్తరాఖండ్, ఇరాన్ మరియు ఇతర ప్రాంతాల నుండి ఉత్పత్తులను స్వీకరిస్తున్నామని ఈ నిర్ణయం తమ దేశభక్తికి నిదర్శనం అని ఆయన అన్నారు. స్థానిక వినియోగదారులు కూడా ఈ బహిష్కరణకు మద్దతు తెలుపుతూ మన దగ్గర ఎంచుకోవడానికి చాలా ఆపిల్ రకాలు ఉండగా మన శత్రుదేశానికి మద్దతు అందించే దేశం నుండి మనం ఎందుకు కొనుగోలు చేయాలి?" అని అంటున్నారు. పూణేతో పాటు ముంబై ఇతర ప్రధాన నగరాల్లోని వ్యాపారులు తుర్కియే ఆపిల్స్ నిల్వచేయడం మానేసి, వాటి స్థానంలో ఇరాన్, వాషింగ్టన్, న్యూజిలాండ్ సహా హిమాచల్‌ఉత్తరాఖండ్ వంటి భారతీయ రాష్ట్రాల నుండి ఉత్పత్తులను సేకరిస్తున్నారని టైమ్ ఆఫ్ ఇండియా నివేదిక ఏజెన్సీలను ఉటంకిస్తూతెలిపింది. తుర్కియే ఆపిల్స్ బహిష్కరణ ముమ్మరం కావడంతో, రిటైల్ ఆపిల్ ధరలు కిలోకు రూ. 20నుండి30 దాకా పెరిగినట్లు మరియు 10 కిలోల కార్టన్ల హోల్‌సేల్ ధరలు రూ. 200 నుండి 300 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. తుర్కియేను బహిష్కరించండి" అనే హ్యాష్‌ట్యాగ్ తరహా పిలుపు కేవలం సామాజిక మాధ్యమాల ఆగ్రహానికి మాత్రమే పరిమితం కాలేదు. పూణేలోని పండ్ల మార్కెట్లతోపాటు ఇది ఉదయపూర్‌లోని పాలరాయి యార్డుల వరకు దావానలంలా వ్యాపించింది. భారతదేశ పాలరాయి కేంద్రమైన ఉదయపూర్ నుండి తుర్కియే దిగుమతుల పట్ల తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఉదయపూర్ మార్బుల్ ప్రాసెసర్స్ అసోసియేషన్, భారతదేశానికి అతిపెద్ద పాలరాయి సరఫరాదారు అయిన టర్కీ నుండి దిగుమతులను పూర్తిగా నిలిపివేయాలని పిలుపునిచ్చిందని ప్రముఖ వార్తా సంస్థ ఏఎన్ఐ నివేదించింది. తుర్కియే పాలరాయిపై నిషేధం కోరుతూ తాము ప్రధానమంత్రికి లేఖ రాసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సురానా ఏఎన్ఐకి తెలిపారు.ప్రతిసంవత్సరం భారతదేశం దిగుమతి చేసుకునే పాలరాయిలో దాదాపు 70శాతం అంటే రూ. 2,500 నుండి 3,000కోట్లకు పైగా విలువైన 14 నుండి 18 లక్షల టన్నుల పాలరాయిని తుర్కియే నుండే సరఫరా అవుతుందని మనలో ఎంతమందికి తెలుసు? ఇటీవలి సంవత్సరాలలో తుర్కియే అజర్‌బైజాన్ రాజధాని బాకుకు భారత పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. తుర్కియే సాంస్కృతిక పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2014లో 119,503 మంది భారతీయ పర్యాటకులు ఆ దేశాన్ని సందర్శించగా, గత సంవత్సరం దాదాపు 62.2మిలియన్ల విదేశీ పర్యాటకులు సందర్శించారని అందులో 3,30,000 మంది భారతీయులు అని,ఇది గత సంవత్సరంతో పోలిస్తే 20.7 శాతం అధికమని తెలిపింది. తమ దేశ పర్యాటకరంగ ఆదాయం 2024లో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 61.1బిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 8.3శాతం అధికమని తుర్కియే పర్యాటక బోర్డుతెలిపింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, గత సంవత్సరం తుర్కియే సందర్శించిన భారతీయ సగటు సందర్శకుల ఖర్చు 972 డాలర్లుగా నమోదైంది. ఈ లెక్కన భారత పర్యాటకులు తుర్కియేని బహిష్కరిస్తే, ఆదేశానికి దాదాపు 291.6మిలియన్ డాలర్ల ప్రత్యక్ష నష్టంతో పాటు భారతీయ వివాహాలు, కార్పొరేట్ కార్యక్రమాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేసుకుంటే పరోక్షంగా మరింత ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. మరో పక్క, భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక చర్యను ఖండిస్తూ తుర్కియే అజర్‌బైజాన్ దేశాల విదేశాంగమంత్రిత్వ శాఖలు చేసిన ప్రకటనలను తప్పుబడుతూ, భారతదేశం నుండి తుర్కియే అజర్‌బైజాన్‌లకు ప్రయాణాన్ని బహిష్కరించాలని విస్తృతంగా ఆన్‌లైన్లో ప్రచారం చేపట్టగా అది ఆశించిన ప్రభావాన్ని చూపింది. దేశవ్యాప్తంగా వేలాది మంది తుర్కియే అజర్‌బైజాన్ దేశాలకు తమ ప్రయాణ ప్రణాళికలను రద్దుచేసుకోగా, టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ట్రావెల్ ఆపరేటర్లు ఈ దేశాలకు బుకింగ్‌లను నిలిపివేశారు. ●

# గుజరాత్ ఎంఎన్‌రేగాలో భారీ స్కాం

## రూ.250 కోట్లమేర నిధుల మళ్లింపు

## మంత్రి కుమారుడు సహా నిందితుల అరెస్టు



**అహ్మదాబాద్, మే 17:** రూ.71 కోట్ల ఎంఎన్‌రేగా కుంభకోణం గుజరాత్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను కుదిపేసింది, రాష్ట్ర పంచాయతీ మరియు వ్యవసాయ మంత్రి బచు ఖాబాద్ కుమారుడు బల్వంత్ ఖాబాద్ సహా నిందితులను అరెస్టు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పథకంలో భారీ అవకతవకలకు సంబంధించిన ఈ కుంభకోణం దాహోద్ జిల్లాలోని ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియా తాలూకాలలో బయటపడింది. అరెస్టును ధృవీకరిస్తూ, దాహోద్ డిప్యూటీ ఎస్పీ జగదీష్ భండారి వివరాలు తెలిపారు. ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియాలో ఎంఎన్‌రేగా కుంభకోణానికి సంబంధించి బల్వంత్ ఖాబాద్ మరియు అప్పటి తాలూకా అభివృద్ధి అధికారి (టిడిఒ) దర్శన్ పటేల్‌లను అరెస్టు చేశామన్నారు. ఈకేసులో మంత్రి చిన్న కుమారుడు కిరణ్ ఖాబాద్ పరారీలో ఉన్నాడు. ఈ కుంభకోణం మధ్యలో కేవలం కాగితాలపై ఉన్న కల్పిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రోడ్లు, బండ్లు మరియు ఇతర ప్రజా పనుల యొక్క బాగా వ్యవస్థీకృత నెట్‌వర్క్ ఉంది. ఎంఎన్‌రేగా కింద గిరిజన ఉపాధి కోసం ఉద్దేశించిన నిధులను నకిలీ సర్టిఫికెట్లు మరియు నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా మళ్లించారని, ఆ డబ్బును మంత్రి కుమారులతో సంబంధం ఉన్న ఏజెన్సీలకు మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. దేవ్‌గఢ్ బరియా మరియు ధన్‌పూర్ తాలూకాలలో ప్రాజెక్టు అమలులో పెద్ద అవకతవకలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) డైరెక్టర్ బిఎంపటేల్ గుర్తించిఆడిట్‌కు ఆదేశించడంతో మోసం బయటపడింది, బల్వంత్ మరియు కిరణ్ ఖాబాద్ నడుపుతున్న రాజ్ కన్స్ట్రక్షన్ మరియు రాజ్ ట్రేడర్స్ అనే సంస్థలు ఈ మోసాలకు పాల్పడ్డాయి. వీరిద్దరూ ముందస్తు బెయిల్ కోరుతూ ముందస్తు ఆధారాలను పొందారు. 2021 మరియు 2025 మధ్య, కువా, రెధానా మరియు సిమామోయి వంటి గ్రామాలను పూర్తయిన ఎంఎన్‌రేగా ప్రాజెక్టుల లబ్ధిదారులుగా తప్పుగా గుర్తించారు. దేవ్‌గఢ్ బరియా నుండి 28 మంది మరియు ధన్‌పూర్ నుండి ఏడుగురు 35 మంది మెటీరియల్ సరఫరాదారులు స్థానిక అధికారుల సహాయంతో నకిలీబిల్లులు సృష్టించినట్లు అధికారులు కనుగొన్నారు. ఆడిట్‌లలో కనిపించని లాగ్‌లు, ఉనికిలో లేని పని ప్రదేశాలు మరియు విస్తృతమైన డాక్యుమెంట్ ఫోర్జరీ బయటపడింది. సుమారు రూ.160 కోట్ల మోసపూరిత క్లెయిమ్‌లు పరిశీలనలో ఉన్నాయి. మరింత లోతుగా ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేయబడింది. ఇప్పటివరకు, దేవ్‌గఢ్ బరియాలో రూ.60.90 కోట్ల నకిలీ బిల్లులు మరియు ధన్‌పూర్‌లో రూ.10.10 కోట్ల నకిలీ బిల్లులను ట్రాక్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు అమిత్ చావ్డా గతంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఈ కుంభకోణం గురించి హెచ్చరించారు, ఈ మోసం దాదాపు రూ.250 కోట్లుగా అంచనా వేశారు. మంత్రి రాజీనామా చేయాలని మరియు రాష్ట్ర స్థాయిలో క్రిమినల్ దర్యాప్తును డిమాండ్ చేశారు. ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ, మంత్రి బచు ఖాబాద్ మౌనంగా ఉన్నారు మరియు అధికార బిజెపి నుంచి ఎటువంటి అధికారిక స్పందన లేదు. ప్రతిపక్షాలు మరియు పౌర సమాజం నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఒక సాధారణ ఆడిట్‌గా ప్రారంభమైన ఆడిట్ గుజరాత్‌లో అతి పెద్ద సంక్షేమ కుంభకోణాలలో ఒకటిగా పేలిపోయింది, ఇది పాతుకుపోయిన అవినీతిని బహిర్గతం చేసింది మరియు ప్రభుత్వ జవాబుదారీతనంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది.



# సత్తా చాటిన భారత్ వైమానిక రక్షణ వ్యవస్థలు

## 600లకుపైగా పాకిస్థాన్ డ్రోన్లు కూల్చివేత

**న్యూఢిల్లీ, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక దాడుల్లో భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సత్తా చాటాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను ఇవి కూల్చివేశాయి. భారత రక్షణ స్థావరాలకు ఎటువంటి నష్టం జరగకుండా కాపాడాయి. మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిస్పందనగా భారత్ సరిహద్దులోని నగరాలను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకున్నది. భారత సైనిక స్థావరాలపై దాడుల కోసం వందలాది డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. కాగా, భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా వాటిని అడ్డుకున్నాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను కూల్చడంతోపాటు ధ్వంసం చేశాయి. పాక్ డ్రోన్లను అడ్డుకునేందుకు విస్తృతమైన వైమానిక రక్షణ గొడుగును భారత సైన్యం అమలు చేసింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) నుంచి అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వరకు పలు కీలక ప్రాంతాల్లో వెయ్యికిపైగా ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను మోహరించింది. ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్, జు-23 ఎంఎం గన్, శిల్కా గన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే పెద్ద వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు 750కు పైగా స్వల్పశ్రేణి ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణి (ఎస్ఎఎం) వ్యవస్థలను కూడా భారత సైన్యం మోహరించింది. మరోవైపు భారత భూభాగంలోకి ప్రవేశించిన ప్రతి వైమానిక లక్ష్యాన్ని పర్యవేక్షించడం, ట్రాక్ చేయడం, ఎయిర్ డిఫెన్స్‌ను యాక్టివేట్ చేయడం కోసం ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఆకాశ్ తీర్ వ్యవస్థ ఎంతో కీలకంగా వ్యవహరించింది. ఈ ఇంటిగ్రేటెడ్ ఏరియల్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఎసిసిఎఫ్) ను కొన్ని నెలల కిందటే ఆకాశ్ తీర్ ప్రాజెక్టు కింద వైమానిక దళంలోకి చేర్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. నిర్దిష్టమైన పనితీరును ప్రదర్శించినట్లు వివరించారు.

# తుర్కియే యాపిల్స్ బ్యాన్ చేయండి

## వాషింగ్టన్ యాపిల్స్‌పై సుంకం రాయితీ వద్దు

## హిమాచల్ యాపిల్ సాగుదారుల డిమాండ్




**చండీఘర్, మే 17:** హిమాచల్‌ప్రదేశ్‌లోని యాపిల్ సాగుదారులు తుర్కియే యాపిళ్లను బ్యాన్‌చేయాలని డిమాండ్ చేసారు. దేశ ఆర్థిక వ్యవస్థలో యాపిల్ సాగుదారులు కీలకంగా ఉన్నారని, ఒక్క హిమాచల్‌నుంచే యాపిల్ ఆర్థికవ్యవస్థకు ఐదువేల కోట్లవరకూ అందిస్తున్నారని, అందువల్ల దేశీయ ఉత్పత్తులను ఆదరించే వీలుగా తుర్కియే యాపిళ్లను పూర్తిగా నిషేధించాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్ యాపిల్స్‌పైనా దిగుమతి సుంకాలను తగ్గించాలని, ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదని వారు కోరుతున్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్ సైనిక మద్దతుతోపాటు డ్రోన్లసాయం అందించడంపై ఇప్పటికే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ బాయ్‌కాట్ తుర్కియే పిలుపునిచ్చిన వర్తక వాణిజ్యసంఘాలకు తోడు ఇపుడు హిమాచల్ యాపిల్ సాగుదారులు కూడా తోడయ్యారు. సంయుక్త కిసాన్‌మంచ్ కన్వీనర్ హరిష్ చౌహాన్ మాట్లాడుతూ తాము త్వరలోనే హిమాచల్ గవర్నర్ శివప్రతాప్ శుక్లానకలిసి చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ గవర్నర్‌ను కలుస్తామన్నారు. అలాగేప్రధాని నరేంద్ర మోడీకి కూడా ఒక వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రం టర్కిష్ యాపిల్స్ దిగుమతులను వెంటనే నిలిపివేయాలని కోరతామన్నారు.

ఇరాన్‌నుంచి కూడా యాపిల్ పండ్లను దిగుమతిచేసుకోవద్దని, వాషింగ్టన్ యాపిల్స్ పైనా దిగుమతిసుంకాలను తగ్గించవద్దని రైతులు డిమాండ్‌చేసారు. వివిధ దేశాలనుంచి దిగుమతి అవుతున్న యాపిల్స్‌పై కనీస దిగుమతిధరలు కిలోకు 100గా ఉన్నాయి. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున సుంకం ఛార్జిచేస్తామని ప్రకటించింది. జులై మధ్యస్తం నుంచి హిమాచల్‌లో యాపిల సీజన్‌ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గత ఏడాదికంటే ఎక్కువ రావచ్చని 2.18 కోట్ల బాక్సులు పైబడి ఉంటుందని హరీష్ చౌహాన్ తెలిపారు. తుర్కియే, ఇరాన్‌లనుంచి దిగుమతి చేసుకుంటున్నందున దేశీయ యాపిల్ సాగు దార్లకు విపరీత నష్టం వాటిల్లుతోందని, తుర్కియే యాపిల్ కిలో 60 నుంచి 65కు అమ్ము తుంటే ఇరాన్ యాపిల్స్ కిలో 38 నుంచి 40 కే లభిస్తున్నాయని గుర్తుచేసారు. అదే హిమాచల్ యాపిల్ ఉత్పత్తి వ్యయం కిలోకు 40గా ఉందని, బెస్ట్‌క్వాలిటీ యాపిల్‌ను మార్కెట్‌లో రూ.50 నుంచి 60కి మించకుండా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

1.29 మెట్రిక్ టన్నులు తుర్కియేనుంచి దిగుమతి అయ్యాయని గత ఏడాది మాత్రం 1.11 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గినట్లు చౌహాన్ వివరించారు. ఇరాన్‌నుంచి 1.07 లక్షల టన్నులు దిగుమతి అవుతున్నాయన్నారు. ఇప్పటికే తాము కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను కలిసి సమస్యలు వివరించినట్లు హరీష్ చౌహాన్ వెల్లడించారు.

# ముంబయి ఎయిర్‌పోర్టులో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల అరెస్టు!



**ముంబయి, మే 17:** ముంబయి విమానాశ్రయంలో ఐసిస్ స్లీపర్ సెల్ మెంబర్స్ అని భావిస్తున్న ఇద్దరిని ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఇండోనేసియా జకార్తా నుంచి మళ్లీ భారత్‌లోకి ప్రవేశిస్తున్న అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్ వాలా, తల్హాఖాన్‌లను రెండో నంబరు టెర్మినల్ వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఎన్ఐఎ వారిని అరెస్ట్ చేసింది. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియా ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ఐసిస్ సానుభూతి పరులైన వీరు 2023లో ఉగ్రవాదుల కోసం పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ ఐఇడి, ఇతర పేలుడు పదార్థాలు తయారు చేసినట్లు గుర్తించారు. అదే కేసులో 8 మంది ఐసిస్ సానుభూతిపరులను అరెస్టు చేయగా వీరిద్దరు మాత్రం ఎన్ఐఎ కళ్లుగప్పి ఇండోనేషియా పారిపోయారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఐఈడీలు తయారుచేసిన ప్రదేశంలోనే బాంబు తయారీ వర్క్‌షాపులు కూడా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. వారిపై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. వారి సమాచారం ఇస్తే ఒక్కొక్కరికి మూడు లక్షలు ఇస్తామని ఎన్ఐఎప్రకటించింది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం, హింస, ఉగ్రవాదం ద్వారా దేశంలో ఇస్లామిక్ పాలనను స్థాపించాలన్న ఐసిస్ ఎజెండా కోసం వీరు పనిచేసినట్లు అధికారులు తెలిపారు. భారత్‌లో శాంతి, మత సామరస్యాన్ని దెబ్బతీయాలని కుట్ర పన్నారని వివరించారు అరెస్ట్ చేసిన అనుమానిత ఐసిస్ స్లీపర్ సెల్ సమయంలోనే మరోవైపు, దాదాపు రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తల సమయంలోనే ఎందుకు ముంబయి వచ్చారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వం లక్ష్య సాధన కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని వెల్లడించారు. కాగా, భారత్ ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడంలో ఈ అరెస్టులు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పహల్గాం పాశవిక దాడి చేసిన ఉగ్రవాదుల కోసం ఎన్ఐఏ బృందాలు జమ్ముకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందేర్‌బాల్, బారాముల్లా వంటి 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు.

# న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలు విస్మరించకూడదు

## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్




**న్యూఢిల్లీ, మే 17:** న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో, వాటికి ప్రతిస్పందించడంలో న్యాయమూర్తుల పాత్రను నొక్కి చెప్పారు. ఇటీవలే 52వ చీఫ్‌జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ గవాయ్‌ను బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ మానవ అనుభవాల సంక్లిష్టతను విస్మరిస్తూ, నేటి న్యాయవ్యవస్థ చట్టపరమైన విషయాలను కఠినమైన నలుపుతెలుపు పదాలతో చూడకూడదని చెప్పారు. న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడానికి మొదట్లో నేను చాలా సంకోచించాను. కానీ మా నాన్న ఓ విషయం చెప్పారు. న్యాయవాదిగా ఉండడం వల్ల బాగా డబ్బులు వస్తాయి. కానీ న్యాయమూర్తిగా పనిచేయడం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కున్న దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుందని మా తండ్రి నొక్కి చెప్పారు. అందుకే మా నాన్న సలహాకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నానని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ హైకోర్టు న్యాయమూర్తిగా 22 సంవత్సరాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 6 సంవత్సరాలు పనిచేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నవారు ఒంటరిగా ఉండాలని, ప్రజలతో సంబంధాలు పెట్టుకో కూడదు అనే భావాలను చీఫ్ జస్టిస్ గవాయ్ తోసిపుచ్చారు. న్యాయమూర్తులు అందరితో కలిసి ఉండాలని చెప్పారు. న్యాయ నియామకాల్లో మహిళలకు, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం పెరగాలని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, వివిధ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు హాజరైన ఓ ముఖ్యమైన సమావేశాన్ని జస్టిస్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఆ సమావేశంలో ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని, తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలకు చెందిన అభ్యర్థులకు సరైన అవకాశం కల్పించాలని జస్టిస్ చంద్రచూడ్ కోరారు. అత్యంత నైపుణ్యం ఉన్న మహిళా న్యాయవాదులను కచ్చితంగా గుర్తించి, ప్రోత్సహించాలని చీఫ్ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ ప్రయత్నం కచ్చితంగా విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థలోని ఖాళీల భర్తీ సమస్యను కూడా జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. సరిపడ న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. నియామకాలను వేగం వంతం చేయడంలో సహకార విధానాన్ని అవలంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# భారత్ సమాచారాన్ని పాక్‌కు అందించిన విద్యార్థి అరెస్టు!

**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలో ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పటియాలలోని ఖల్సా కళాశాలలో దేవేంద్రసింగ్ ధిల్లాన్ పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టచెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడు. దేవేంద్రసింగ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ దర్యాప్తుకు పంపించాం. డబ్బు లావాదేవీలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నాం. దీనిపై పూర్తి దర్యాప్తు కొనసాగుతోంది. ఇక ఇటీవల పాకిస్తాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్న ఒక వ్యక్తిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పని చేస్తున్న రవీంద్రకుమార్ ఓ అమ్మాయి వలపు వలలో చిక్కి భారత సైన్యం ఆయుధాలకు సంబంధించి సున్నితమైన సమాచారాన్ని పాక్ అధికారులకు చేరవేశాడు. దీంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడయింది.

# ఇటలీ పిఎం మెలోనికి మోకాలిపై కూర్చొని అల్బేనియా ప్రధాని స్వాగతం



**టిరానా, మే 17:** అల్బేనియా రాజధాని టిరానాలో ఐరోపా రాజకీయ కమ్యూనిటీ సదస్సు జరిగింది. ఈ సమావేశానికి యూరోపియన్ యూనియన్ దేశాల నేతలు హాజరయ్యారు. అయితే, ఈ సదస్సుకు విచ్చేసిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అల్బేనియా దేశ ప్రధాని ఎడి రమా స్వాగతం పలికిన తీరు ఆసక్తికరంగా మారింది. మోకాలిపై కూర్చొని ఎడి.. ఆమెను ఆహ్వానించారు. మెలోనీ కారు దిగి వేదిక వద్దకు వస్తుండగా అల్బేనియా ప్రధాన మంత్రి ఎడి మోకాలిపై కూర్చొని చేతులు జోడించి నమస్కారం చెబుతూ స్వాగతం పలికారు. వర్షంలోనూ ఆయన పలికిన ఈ ఆత్మీయ ఆహ్వానానికి మెలోనీ ఫిదా అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాగా మెలోనీ తన 'ఇటాలియన్ సిస్టర్' అని చెప్పే ఎడి రమా ఆమె ఎప్పుడు కనిపించినా సరే ఇలాగే పలకరిస్తారు. ఈ యేడాది జనవరిలో మెలోనీ పుట్టినరోజు నాడు ఓ సదస్సులో కలిసిన ఎడి.. ఆమెకు మోకాలిపై కూర్చొని స్కార్ఫ్‌ను కానుకగా ఇచ్చారు. ఇటాలిన్ భాషలో ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అప్పుడు కూడా వీరి విడియో నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది.


# గడువు దాటితే అమెరికా నుంచి బహిష్కరణ

## కీలక అడ్వైజరీ జారీ చేసిన భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం

**న్యూఢిల్లీ, మే 17:** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తి వ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కాగా అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు ఖచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతే కాదు ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్కరోజు అధికంగా ఉంటే రోజుకు 998 దాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని, వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

# భారత్ క్షిపణుల దెబ్బ తగిలింది

## పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ అంగీకారం



**ఇస్లామాబాద్, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో దాయాది పాకిస్థాన్ వణికిపోయింది. మన మిలిటరీ దాడులు ఆ దేశ వైమానిక దళాన్ని చావుదెబ్బ కొట్టాయి. శత్రువుల కీలక వైమానిక స్థావరాలను మన క్షిపణులు ధ్వంసం చేశాయి. అయితే, ఈ నష్టంపై ఇన్నాళ్లూ బుకాయిస్తూ వస్తోన్న పాక్ తాజాగా దాన్ని అంగీకరించింది. భారత క్షిపణుల దెబ్బ తమకు తగిలిందని స్వయంగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ షెహబాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. మే 9-10 మధ్య రాత్రి సమయంలో రావల్పిండిలోని నూర్‌ఖాన్‌సహా ఇతర వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసినట్లు పాక్ ప్రధాని అంగీకరించారు. ఇందుకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**ఆ సమయంలో ఈత కొడుతున్నా: షెహబాజ్**

'ఆ రోజు తెల్లవారుజామున ప్రార్థనలు ముగించుకుని ఈత కొట్టేందుకు వెళ్లా. నా సెక్యూర్డ్ ఫోన్ మాత్రమే తీసుకెళ్లా. రెండుసార్లు మోగింది. ఆర్మీ ఛీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ లైన్‌లో ఉన్నారు. ఫోన్ ఎత్తగానే భారత్ దాడులు చేస్తున్న విషయాన్ని చెప్పారు. వాటిని ఎదుర్కొనేందుకు వైమానిక దళం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు చైనా యుద్ధ విమానాలను కూడా వినియోగిస్తోందని మునీర్ తెలిపారు' అంటూ షెహబాద్ వివరించారు. అయితే, భారత్‌పై పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు కూలిపోయిన విషయాన్ని మాత్రం ఆయన చెప్పకపోవడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడి చేసింది. దీంతో న్యూఢిల్లీ ప్రతిదాడికి దిగింది. అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని దాదాపు డజను సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఇందులో ఆ దేశానికి అత్యంత కీలకమైన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ఉన్న చక్లాలలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌తో పాటు సర్గోదా, భోలారీ వైమానిక స్థావరాలున్నాయి. దాడుల్లో ఇవి ధ్వంసమైన తీరు ఉపగ్రహ చిత్రాల్లో బయటికొచ్చింది. పాక్ వాయుసేనకు చెందిన దాదాపు ఐదోవంతు మౌలిక వసతులు, ఫైటర్‌జట్లు భారత్ దాడిలో ధ్వంసమైనట్లు సమాచారం.

# పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించేందుకు ఎంపిల బృందం



**న్యూఢిల్లీ, మే 17:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపిల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఎంపిలు శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (బిజెపి), బైజయంత్ పాండా (బిజెపి) సంజయ్ కుమార్ ఝా (జెడియు), కనిమొళి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్సీపి, ఎస్పీ), శ్రీకాంత్ శిండే (శివసేన) విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో అయిదు దేశాలకు వెళతాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏ విధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వీరు ముఖ్యంగా అయిదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు. పాక్ బెదిరింపులకు దీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్తాన్ అనుసరిస్తున్న పాత్రను దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్, పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది.

# బిన్‌లాడెన్ ఆపరేషన్ తరహాలోనే 'సిందూర్': ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**లక్నో, మే 17:** ఆపరేషన్ సిందూర్‌పై భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా వేటాడి అంతమొందించిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మును పెన్నడూ లేని విధంగా పాకిస్థాన్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరిపారేసిందని చెప్పారు. 2 మే 2011న అమెరికా దళాలు ఇదే విధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా ధన్‌ఖడ్ మాట్లాడారు. ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక గ్లోబల్ బెంచ్ మార్క్‌ను సెట్ చేసిందని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ అన్నారు.

భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్ర శిబిరాలకు మాత్రమే నష్టం వాటిల్లిందని చెప్పారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన ఘటన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 11 సెప్టెంబర్ 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన ఉగ్రదాడి. ఈ దాడిలో దాదాపు మూడువేల మంది ప్రాణాలు కోల్పోయారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# అంబరాన్నిఅంటిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం

## కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ భూపతిరాజు శ్రీనివాస వర్మ





**భీమవరం మే 17 ప్రభాతవార్త :** పాకిస్తాన్ మద్దతుతో పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని, ఇది భారతదేశ ప్రతిష్టను మరింత పెంచిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని శనివారం భీమవరంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వీసాకోడేరు వంతెన వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతివనం వద్ద ముగిసింది. ర్యాలీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతోపాటు పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు దేశభక్తితో జాతీయ జెండాలు పట్టుకుని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ సారథ్యంలోని భారత ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించిందని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కావలి వాసి మధుసూదన్ రావు కుటుంబాన్ని తాను పరామర్శించిన సమయంలో ఆయన భార్య మీనాక్షి ప్రసన్న ఆపరేషన్ సింధూర్ పైన చెప్పిన మాటలు తన హృదయాన్ని కదిలించాయి అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మా నుదుటి సింధూరాన్ని చెరిపినా, మేము ఆపరేషన్ సింధూర్ పట్ల గర్వంగా ఉన్నాం అని ఆమె చెప్పారన్నారు. భారతదేశం ఐదవ ఆర్థిక శక్తిగా ఎదగడం జీర్ణించుకోలేని కొన్ని దేశాలు అసూయతో కుట్రలు చేస్తున్నాయని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా సమర్థవంతంగా తిప్పికొడతామని త్వరలోనే మూడవ ఆర్థిక శక్తిగా భారత నిలవడం ఖాయం అన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఐక్యతకు చిహ్నంగా ఈ బైక్ ర్యాలీ నిలిచిందని, దేశ భద్రత విషయంలో భారత్ కు దీటైన ప్రత్యర్థి లేదన్నారు. ఈ తిరంగా బైక్ ర్యాలీ లో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ,జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, మాజీ రాజ్యసభ సభ్యులు తోట సీతారామలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్ వర్మ, మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మెరగాని నారాయణమ్మ, పలువురు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతీ ఒక్కరి జీవితంలో ప్రధాన భాగం కావాలి

**ద్వారకాతిరుమల/ఏలూరు, ప్రభాతవార్త :** పరిశుభ్రత ప్రతీ ఒక్కరి జీవితంలో ప్రధానమైన భాగం కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లిలో శనివారం పలు కార్యక్రమాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంలో గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పశు వైద్యానికి సంబంధించి ఏర్పాటుచేసిన శిబిరాన్ని పరిశీలించి పశువులకు సంబంధించిన మందులను పశుపోషకులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. క్లాప్ మిత్రాలు , గ్రీన్ అంబాసిడర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అనారోగ్య పరిస్థితులు దరి చేరవనున్నారు. ప్రతీ ఒక్కరు తడి, పొడి చెత్తలను వేరుచేసి, ఇంటింటికి వచ్చి చెత్త సేకరించే వారికి అందించాలన్నారు. తడిచెత్త నుండి సేంద్రియ ఎరువుల తయారీ ని చేపట్టి చెత్త నుండి సంపద సృష్టించాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గాంధీజీ కన్న గ్రామ స్వరాజ్యం సంపూర్ణ పారిశుధ్యం నుండే ప్రారంభమవుతుందన్నారు. ప్రజారోగ్యానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి, కంపోస్ట్ యార్డ్ కు తరలించాలని, గ్రామంలో ఎక్కడా రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛ దివస్



సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ శనివారాన్ని "బీట్ ది హీట్" థీమ్ తో మనం వేసవి వేడిమి నుండి ఇలాంటి కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేసవి వేడిమి నుండి ఉపశమనం ఎలా పొందాలి ? అనే అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో ఏదోఒక పనిమీద బయట ఎండలో తిరగాల్సి వస్తుందన్నారు. ఈ సీజనంలో ప్రధానంగా ప్రమాదకరం అన్నారు. మన పరిసరాలను కూడా అవి విషపూరితం చేస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ప్రతి ఇళ్ళు, ప్రతి కార్యాలయం, ప్రతి వాణిజ్య సముదాయంలో ఈ ఎలెక్ట్రానిక్ వ్యర్ధం సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు



# కాలువల అత్యవసర పనులకు రూ. 344 కోట్లు మంజూరు

**-చంద్రబాబు సారధ్యంలోనే రైతులకు మేలు.**
**- రూ 334 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు.**



**పాలకొల్లు ప్రభాతవార్త :** రాష్ట్రంలో పంట కాలువలు, మురుగు డ్రైన్ల నిర్వహణ, మరమ్మతు పనులకు రూ.344 కోట్ల చంద్రబాబు మంజూరు చేశారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలోను, నేడు కూటమి ప్రభుత్వంలోనూ రైతులకు పక్షపాతిగా చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. పాలకొల్లు మండలం రూరల్ గ్రామ పెద్దగరువు, పూలపల్లి, ఆగరు, పట్టణ పరిధిలోని 18,23 వార్డుల్లో 334 లక్షలతో జరుగున్న పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు డ్రైన్ల అత్యవసర పనులను ఈ వేసవి నెలాఖరు నాటికి పూర్తిచేసేలా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. రూ.10 లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో, 10 లక్షలు దాటితే ఏడు రోజుల్లో షార్ట్ టెండర్లు పిలవాలని ఆదేశించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, గత జూన్ నెలలో 90 కోట్లతోనూ, సెప్టెంబర్ లో అత్యవసర పనులుగా 326 కోట్లతో పనులు జరిగాయి అన్నారు . రైతులకు మేలు చేసే కాలువల మట్టి త్రవ్వకం , తూడు గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టామన్నారు.కాలువల వెంబడి గ్రావెల్ రహదారులు, కాంక్రీట్ గోడ నిర్మాణాలు వందలి పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో, అత్యవసర మెయింటెనెన్స్ పనులకు అర్ధ రూపాయి ఖర్చు గాని, అరబస్తా సిమెంట్ గాని, తట్ట మట్టి పని గాని నోచుకోలేదన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు రైతులు మహిళలు మంత్రి రామానాయుడుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కోడి విజయభాస్కర్, పాముల రఘు కుమార్, దొడ్డ శ్రీనివాస్, అంబటి శేషగిరి, కానూరు జానకి రామారావు, భూపతిచిన్న పెద్ది రాజు, భూపతి సుదరణ రాజు వేగేసిన శ్రీహరిరాజు, గుబ్బల హరిప్రసాద్, పాలపర్తి చాంద్ రాజు, గాది రాజు అర్జున్ రాజు, అల్లూరి సత్యనారాయణ రాజు, సాగి మురళీకృష్ణ, పంచగర్ల సైమన్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పిచ్చేటి బాబు పాలకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షులు జివి పొట్టూరు శ్రీనివాస్ ఉన్నమట్ల కపర్థి, పసుపులేటి రాజేష్ కన్నా మల్లుల వెంకట్ పసుపులేటి జేమ్స్ చీరా శివన్నారాయణ కరీంనగర్ మాతా రత్నరాజు కోడి విజయభాస్కర్ ఎర్ర బాబి ఇంటి ధర్మ ఉందుర్తి నాగరండ తమిరి వెంకటేశ్వరరావు, అన్న బత్తుల దుర్గారావు మహమ్మద్ రఫ్ బాలి వెంకటేశ్వరరావు దొడ్డ జనార్ధన్ మురాల విజయలక్ష్మి మరియు సాధికార మిత్ర సభ్యులు పాల్గొన్నారు

# చిన్న వెంకన్నను దర్శించుకున్న కలెక్టర్



**ప్రభాతవార్త ద్వారకాతిరుమల:** ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శనివారం ద్వారకా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ని దర్శించుకున్నారు. కలెక్టర్ కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు జిల్లా కలెక్టర్ కు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు కలెక్టర్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి ఆలయంలోని గోశాలలో



గోపూజ చేసి, గోసేవ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ రమణ, ఆలయ ఈఓ మూర్తి, ఏ ఈఓ నటరాజన్ , తహసీల్దార్, ప్రభృతులు పాల్గొన్నారు. .

# పిల్లలూ.... కథ చెబుతా వింటారా



**ప్రభాతవార్త నరసాపురం :** నరసాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాల యం నందు వేసవిజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం పుస్తక పఠనం గుడ్ హ్యాండ్ రైటింగ్ యోగ క్లాసులతో పాటు.. పిల్లలు ఎండ తీవ్రత నుండి తప్పించుకొనుటకు పిల్లలుకు కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. కథ లు రాయడం ఎలా అంశంపై ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల కథా సమ్మేళనం జూమ్ కథల పోటీలలో పాల్గొవాలనే అభిలాష గల చిన్నారులకు... వ్యాఖ్యాత..సాహితీవేత్త చక్రవధానుల రెడ్డప్ప ధవేజి కథలు రాయడం ఎలా...కథలు చెప్పడం ఎలా అనే అంశంపై చిన్నారులకు ప్రత్యేక సూచనలు ..సలహాలు...ఇచ్చారు. నిజ జీవితం లో చూచినవి, విన్నవి ఒక క్రమపద్దతి లో అక్షర రూపంలో ఇవ్వడమే రచన అని ..కథ అనేది రచన ప్రక్రియలో ఒక భాగం అని అన్నారు. కథ నియమాలను వివరిస్తూ పర్యావరణం ,నీతి కథలు తల్లిదండ్రులు, గురువులు,దేశభక్తి కథలు సామాజిక హిత కథలు,సైన్స్ విజ్ఞాన కథలు,సందేశాత్మక కథలు,హాస్య కథలు మొదలైన అంశాలపై కథలు ఉండాలని తెలిపారు. మట్ట సుధీర్ మోహన్ మాట్లాడుతూ కథ రాయడానికి ఒక 4 నియమాలు పాటించలని స్టోరీ లైన్..కథ నేపథ్యం పాత్రలు సన్నివేశాలు కథలో పాత్రల మధ్య సంఘర్షణ కొసమెరుపు ఉండాలని కొన్ని కథలను ఉ దాహరణలతో వివరించారు. ఈ కథల పోటీలలో పాల్గొన్న వారికే సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. కథ పంపవలసిన చివరి తేదీ 30-5-25 మధ్యాహ్నం రెండు గంటల లోపు. ఈ సమ్మర్ క్యాంప్ నందు అందచేయాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, డాక్టర్ అమ్మాజీ బి జి బి ఎస్ ఉమెన్స్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ , గిల్లి శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్, బాబు శ్రీ , సిఆర్పి కృపారావు, సూర్యం బాబు, మిమిక్రీ ఆర్టిస్ట్ భట్టిప్రోలు సత్యనారాయణ ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు నరసాపురం న్యాయవాది ఎర్రం శెట్టి ఫణికర్ పాల్గొన్న విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు.



# స్వచ్ఛాంధ్ర- 2047 లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

## ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపు

**తణుకు, మే 17(ప్రభాత వార్త):** చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛాంధ్ర 2047 లక్ష్యానికి అనుగుణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. వేసవిలో నీటి వనరులను కాపాడుకునే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్వర్ణాంధ్ర%-% స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తణుకు పట్టణంలోని 6, 7 వార్డుల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆరో వార్డులో చెరువులో పేరుకున్న తూడును డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో మందు పిచికారి చేయడం జరిగిందని చెప్పారు. అంతేకాకుండా చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మించడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పారిద్ధ్యాన్ని, పరిశుభ్రతను పెంచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో పట్టణాల్లో నెలలో ప్రతి మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించే ప్రజలను



భాగస్వాములను చేయాలని కోరారు.జిల్లా నోడల్ అధికారి సూర్య కుమారి మాట్లాడుతూ స్థానికంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇస్తున్న స్ఫూర్తితో ప్రజలంతా సహకరించి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంట్లో మహిళ తడి చెత్తను సేకరించి కంపోస్టు తయారు చేసుకోవడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. చెరువులు, పంట కాలవల్లో వ్యర్థాలు వేయకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

# సహకార సంఘాల్లో ఓటిఎస్ విధానాన్ని అమలు చేయాలి, రైతులు

**జీలుగుమిల్లి, మే-17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఆర్థిక పరిస్థితులు అగమ్య గోచరంగా ఉన్న దృష్ట్యా ప్రాథమిక సహకార సంఘాల్లో ఓటీఎస్ విధానాన్ని అమలు చేయాలని, రుణగ్రస్తుడు మృతి చెందితే ఆ బాకి మొత్తాన్ని రద్దు చేయాలని కోరుతూ మండలంలోని జీలుగుమిల్లి, దర్భ గూడెం, ములగలంపల్లి, బుట్టాయిగూడెం మండలంలోని గణపవరం రైతులు జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ కు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం ఆయన ఇంటి వద్ద అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జాతీయ బ్యాంకులను వన్ టైం సెటిల్మెంట్ విధానాన్ని అమలు చేస్తుంటే సహకార సంఘాలు పంటలకు గిట్టుబాటు ధర దక్కగా అప్పులు ఊబిలో కొట్టు మాట్లాడుతున్న అన్నం పెట్టే రైతన్నలపై



జాలి దయా కరుణ లేకుండా సహకార సంఘాలు అప్పులు చెల్లించాలని ఒత్తిడి చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చెల్లించలేని రైతులను వారి పరువు తీసే లాగా అప్పులు చెల్లించాలని, తనకా పెట్టిన భూములు ఏదో అయిపోతున్నాయని, మైకుల ద్వారా ప్రచారం చేయడం అన్యాయం అన్నారు. ఇలా రైతులను అల్లరి చేయడం సొసైటీ బైలాలో ఎక్కడ ఉందని? ప్రశ్నించారు. సొసైటీలో తీసుకున్న అప్పులకు అసలుకు బదులు రెట్టింపు వడ్డీలు కట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. గతలో వైయస్సార్ రుణమాఫీ చేశారని, ఇది ఇలా ఉంటే జీలుగుమిల్లి సొసైటీలో మామూళ్ల ఇస్తేనే గాని రుణాలు మంజూరు కావని, ఇక్కడ పనిచేసే అధికారి పై ఏసీబీ విచారణ చేపట్టాలని రైతు యాండ్ర రాజేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీలో సొసైటీ-రైతాంగ అప్పులు, సమస్యలపై జిల్లా కలెక్టర్ కు, ఎమ్మెల్యే బాలరాజుకు, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినతి పత్రాలు అందజేయన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల రాయి సుబ్బారావు, గన్నిన సూర్యచంద్రరావు, కొప్పుల సుబ్బారావు, పేరాబత్తుల లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీను, కొల్లూరి పద్మనాభం, తూంపాటి దుర్గారావు, గద్దె దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


# కాలపూరి శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో అఖండ అన్న సమారాధన


కాళ్ళ మే 17 (ప్రభాతవార్త) : మండలంలోని కాళ్ళకూరు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవాలలో భాగంగా భక్తులు, దాతలు, గ్రామస్తులు సహాయ సహకారములతో మెయిన్ రోడ్ రామాలయం వద్ద శ్రీ స్వామివారి ఖాళీ స్థలము నందు అఖండ అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు వివిధ గ్రామముల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకుని శ్రీ స్వామివారి అన్న ప్రసాదమును స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, గ్రామస్తులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అన్నదానం నిమిత్తం విరాళాలు



అందజేసిన దాతలకు, కాయగూరలు, బియ్యం, (పులిహొర, చక్ర పొంగలి) బూరెలు సమర్పించిన దాతలకు సహకరించిన గ్రామస్తులకు కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ కృతజ్ఞతాభివందనములు తెలిపారు.

# కొప్పరులో అమ్మవారి జాతర వేడుక





**ప్రభాతవార్త నరసాపురం రూరల్:** నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో పద్దాల వెంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం మొదలయ్యాయి. ఈ వేడుకలు మూడు రోజులు పాటు జరుగుతాయి. పోలిశెట్టి వారి ఆడపడుచు గా అమ్మవారు ప్రతీక. దశాబ్దాలుగా గ్రామంలో అమ్మవారి జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. కొప్పరు గ్రామంలో జరిగే అతి పెద్ద జాతర ఇదే. మూడుఏళ్లకు ఒకసారి ఈ జాతర నిర్వహిస్తారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ స్థానికులు సైతం ఈ జాతరకు విచ్చేస్తారు.

# సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు

**అత్తిలి - మే 17 ( ప్రభాత వార్త ):** పవిత్ర సరస్వతీ నది పుష్కరాలు కాళేశ్వరం లో మహా వైభవంగా ఈనెల 15వ తేదీన ప్రారంభమయ్యాయి . ఈ సందర్భంగా పుష్కర స్నానాల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తణుకు డిపో 2 2 పుష్ బ్యాక్ సీట్లతో సరికొత్త వీడియో కోచ్ సూపర్ లగ్జరీ బస్ కాళేశ్వరం సరస్వతి నది పుష్కరయాత్రాస్పెషల్ నేటి రాత్రి 07.00 గంటలకు తణుకు లో బయలుదేరింది. 18 ఉదయం వరంగల్ భద్రకాళి మాత సందర్శనం తదుపరి వేములవాడ లో శ్రీ రాజరాజేశ్వరిఅమ్మవారి దర్శనం, కొండగట్టు ఆంజనేయ స్వామివారి సందర్శనం తదుపరి ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ దర్శనం చేసుకుం టా రు. 19 ఉదయం కాళేశ్వరం చేరి కాళేశ్వరంలో మహాకాళేశ్వరుని దర్శనం పవిత్ర పుష్కర స్నానం తదుపరి రామప్ప దేవాలయ దర్శనం చేసుకుంటారు. ఆ రోజు బయలుదేరి 20 వతేది వ తేది తెల్లవారుజామున తణుకు చేరుతుంది. టికెట్ చార్జీ ఒక్కొక్కరికి కేవలం 2100మాత్రమే. 22 గురు వారం కూడా సరస్వతీ నది పుష్కరయాత్రాస్పెషల్ బస్ బయలుదేరుతుంది. ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు.

# మకర పీఠానికి 250 వెండి అందజేత

**భీమవరం మే 17 ప్రభాతవార్త :** భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి దాతలు 250 గ్రాముల వెండిని విరాళాలు అందించారు. శనివారం భీమవరంకు చెందిన మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులు 250 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. వెండి పీఠానికి దాతలందిస్తున్న సహకారానికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# మద్యపాన రహిత సమాజం ప్రభుత్వ ధ్యేయం

**భీమవరం మే 17 ప్రభాతవార్త :** మద్యపాన రహిత సమాజం ప్రభుత్వ ధ్యేయమని భీమవరం ఎక్సైజ్ సిఐ కె బలరామరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నానాజీ ఎంటర్ ప్రైజెస్ ముఠా కూలీలతో మద్యపానవ్యసనం - జీవితం నాశనం అనే నినాదంతో ఎక్సైజ్ డిఎస్పీ కుమారన్ ఆదేశాల అవగహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ బలరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, తటవర్తి భాస్కరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## మద్దిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : మండలంలోని గుర్వాయిగూడెంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంనకు శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుకొని, అభిషేక సేవలో పాల్గొన్నారు. తొలుత వారిని ఆలయ కార్య నిర్వహణ అధికారిణి ఆర్ వి చందన, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక పూజ ఏర్పాటు చేశారు. అనంతరం న్యాయమూర్తి అభిషేక సేవలో పాల్గొన్నారు వారికి ఈవో చందన స్వామివారి చిత్రపటం,శేష వస్త్రాలు, ప్రసాదములు అందజేశారు. వారి వెంట జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ సిహెచ్ కిషోర్ కుమార్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కే ఎస్ ఆర్ తేజస్వి, భీమడోలు మెజిస్ట్రేట్ ప్రియదర్శిని, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి రమణ ,తహసిల్దార్ స్లేవా జోజి, లక్కవరం ఎస్సై శశాంక్, తదితరులు పాల్గొన్నారు. ఈ రోజు హనుమాన్ చాలీసా పారాయణం ముసునూరు మండలం చెక్కపల్లి కి చెందిన శ్రీనివాస్ భజన మండలి, కృష్ణాజిల్లా కోడూరు మండలం జరుగువానిపాలెంకు చెందిన శ్రీనివాస భక్త సమాజం వారు నిర్వహించారని ఆలయ కార్యనిర్వాహన అధికారిణి ఆర్ వి చందన తెలిపారు.

## నేడు లింగపాలెంలో మినీ మహానాడు


జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు ఈనెల కడప జిల్లాలో మహానాడు జరుగుతున్న నేపథ్యంలో చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ సారథ్యంలో జిల్లా,రాష్ట్రస్థాయి ముఖ్య అతిథుల ఆశీస్సులతో లింగపాలెం మండలంలో నియోజకవర్గస్థాయిలో మినీ మహానాడును ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించుటకు ఏర్పాట్లు ముమ్మరంగా చేయుడం జరుగుతుందని,ఈ మినీ మహానాడు కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం పట్టణ మండలం నుండి గ్రామ పట్టణ,మండల స్థాయి వరకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ , కార్యదర్శి తూటికుంట రాము, మండల ప్రెసిడెంట్ సాయిల సత్యనారాయణ కోరారు. వివిధ హోదాలలో ఉన్న అనుబంధ కూటములు సర్పంచ్ లు, ఎంపీటీసీలు,మాజీ ప్రజాప్రతినిధుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. హిట్ ద బీట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటాలని కోరారు మండుటెండలో తిరగకు వడదెబ్బ గురికాకు తదితర నినాదాలతో ఉన్న ప్లెకార్డులను చేతబూని ర్యాలీలో పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కే వెంకటరమణ టిడిపి నాయకులు చిట్టి బోయిన రామలింగేశ్వర రావు, కౌన్సిలర్ చిటికెల అచ్యుత రామయ్య ,లోకవరపు వెంకటేశ్వర రావు,మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, పలు సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రహదారిని బాగు చేయండి ప్రమాదాలు నివారించండి



వేలేరుపాడు, మే 17, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలంలో రోజు రోజుకు వాహనాల సంఖ్య అధికం అవుతూ ఉంది. ప్రతిరోజు వేళల్లో వాహనాలు తిరుగుతూ ఉన్నాయి. మండలానికి కొత్తవారు వస్తూ వెళుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో వేసవి సెలవులు రావడంతో చిన్నారులు సైతం వాహనాలను అధికంగా వినియోగిస్తూ ఉన్నారు. ఇదిలాగ ఉండగా ఎర్రబోరు గ్రామం నుండి శివకాశీపురం వెళ్లే రహదారిలో సబ్స్టేషన్ వరకు రహదారికి ఇరువైపులా చెట్లు, పొదలు అధికంగా వ్యాప్తి చెంది రహదారి వెడల్పు పూర్తిగా తగ్గిపోయి ప్రమాదాలకు నిలియంగా మారింది.సరైన రోడ్డు విస్తరణ లేకపోవడంతో గతంలో ఇదే ప్రాంతంలో యాక్సిడెంట్ జరిగి పల్సర్ బైక్ వాహనదారుడు మరణించడం జరిగింది . పాములు సైతం రోడ్డుకు అటు ఇటు తిరుగుతూ ఉండటంతో ఇంకా ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఏర్పడింది. మరో రెండు వారాల్లో వర్షాకాలం ప్రారంభమైతే వృక్షాలు అధికమై మరిన్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది, కావున అధికారులు ముందస్తు చర్యలో భాగంగా చెట్లను పొదలను తొలగించి ప్రమాదాలు జరగకుండా అరికట్టాలని ప్రజలు కోరుచున్నారు.

## కొత్త టగ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహణ



మొగల్తూరు మే 17 (ప్రభాతవార్త) కొత్తట గ్రామపంచాయతీ కార్యాలయం నందు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉచిత మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయన తెలియజేశారు, ఈ వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సిహెచ్ త్రిశూలపాణ , మండల తాసిల్దార్ కే రాజ్ కిషోర్, గ్రామ సర్పంచ్ పడవల సత్యనారాయణ, ఈ ఓ ఆర్ డి, మేడిద నవీన్ కిరణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి బంధన నళిని ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు స్థానికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కొత్తపాలెం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం



మొగల్తూరు మే 17 (ప్రభాతవార్త) మొగల్తూరు మండలం కొత్తపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం నందు ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు, ఈ వైద్య శిబిరం ద్వారా గ్రామంలోని వృద్ధులకు పిల్లలకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి , మందులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, బెల్లపు కొండ శ్రీరామ మణికంత, వీఆర్వో కృష్ణవేణి, డిజిటల్ అసిస్టెంట్ పరసా మణికంత, ఏఎన్ఎం హిమ దుర్గాదేవి, ఆశా వర్కర్స్ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



పోడూరు, మే-17, ప్రభాతవార్త: మండలంలోని పెనుమదం రైతు సేవా కేంద్రము మరియు కుమార్ రైస్ ఇండస్ట్రీస్ ను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు వివరములు పరిశీలించి, రైతులతో మాట్లాడినట్లు శనివారం పోడూరు తహసీల్దారు సయ్యద్ మూలాన ఫాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ధాన్యము కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ సయ్యద్ మూలాన ఫాజిల్ , అగ్రికల్చరల్ ఏవో సత్యనారాయణ, సి ఎస్ డి టి. నాగదేవి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాంబద్ర రాజు, నీటి సంఘం అధ్యక్షులు దొరబాబు, పెనుమదం టిడిపి అధ్యక్షులు కడలి ఆంజనేయులు, ఆర్. ఐ కె రాంబాబు, రెవిన్యూ అధికారి శేఖర్ బాబు, వి ఏ ఏ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఓఅర్ ఎస్ ఎల్ డ్రింకులు అందచేసిన వైద్యుడు



అత్తిలి - మే 17 ( ప్రభాత వార్త ):తణుకు డిపో నందు భద్ర చెవి, ముక్కు, గొంతు హాస్పిటల్ డాక్టర్ కాసగాని వీరభద్ర రావు గ్యారేజ్ ఉద్యోగుల కు, డ్రైవర్ కండక్టర్లకు, ఆఫీస్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి, కార్గో సిబ్బందికి, హమాలీలకు, కాంట్రాక్ట్ వర్కర్స్ కి,సూపర్వైజర్లకు అందరికీ ఒ ఆర్ ఎస్ ఎల్ డ్రింక్స్ ఒక్కొక్కరికి ఐదు చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు ఉచితంగా ఒ ఆర్ ఎస్ ఎల్ డ్రింక్స్ పంపిణీ చేసినందుకు డాక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా తణుకు బస్సు స్టాండ్ లోని అన్ని ఫ్లాట్ ఫామ్ లలో తేజ ఫ్లెక్స్ వారి సహకారం తో టైమింగ్ బోర్డ్స్ ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ సప్పా గిరిదర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్ వాజపేయాజుల శివ కుమార్, తేజ ఫ్లెక్స్ యజమాని ఇందుగమిల్లి సాయినాథ్ మహరాజ్, గ్యారేజీ ట్రాఫిక్ ఇంచార్జిలు, తణుకు డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉపాధి కార్మికుల వేతనాలు చెల్లించండి.



.అత్తిలి - మే 17 ( ప్రభాత వార్త ): పెండింగ్ లో ఉన్న వేతన బకాయిలకు వడ్డీతో కలిపి తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండలం పాలి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పట్టేడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని. అందులో భాగంగానే ఉపాధికి కేటాయించిన నిధులను దారి మళ్లించి దేవాలయాలు, కోనేర్లు, భూస్వాముల పొలాల్లో పండ్ల తోటలు,ఉద్యాన వనాల కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు . ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి ఉపాధి హామీని ప్రతిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాయం వెంకన్న. టి.ఎల్ వెంకటేశ్వరరావు. సికి లే మంగతాయారు. ధనలక్ష్మి. మరియమ్మ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థి దశలోనే లక్ష్యాలు కలిగి ఉండాలి.



అత్తిలి - మే 17 ( ప్రభాత వార్త ): విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్ణయించుకోవటం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని రిటైర్డ్ టీచర్ కె. వెంకట్రావు అన్నారు. అత్తిలి శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించారు. . దేశభక్తి గీతాలను ఉపాధ్యాయుడు బి. రాము , జి. రవిశంకర్ నేర్పారు. విద్యార్థులు సమయ పాలనా పాటించటంద్వారా అన్ని విషయాలలో రాణించవచ్చన్నారు. గ్రంథాలయాధికారి డి. కృష్ణారావు , పి వెంకటేశ్వరరావు , ఆర్. దానకృష్ణ , జి. శేష వేంద్ర రావు , ఎం. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### చాట్రాయి తహసీల్దారుగా ఈశ్వర్

చాట్రాయి, మే 17, ప్రభాతవార్త : చాట్రాయి తాసిల్దారుగా ఈశ్వర్ నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చాట్రాయి తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దారుగా పనిచేస్తున్న ఈశ్వర్ ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్ పై వెళ్లారు. చాట్రాయి తాహసిల్దారుగా పనిచేసిన డి ప్రశాంతి మార్చి 12న అవినీతి ఆరోపణల నేపథ్యంలో



సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ గీత బాధ్యతలు చేపట్టారు. కాగా ఈశ్వర్ ను ఫుల్ ఎడిషన్ చార్జీ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న సమస్యలు కూడా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## వరాల వెంకన్న ను దర్శించుకున్న భక్తులు



అత్తిలి -మే17( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు గ్రామం లోగల వరాల వేంకటేశ్వరస్వామిని అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ , తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తులకు దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు.అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో స్వామి వారికి తోమాల సేవ , కర్పూర తిలక ధారణ కార్యక్రమాలు , అర్చనలు జరిపారు.స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

## కృష్ణారావు పాలెంలో 104 శిబిరం



చాట్రాయి మే 17, ప్రభాతవార్త :చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం గ్రామంలో శనివారం 104 క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన 40 మందికి పరీక్షలు నిర్వహించి నెలవారి మందులు పంపిణీ చేసినట్లు చనుబండ వైద్యాధికారి డాక్టర్ బి దుర్గాప్రసాద్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు బయట తిరగరాదని తలకు టోపీ లేదా రూమాలు కట్టుకొని ప్రయాణం చేయాలని మంచినీళ్లు మజ్జిగ ఓఆర్ఎస్ ఎక్కువగా తీసుకోవాలని ముఖ్యంగా వృద్ధులు పిల్లలు ఇంటి వద్దనే ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. ఒళ్ళు నొప్పులు తల నొప్పి తల తిరగడం వాంతులు గుండె దడ జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు. 104 క్యాంపును కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింత గుంట్ల వెంకటేశ్వరరావు పాల్గొని వైద్యులు సూచనలు తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరోజిని తిరుమలకుమారి ఆశా వర్కర్ కృష్ణకుమారి గ్రామ ప్రజలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గోడపత్రిక ఆవిష్కరణ



పెనుమంట్ర, మే-17, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జూన్-05న విజయవాడలో జరుగు ప్రభుత్వ రాష్ట్ర కౌన్సిల్ మీటింగ్ గోడ పత్రిక ఆవిష్కరణ భీమవరం అంకాల ఆర్ట్ అకాడమిలో నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి ఆర్ ఎస్ ఎన్ రాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి జిల్లాలోని ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహా మండలి సభ్యులు జి సత్యనారాయణ, బి హెచ్ రవీంద్ర రాజు, జిల్లా అధ్యక్షుడు జి ఆర్ ఎస్ ఎన్ రాజు , జిల్లా కార్యవర్గ సభ్యులు మోహనరావు, రాజేష్ కుమార్, అజ్గర్ ఆలీ, జక్కరయ్య, మానస, అప్పారావు, స్వర్ణ లత,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడిపళ్ళ అలంకరణలో మార్టేరు శ్రీ వెంకటేశ్వర స్వామి



పెనుమంట్ర, మే-17, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరులో వేంచేస్తున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మామిడి పళ్ళతో అలంకరణ చేశారు. శనివారం పంచమి తిథి సందర్భంగా స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు . శనివారం సుప్రభాతం సేవతో స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ చైర్మన్ చిన్న బాబు మరియు సభ్యులు భక్తులు దగ్గర ఉండి ఏర్పాట్లు చేశారు.

## బీట్ ద హీట్ నినాదంతో మజ్జిగ చలివేంద్రం

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమంలో శనివారం ఏలూరు డిటిసి వారి ఆదేశాలతో బీట్ ద హీట్ అనే సారాంశంతో జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఎండ తీవ్రత, వడగాలులు నేపథ్యంలో కార్యాలయానికి వచ్చే వారికి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా అధికారి ఎండి మాదాని,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు పరిపాలన అధికారి బి చంద్రశేఖర్,సీనియర్ అసిస్టెంట్ జి కవిత,బి మధుసూదన రావు,జి దుర్గాదేవి,జూనియర్ అసిస్టెంట్ బి నాగేంద్ర,హెూంగార్డ్ ఆంజనేయులు, మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ కమిటీ, వాహనదారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ



పెనుమంట్ర, మే-17, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి. సువర్ణ గౌరి శనివారం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ గురించి పిల్లలకు ఎలా మాట్లాలో? రాయలో చెప్పడం జరిగిందని గ్రంథపాలకుడు పిటిఎస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇంగ్లీష్ స్టోర్స్ గురించి పిల్లలకు చెప్పడం జరిగిందన్నారు. పిల్లల చేత చదవడం అంటే మాకెంతో ఇష్టం, కథలు బుక్స్ మరియు జంతువులు బుక్స్ చదివించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు యమ్ దీనేష్, యమ్. లోకేష్, జి. చైతన్య, బి. పూర్విక, కె. తనుష, జి. నాగ కార్తీక్ రెడ్డి, యం. గణేష్,బి. భాస్కర్, వి.కిషోర్, యస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు. మానవత మరియు గ్రంథాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

## పెనుమంట్రలో "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్"



పెనుమంట్ర, మే-17, ప్రభాతవార్త: మండల కేంద్రం పెనుమంట్ర, గురువు గ్రామ పంచాయతీలో "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్" కార్యక్రమం నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రభాకరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని గ్రామాలలో అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నెగ్గిపూడి కల్వర్టు దగ్గర ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి!



పెనుమంట్ర, మే-17, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు కూడలిలో పెనుగొండ రోడ్ లో నెగ్గిపూడి కల్వర్టు దగ్గర నిత్యం ట్రాఫిక్ సమస్య వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు భవనాలు శాఖ కంటికి కనపడని చిన్న బ్యానర్ ఏర్పాటు చేసింది. ఇది కనపడక దారి వదిలేయడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. కార్లు ఆటోలు కూడా వెళ్ళిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. సమస్యపై అధికారులు స్పందించి వెంటనే పరిష్కారం చేయాలని వాహనదారులు కోరారు. అలా సాధ్యం కాకపోతే మొత్తం దారి మూసి వేయాలని కోరారు. లేదంటే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలుపుతున్నారు.

### రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పోడూరు, మే-17, ప్రభాతవార్త: మండలంలోని పెనుమదం రైతు సేవా కేంద్రము మరియు కుమార్ రైస్ ఇండస్ట్రీస్ ను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు వివరములు పరిశీలించి, రైతులతో మాట్లాడినట్లు శనివారం పోడూరు తహసీల్దారు సయ్యద్ మూలాన ఫాజిల్ తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ధాన్యము కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ సయ్యద్ మూలాన ఫాజిల్ , అగ్రికల్చరల్ ఏవో సత్యనారాయణ, సి ఎస్ డి టి. నాగదేవి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాంబద్ర రాజు, నీటి సంఘం అధ్యక్షులు దొరబాబు, పెనుమదం టిడిపి అధ్యక్షులు కడలి ఆంజనేయులు, ఆర్. ఐ కె రాంబాబు, రెవిన్యూ అధికారి శేఖర్ బాబు, వి ఏ ఏ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికై పోరాటాలు చేయాల్సిందే సిపిఐ



వేలేరుపాడు, మే 17,ప్రభాత వార్త : వేలేరుపాడు మండలం ఉదయనగర్ గ్రామంలో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మడివి కామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు కారం దారయ్య సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయా సమస్యలను మండల పార్టీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తద్వారా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రతి గ్రామాల్లో ప్రజాసంఘాలు ఏర్పాటు చెయ్యాలని దానివలన పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ఆదివాసీలను ఇబ్బందులు గురి చేస్తున్నారని వాటిపై పోరాటం చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం అందరికీ న్యాయం చేయాలన్నారు. రాబోయే రోజులు మరింత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని వెంటనే అమలు చేయాలన్నారు.జులై 5,6,7 తేదీల్లో చింతలపూడిలో సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నారని దానికి వేలేరుపాడు మండలం నుండి ఎనిమిది వందల మంది తగ్గకుండా తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిట్టా వీరయ్య, కురిమేళ్ళ వెంకటేశ్వరరావు, కారటం వెంకటేశ్వరరావు, బంధం అర్జున్, సోడే ప్రసాద్, కంగల గంగా రాజు, తాటి దుర్గారావు, మచ్చ చంద్రరావు, సోడే సత్తిబాబు, సోడే కన్నారావు, మడకం దేశమ్మ, బంధం సుక్కమ్మ, సోడే మారయ్య,సరియం నాగులు, కాకా ముత్యాలరావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# 'శుభం' సక్సెస్ మీట్

ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రముఖ నటి సమంత నిర్మించిన తొలి చిత్రం శుభం. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియా కొంతం, శ్రావణి లక్ష్మీ, షాలినీ కొండెపూడి, వంశీధర్ వంటి వారు ప్రధాన పాత్రలుగా పోషించిన ఈ చిత్రాన్ని ప్రవీణ్ కంద్రేగుల



తెరకెక్కించారు. ఈ మూవీ మే 9వ తేదీన విడుదలై సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతూ రెండో వారంలోకి అడుగు పెట్టేసింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో, నటి, నిర్మాత సమంత మాట్లాడుతూ, పది శాతం సక్సెస్ రేట్ ఉన్న ఈ ఇండస్ట్రీలోకి ఎలా వచ్చానా? అన్నది ఇప్పుడు నాకు అర్థం అవుతోంది. శుభం మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరితో నవ్వులు, సంతోషం కనిపిస్తోంది. ఇదే అసలైన సక్సెస్. ఇలాంటి ఆనందం చూడటానికే నిర్మాతలు ఇంకా ఇంకా సినిమాలు తీస్తూనే ఉంటారు. నాకు ఈ మూవీ చూస్తే నా సమ్మర్ హాలీడేస్ గుర్తుకు వచ్చాయి. పిల్లల్ని సినిమాలకు తీసుకు వెళ్లేందుకు మా అమ్మ ఎంత కష్టపడిందో నాకు తెలుసు. ఓ మూవీని మా ఫ్యామిలీ అంతా కలిసి చూసిన రోజులన్నీ నాకు మళ్లీ గుర్తుకువచ్చాయి. అవన్నీ నిన్నే జరిగినట్టుగా అనిపించాయి. శుభంతో అందరినీ మళ్లీ పాత రోజుల్లోకి తీసుకెళ్లాం. మేం ఇలాంటి మంచి చిత్రాలను తీసి ఫ్యామిలీస్‌ను థియేటర్లకు రప్పించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. మీ తీపి జ్ఞాపకాల్ని మళ్లీ మీకు గుర్తు చేస్తూనే ఉంటాం.. అదే మా ట్రాలాలా లక్ష్యం. దాని కోసం ఎంతైనా కష్టపడుతూనే ఉంటాం. నటిగా ఉంటే లాస్ట్‌గా వస్తాం.. ఫస్ట్ వెళ్లిపోతాం. హీరోయిన్‌గా ఉన్నప్పుడు కేవలం నా పాత్ర గురించే ఆలోచించేదాన్ని. కానీ నిర్మాతగా అసలుకష్టాల్ని తెలుసుకున్నాను. సినిమా రిలీజ్‌కుముందు మూడు రోజులు ఏ ఒక్కరూ నిద్రపోలేదు. అంతలా కష్టపడ్డ నా టీంకు సక్సెస్‌రావాలని, క్రెడిట్ దక్కాలని కోరుకున్నాను. ఇప్పుడు వస్తున్న ప్రేమ, అభిమానం, ప్రశంసలు అన్నింటికీ వాళ్లే కారణం. రాజ్ అండ్ హిమాంగ్‌లే ట్రాలాలా బ్యాక్ బోన్‌లా నిలుచున్నారు. ప్రవీణ్ చాలా మంచి వ్యక్తి. ఆయనెప్పుడూ ట్రాలాలాలో ఓభాగం. వసంత్ ఎప్పుడూ మా బ్యానర్‌లో భాగస్వామి. ఎడిటర్ ధర్మేంద్రకి థాంక్స్. వివేక్ సాగర్ తన బీజీఎంతో ప్రాణం పోశారు. క్లింటన్ పాటలు అందరినీ మెప్పిస్తున్నాయి. డైరెక్షన్ టీం అందరికీ థాంక్స్. రామ్ ఆర్ట్ వర్క్, లేడీ కెమెరామెన్ మృదుల్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాకేష్‌కి థాంక్స్.

# 'సింగిల్'ని సక్సెస్ చేసిన ఆడియన్స్‌కి థాంక్స్: అల్లు అరవింద్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ సమ్మర్ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ సింగిల్. కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించారు. మే 9న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా అందరినీ అలరించి సమ్మర్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు.సింగిల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో ప్రొడ్యూసర్ అల్లుఅరవింద్ మాట్లాడుతూ, ఈ సినిమా రసెస్ చూసిన తర్వాత శ్రీవిష్ణుని పిలిచి గీతఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని చెక్ ఇచ్చాను.

మనిషిగా యాక్టర్‌గా తను అంత నచ్చాడు. సినిమా బాగుంటే మేము థియేటర్స్‌కి వస్తాము అని నిరూపించిన ఆడియన్స్ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. డైరెక్టర్ కార్తీక్ రాజు అద్భుతంగా ఈ సినిమాని తీశారు. విష్ణుతో నా ప్రయాణం ఇంకా ముందు ముందు ఉంటుంది. తను డైలాగ్ డైలాగ్‌కి మధ్య చెప్పిన డైలాగు



అర్థం చేసుకోవడం నావల్ల కాలేదు( నవ్వుతూ) వెన్నెల కిషోర్ ఈ సినిమాతో కొంచెం దగ్గర అయ్యారు. వ్యక్తిగత సలహాలు తీసుకోవడం దగ్గర వరకు వచ్చింది. కేతిక ఇవాన ఫెంటాస్టిక్‌గా పెర్ఫాం చేశారు. విశాల్ చంద్రశేఖర్ సినిమాకి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. చాలా ఎంగేజింగ్‌గా చేశారు. యువ దర్శకులంతా వచ్చి ఈ సక్సెస్‌ని సెలబ్రేట్ చేయడం అనేది చాలా ఆనందాన్ని ఇచ్చింది. వారందరికీ థాంక్యూ. విద్య మా అమ్మాయి. తను ఈ సినిమాతో విజయాన్ని అందుకోవడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో పని చేసిన టెక్నీషియన్స్‌కి నటీనటులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సమ్మర్లో థియేటర్స్‌కి వచ్చి అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్యూ సో మచ్ అన్నారు. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ, మూడేళ్ల క్రితం ఈ కథని డైరెక్టర్ కార్తీక్ రాజుగారు నాకు చెప్పడం జరిగింది. అంతకు ముందు ఈ కథని ఒక 15 మంది రిజెక్ట్ చేశారు వాళ్లందరికీ కూడా థాంక్యూ (నవ్వుతూ). సినిమాని చాలా కసిగా చేసాం. నా కసిలో పాలుపంచుకున్న వెన్నెల కిషోర్‌కి థాంక్యూ (నవ్వుతూ) అరవింద్, విద్య రియాజ్, భానుసినిమా బిగినింగ్ నుంచి చాలా సపోర్ట్ చేశారు. మంచి టీంతో చేస్తున్న ఈ సినిమా ఖచ్చితంగా సక్సెస్ కొడితే బావుంటుం దని అనుకున్నాను అది జరిగింది.

# 'మెగా157'లో నయనతార..

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ మెగా157 త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది, చాలా కాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరస్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్‌తో కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పణలో ఈ చిత్రం రూపొందనుంది. మ్యాసీవ్ ఎంటర్ టైనర్స్‌ని క్రియేట్ చేయడంలో, వినూత్నమైన ప్రమోషన్లను రూపొందించడంలో పేరుపొందిన అనిల్ రావిపూడి మరోసారి తన మార్క్ చూపించారు. సంక్రాంతికి వస్తున్నాం విజయంతో దర్శకుడు మెగా157 ప్రమోషన్స్‌కు తన సిగ్నేచర్ టచ్, ఒరిజినాలిటీని తీసుకువస్తున్నారు. చిరంజీవికి జోడిగా నయనతారను హీరోయిన్‌గా పరిచయం చేయడానికి అనిల్ రావిపూడి న్యూ వీడియోను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో నయనతార తన టీంతో తెలుగులో మాట్లాడటం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, స్క్రిప్ట్‌ను చదవడం, చిరు ఐకానిక్ డైలాగ్‌లలో ఒకదాన్ని చెప్పడం ఆకట్టుకుంది. ఫైనల్‌గా, అనిల్ రావిపూడి ఆమెతో కలిసి న్యూస్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్ తర్వాత చిరంజీవితో నయనతార మూడవసారి కలిసి పనిచేస్తున్న చిత్రం మెగా157. ఈ యూనిక్ ప్రోమోలో ఆమె కనిపించడం రావిపూడి క్రియేటివిటీకి నిదర్శనం. ఈ వీడియో నయనతార పాత్ర యొక్క హిలేరియస్ నేచర్‌ని సూచిస్తుంది. నయనతార కోసం అనిల్ రావిపూడి ఒక



అద్భుతమైన పాత్రను రాశారు, ఇది రిఫ్రెషింగ్‌గా, మెమరబుల్ గా ఉంటుంది. చిరంజీవి, నయనతారల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ అవుతుంది. అనౌన్స్ మెంట్ నుండి సాంకేతిక బృందాన్ని పరిచయం చేయడం, నయనతారను లీడ్ యాక్ట్రెస్‌గా ప్రకటించడం వరకు జరిగిన ప్రతి ప్రమోషన్ వినూత్నంగా, ఆకట్టుకునేలా సాగుతోంది.



కీర్తిసురేష్ నయా లుక్

# 'ఓ భామ అయ్యో రామ' నుంచి లిరికల్ సాంగ్

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామ అయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. వేసవిలో ఈ చిత్రం థియేటర్‌లో సందడి చేయనుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి రామచంద్రుడే



అంటూ కొనసాగే ఓ బ్యూటిఫుల్ పెళ్లి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. హీరో, హీరోయిన్‌పై అందమైనవిజువల్స్‌తో మోస్ట్ బ్యూటిఫుల్‌గా చిత్రీకరించిన ఈ పెళ్లి సాంగ్‌కు శ్రీ హర్ష ఈమని, పార్థు సన్నిధిరాజు సాహిత్యం అందించగా, టిప్పుఅండ్ హరిణి టిప్పు ఈ సాంగ్‌ను పాడారు. రథన్ ఈ పాటకు ఎంతో ప్లెజెంట్ సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఈ పెళ్లి పాట తప్పకుండా అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఇప్పటి వరకు తెలుగు సినిమాల్లో వచ్చిన ఉత్తమమైన పెళ్లి పాటల్లో తప్పకుండా మా రామచంద్రుడే సాంగ్ కూడా ముందు వరుసలో ఉంటుంది.రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గాఉంటాయి. ముఖ్యంగా ఈ పెళ్లి పాట అందరికి ఎంతగానో నచ్చుతుంది అన్నారు. నిర్మాత హరీష్ మాట్లాడుతూ, ఈ సినిమా చేసిన నా టెక్నీషియన్స్, ఆర్టిస్టులు ఎంతో సపోర్ట్ చేసి మంచి ప్రొడక్ట్‌ను తీసుకొచ్చారు. బెస్ట్ క్వాలిటీ సినిమా ఇవ్వబోతున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది. త్వరలో విడుదల తేదిని ప్రకటిస్తాం అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్నిసమాకూరుస్తున్నాడు. బ్రహ్మ కదలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. సుహాస్, మాళవిక మనోజ్, అనిత హస్సానందిని, అలీ, రవీందర్, విజయ్, బబ్లూ, పృథ్వీరాజ్, ప్రభాస్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్.ఎమ్.షా.

# 'డాన్ బాస్కో'లో మిర్నామీనన్ కీలక పాత్రధారి

ఎమెర్జింగ్ నిర్మాణ సంస్థ శ్రీ మాయ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోన్న ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్‌టైనర్ డాన్ బాస్కో. శైలేష్ రమ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ నాగవంశీ బావమరిది రుష్య హీరోగా నటిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా పూర్తవుతుంది. తాజాగా జైలర్, నాసామిరంగ చిత్రాల ఫేమ్ మిర్నా మీనన్‌ను ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ప్రముఖ నటుడు మురళీ శర్మ ఇందులో ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాత్రలో నటిస్తుండగా.. లెక్చరర్ సుమతి పాత్రలో మిర్నా మీనన్ నటిస్తున్నారు. ఇంకా మోనిక, రాజ్‌కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓయ్ తదితరులు ఈ ఎంటర్‌టైనింగ్ రైడ్‌లో ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. డాన్ బాస్కో అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా క్యాప్షన్ ఆసక్తికరంగా ఉంది. వెల్‌కమ్ టు ది క్లాస్ రీయూనియన్ బ్యాచ్ 2014...అన్ని రీయూనియన్‌లు జ్ఞాపకాలను గుర్తు చేసుకోవటానికే కాదు.. కొన్ని విమోచన గురించి కూడా అని ఉంది. ఈ క్యాప్షన్ సినిమా కాన్సెప్ట్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. శంకర్ గౌరి ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఎదురోలు రాజు సినిమాటోగ్రఫీ, మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని అందిస్తున్నారు. నటీనటులు రుష్య, మిర్నా మీనన్, మోనిక, మురళీ శర్మ, విష్ణు ఓయ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు.

సాంకేతిక వర్గం: నిర్మాత: శైలేష్ రమ, బ్యానర్: శ్రీ మాయ ఎంటర్‌టైన్మెంట్స్, దర్శకత్వం: పి.శంకర్ గౌరి, మ్యూజిక్: మార్క్ కె.రాబిన్, సినిమాటోగ్రఫీ: ఎదురోలు రాజు, ఆర్ట్: ప్రణయ్‌నైనా, ఎడిటర్: గ్యారీ బి.హెచ్, పి.ఆర్.ఒ వంశీ కాకా.



# యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం. విజయ్ కనకమేడల దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ అధినేత డా.జయంతి లాల్ గడా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేశాయి. భైరవం ఈ సమ్మర్ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా మే 30న థియేటర్లల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ కనకమేడల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**గరుడన్ కథని రిమేక్ చేయడానికి కారణం? ఒరిజినల్ కథకి తెలుగులో తీసుకొచ్చినప్పుడు ఎలాంటి మార్పులు చేశారు?** కథ కమర్షియల్‌గా నాకు చాలా నచ్చింది. అలాగే ముగ్గురు హీరోలతో వర్క్ చేసే ఛాన్స్ కూడా ఉంది. అందుకే ఒకే చేశాను. ఒరిజినల్‌లో ఉన్న ఆర్గానిక్ ఎమోషన్ ఇందులో వుంటుంది. క్యారెక్టరైజేషన్ ప్రజెంటేషన్ నా స్టైల్‌లో ఉంటుంది. తెలుగు సినిమాకి కావాల్సిన కమర్షియల్ వాల్యూస్ అన్నీ ఉంటాయి.

**బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మనోజ్ మంచు ఈ ముగ్గురితో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?** ఫస్ట్ ఈ కథ అనుకున్నప్పుడు సాయిని ఫైనల్ చేసుకున్నాం. తర్వాత రోహిత్‌ని మనోజ్ గారిని కలిసాం. ఇద్దరు ఒకే చెప్పారు. మనోజ్ గారు రోహిత్ చాలా మంచి పర్ఫార్మర్స్. అలాగే వాళ్ళు స్క్రీన్ మీదకి వచ్చి కూడా కొంత గ్యాప్ వచ్చింది. ఒక మంచి యాక్టర్స్ నుంచి మంచి సినిమా వచ్చినప్పుడు డెఫినెట్‌గా ఆడియన్స్ థియేటర్‌కి వస్తారని నమ్మకం ఉంది.

ఒరిజినల్‌లో ఉన్న కాన్ ఫ్లిక్ట్ ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. అలాగే తెలుగు ఆడియన్స్‌కి కావలసిన ఎమోషన్స్ వుంటాయి.

**ముగ్గురు హీరోలతో సెట్స్ లో వర్క్ చేయడం ఎలాఅనిపించింది? చాలెంజింగ్ మూమెంట్ ఏమిటి?** బిగినింగ్‌లో ముగ్గురు హీరోలను హ్యాండిల్ చేయడం కష్టమవుతుందేమో అనుకున్నాను. అయితే ఈ ముగ్గురు కూడా ఆఫ్ స్క్రీన్ చాలా మంచి ఫ్రెండ్స్. చాలా సపోర్ట్ చేశారు. 14రోజులుపాటు ఫుల్ నైట్స్ వర్క్‌చేసాం. దాదాపు 900 మంది సెట్స్‌లో ఉండే వారు. అ అపోర్షన్ షూట్ చేయడం చాలెంజింగ్‌గా అనిపించింది.



డైరెక్టర్ విజయ్ కనకమేడల

**అతిధి శంకర్ గురించి?** తను కార్తీతో చేసిన సినిమా చూశాను. పెర్ఫామెన్స్ నాకు చాలా నచ్చింది. ఇందులో కూడా సాయి శ్రీనివాస్‌తో తనకి చాలా మంచి కెమిస్ట్రీ ఉంటుంది. తన క్యారెక్టర్‌లో చాలా ఎనర్జీ ఉంటుంది.

# 'కృష్ణ లీల' నేచురల్ మిస్టీరియస్ టీజర్

యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ కృష్ణ లీల. తిరిగొచ్చిన కాలం అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ,మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వివి వినాయక్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. ప్రేమించడం, ప్రేమించబడడం.. రెండు కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అవాయిడ్ చేయాలనుకున్న, అది మరింత కాంప్లికేటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదుఖిఖిఅనే పవర్ ఫుల్ వాయిస్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో దేవన్ క్యారెక్టర్ వేరియేషన్స్, డిఫరెంట్ టైం లైన్స్, మిస్టీరియస్ కథనం.. సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచాయి. నెవర్ బిఫోర్ లవ్ స్టోరీతో ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్నారని టీజర్ చూస్తే అర్థమోతోంది. దర్శకుడిగా దేవన్ సరికొత్త పంథాలో ఈ ప్రేమ కథని ప్రెజెంట్ చేస్తున్నారని టీజర్ ప్రామిస్ చేస్తోంది. ధన్య బాలకృష్ణన్‌తో పాటు వినోద్ కుమార్, యానిమల్ పృధ్వి, రవి కాలే కీలక పాత్రల్లో కనిపించారు. భీమ్స్ సిసిరోలియా బీజీఎం, సతీష్ ముత్యాల కెమరా వర్క్ టీజర్ ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్‌గా వున్నాయి. మొత్తానికి ఈ టీజర్ సినిమాపై మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. నటీనటులు: దేవన్, ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్.



# 'బకాసుర రెస్టారెంట్' ట్రైలర్ రిలీజ్

పలు విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం బకాసుర రెస్టారెంట్, ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు మారుతి ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ,భకాసుర రెస్టారెంట్ త్వరలో మీ ముందుకు రాబోతుంది. మా ట్రైలర్ మారుతి చేతుల మీదుగా విడుదల కావడం హ్యాపీగా ఉంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన ప్రేమకథా చిత్రం నా కెరీర్ సెట్ కావడానికి ఎంతో ఉపయోగపడింది. మరోసారి ఆయన నా సినిమా ట్రైలర్‌కు రావడం ఆనందంగా ఉంది. ఆయనకు నా కృతజ్ఞతలు అన్నారు. మారుతి మాట్లాడుతూ, ఈ సినిమాకు టైటిల్‌తోనే విజయం సాధించారు. మంచి టైటిల్ పెట్టారు. సినిమా కూడా బాగుంటుందనే ఫీల్ కలుగుతుంది. మంచి టైటిల్ ఈ సినిమాకు పెట్టడంతో మంచి పాజిటివ్ వైబ్ ఉంది. చాలా రోజుల నుంచి ప్రవీణ్‌ను హీరోగా చూడాలనుకుంటున్నాను. డెఫినెట్‌గా ఈ సినిమా ప్రవీణ్ కెరీర్‌కు మరో మైలురాయిగా నిలుస్తుంది. తప్పకుండా ఈ సినిమా ఆడియన్స్ అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధించి ఈ సినిమా యూనిట్ అందరికి మంచి పేరు తీసుకరావాలని అని కోరుకుంటున్నాను అన్నారు.



నిర్మాత జనార్ధన్ ఆచారి మాట్లాడుతూ, శివ ఈ లైన్ చెప్పగానే బాగా నచ్చింది. వెంటనే ఈ పాత్రకు ప్రవీణ్ అనుకున్నాం. ఆర్టిస్టులు అందరూ ఎంతో సపోర్ట్ చేశారు. కేజీఎఫ్ గరుడ రామ్ పాత్ర అందరికి నచ్చుతుంది అన్నారు.

# మేకప్ మరకలా?



**వేడుకలన్నాక కాస్త మేకప్ టచ్ లేకపోతే ఎలా? సమస్యల్లా ఆ సందడిలోపడి ఆదమరిచినప్పుడే! గమనించుకోకుండా కాటుకో, లిప్‌స్టిక్కో దుస్తులకు అంటిందో.. వదిలించడం పెద్ద తలనొప్పి. సులువుగా పోగొట్టే మార్గాలు కావాలా.. అయితే చదివేయండి.**

♦ హైనెక్ కాలర్ డ్రెస్ వేడుకున్నారా? మనం ప్రత్యేకంగా అంటించుకోనక్కర్లేదు. మెడకు వేసిన ఫౌండేషన్, కాంపాక్ట్ చక్కగా దుస్తులకు అతుక్కుపోతుంది. లేత దుస్తులైతే మరకలు మరింత బాగా కనిపిస్తాయి. ఇలాంటప్పుడు ఒక చిన్న గిన్నెలో గోరువెచ్చని నీటిని తీసుకొని దానికి కొద్దిగా లిక్విడ్ డిషవాష్‌ను కలపాలి. దూదిని ఆ నీటిలో ముంచి, నెమ్మదిగా మరక ఉన్నప్రాంతంలో రుద్దకుండా సున్నితంగా అద్దాలి. దూదితోపాటుగా మేకప్ వచ్చేస్తుంది. అవసరమైతే దూదిని మార్చుకుంటే సరిపోతుంది.

♦. చూసుకోకుండా లిప్‌స్టిక్, మస్కారా, ఐ లైనర్ పూసేసుకున్నారా? ఇంట్లో షేవింగ్ ఫోమ్ ఉంటే సమస్య తీరినట్లే. షేవింగ్ ఫోమ్‌ని మరక ఉన్నచోట రాసి, పావుగంట వదిలేయండి. తరవాత దూదితోగానీ శుభ్రమైన వస్త్రంతోగానీ ఫోమ్‌ని తుడిచేయాలి. ఆపై చల్లని నీటితో కడిగేస్తే సరిపోతుంది. ఇంకా ఆనవాళ్లు కనిపిస్తోంటే మరోసారి ఈ ప్రక్రియను అనుసరిస్తే సరి.

♦ నెయిల్ పాలిష్ అంటితే.. రెండు దూది ఉండలను తీసుకొని నెయిల్ పాలిష్ రిమూవర్‌లో ముంచాలి. మరక ఉన్న ప్రాంతంలో వస్త్రానికి ఇరువైపులా వాటిని ఉంచి కొద్ది సేపు అద్దితే చాలు. అదే ఊడొస్తుంది.

♦ ముదురు రంగు దుస్తులు వేసుకుని అలా అలా పౌడర్ ఫౌండేషన్‌తో టచప్ ఇద్దామను కున్నామనుకోండి. అది పొరపాటున వాటిపై పడితే తిప్పలు మామూలుగా ఉండవు. దుస్తులపై తెల్లని పొరలా ఎంతసేపటికీ వదలదు. అలాంటప్పుడు చేతులకు కాకుండా హెయిర్ డ్రైయ్యర్‌కి పనిచెప్పండి. దాంతో బ్లో చేస్తే.. ఆనవాళ్లు లేకుండా పౌడర్ వదిలిపోతుంది. కావాలంటే చూడండి. □

ఒకే ఒక్క మార్కుతో గురి తప్పారామె, అయినా, దాని గురించి బాధపడకుండా, ఆ అనుభవంతో ఈ సారి పక్కాగా సన్నద్ధమయ్యారు. లక్ష్యాన్ని చేరుకుని... ఇంట్లో మూడో జడ్జిగా నిలిచారు హైదరాబాద్‌కు చెందిన విభీషా.



# న్యాయ నిర్ణేతలుగా లక్ష్యాన్ని చేరుకుని..

**బిటెక్ తర్వాత 'లా' ...**

బిటెక్ చదివి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పనిచేశారు నిఖీషా తండ్రి కె. ఖుషా న్యాయమూర్తి ప్రస్తుతం హైదరాబాద్‌లో సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జర్జిగా పనిచేస్తున్నారు. ఆయన స్ఫూర్తితో న్యాయమూర్తి కావాలనుకున్నారు నిఖీషా. తాజాగా విడుదలైన తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో ఆమె ప్రతిభ కనబరిచి కలను నిజం చేసుకున్నారు. నిఖీషాకు 2019లో న్యాయవాది శాంతికుమార్‌తో వెల్లింది. ఆ తర్వాత చదువు కొనసాగుతుంది. ఎల్.ఎల్.బి. పూర్తిచేసి 2020లో న్యాయవాదిగా పట్టా పొందారు. 2022లో జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్ష రాయగా, ఒక్క మార్కుతో ప్రిలిమ్స్ తప్పారు. అప్పటికి నిఖీషా ఎనిమిది నెలల గర్భిణి. ఆ పరీక్షల్లో ఆమె సోదరి భావన ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో 4వ ఆదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2024లో మరోసారి నోటిఫికేషన్ రావడంతో ఈసారి ఎలాగైనా లక్ష్యం సాధించాలని పట్టుదలతో పరీక్షకు సిద్ధమయ్యారు నిఖీషా. 2024 జూన్‌లో ప్రిలిమ్స్ నవంబర్‌లో మెయిన్స్ పూర్తిచేసి, ఏప్రిల్ 2025లో జరిగిన ఇంటర్వ్యూనూ విజయవంతంగా పూర్తిచేసి 44 మందిలో స్థానం సంపాదించారు. రెండేళ్ల వయసున్న కవల కుమార్తెల బాధ్యతను చూసుకుంటూనే కఠినమైన పరీక్షకు సన్నద్ధమయ్యారు. మెయిన్స్‌కు పది రోజుల ముందు తల్లికి సర్జరీ అయింది. భర్త సహకారంతో పిల్లల్నీ, తల్లినీ చూసుకుంటూనే ప్రణాళిక తప్పకుండా చదివారు. తండ్రి ఇద్దరు కుమార్తెలు ఒకేసారి న్యాయ మూర్తులుగా సేవలందించడం చాలా అరుదు. ఈ విజయం ఆమె కృషి, పట్టుదలనే కాదు, కుటుంబ మద్దతుని ప్రతిబింబిస్తోంది.



తేజస్విని

**డాక్టర్ అవ్వాలనుకుని..**

సెలవులకు హైదరాబాద్‌లో ఉండే పెదనాన్న ఇంటికి వెళ్లేవారమే. ఆయన ప్రభుత్వ ప్లీడర్. అతని కుమారుడు జడ్జి ఇద్దరూ నల్లకోటు వేసుకుని విధులకు వెళ్లడం చూసి తానూ న్యాయమూర్తి కావాలని కలలుకన్నారు. సివిల్ జడ్జిగా ఎంపికై దాన్ని నిజం చేసుకున్నారు. తేజస్విని. ఈమెది మహబూబ్‌నగర్. తండ్రి నాగ్యానాయక్ నవాబ్‌పేట మండల విద్యాధికారి. తల్లి సరోజ జడ్చర్ల మండల పంచాయతీ అధికారి. ఈమెకో తమ్ముడు. పదో తరగతి వరకూ ఉన్న న్యూ రిషి ఉన్నత పాఠశాలలో చదివిన తేజస్విని... హైదరాబాద్‌లో ఇంటర్ బైపీసీ చదివారు. 978 మార్కులు సాధించారు. ఆపై హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో ఐదేళ్ల న్యాయవాద కోర్సులో చేరారు. 2022లో ఎల్ఎల్‌బీ, ఆపై 2024లో ఉస్మానియా నుంచి ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక య్యారు. డాక్టర్ కావాలనుకున్నా. కానీ పెదనాన్న సాయి చక్రవర్తి(మాజీ ప్రభుత్వ ప్లీడర్), అన్నయ్య రాధాకృష్ణ చౌహాన్(హుజూర్‌నగర్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి)లను చూశాక పేదలకు వైద్యం చేయడం ద్వారా న్యాయం అందించడాన్ని లక్ష్యంగా మార్చుకున్నా. వాళ్ల మార్గ నిర్దేశంలోనే న్యాయవాద విద్యను అభ్యసించా. పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నా. రోజుకు 12-13 గంటలు చదివేదాన్ని. స్నేహితులతో బృంద చర్చలు, పాత ప్రశ్న పత్రాల సాధనతోపాటు. న్యాయవాద విద్యకు సంబంధించిన అనేక పుస్తకాలు చదివి సొంతంగా నోట్స్ రాసుకునేదాన్ని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడివిడిగా నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలను రాసి, రెండు చోట్ల ఎంపికయ్యా. పేదలకు చట్టాలపై అవగాహన కల్పించి, తమ హక్కులను కాపాడుకునేలా చైతన్యం తీసుకొస్తాను అని తేజస్విని చెబుతున్నారు. □

# గుండె పదిలంగా ఉండాలా..



**శారీరక ఆరోగ్యానికి నడక, యోగా.. ఇలా నచ్చిన వ్యాయామాలను చేస్తుంటాం కదా! వాటిలో శ్వాస వ్యాయామాలకీ చోటివ్వండి వీటితో మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు నిపుణులు.**

★ నేలమీద కూర్చొని దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి. తరవాత నెమ్మదిగా నోటితో ఆ గాలిని వదిలేయాలి. లేదా ముక్కు ఒక రంధ్రంతో దీర్ఘశ్వాస తీసుకొని మరోదాని నుంచి వదలాలి. వీటిలో నచ్చినదాన్ని రోజుకు కనీసం 2 నిమిషాలైనా ప్రయత్నించాలి.

★ రోజులో ఇంటిపని, ఆఫీసుపని అంటూ పరుగులు పెడుతుంటాం. ఈ క్రమంలో ఒత్తిడి బారిన పడతాం. దాన్నుంచి బయటపడటానికి శ్వాస వ్యాయామాలు ఉత్తమ పరిష్కారం. ఇవి నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచి ఒత్తిడి, ఆందోళలను తగ్గిస్తాయి.

★ ప్రతిరోజూ వీటిని జీవనశైలి భాగం చేసుకుంటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. అంతేకాదు, ఆస్తమా మొదలైన దీర్ఘకాలిక వ్యాధులకూ ఇది ప్రయోజనకరం.

★ లోతుగా ఊపిరి పీల్చుకుని వదలటం వల్ల శరీరానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దాంతో అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. రక్తపోటును తగ్గించడానికీ ఇది ఉత్తమ సాధనం. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. □

## చెలి చిట్కా

★తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్ధన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది.

★ అరటికాయ ముక్కలుగా కోసేటప్పుడు తోలుతీసిన అరటికాయలను మజ్జిక కలిపిన నీళ్లలోముంచండి. ఆ తర్వాత కోస్తే ముక్కలు నల్లబడవు.

★ ఖాళీడబ్బాలను తలక్రిందులుగా అలమరలో పెట్టినట్లయితే మీకు కావలసిన డబ్బాను గుర్తించడం సులభం. □

# ఆడిద్దామా... స్పడ్ !



ముందుగా పిల్లల్లో ఎవరో ఒకరు బంతిని గాల్లోకి ఎగరవేయాలి. ఎగరవేసిన వెంటనే ఇతర పిల్లల్లో ఎవరో ఒకరి పేరుని గట్టి అరవాలి. అలా ఎవరి పేరు చెప్పారో వాళ్ల ఆ బాల్‌ని కిందపడే లోగా పట్టుకోవాలి. వెంటనే ఎస్‌పియూడి (స్పడ్) అని అరవాలి. దీంతో మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నవాళ్లు అక్కడే కదలకుండా ఉండిపోవాలి. బాల్ పట్టుకున్న పిల్లవాడు నిల్చున్న చోటునుంచే దాన్ని ఎవరో ఒకరి మీదకు విసరాలి. బాల్ తగిలిన వాళ్లకు ఒక 'ఎస్' అక్షరం వచ్చినట్లు. తర్వాత వాళ్లే బాల్‌ను కూడా పైకి విసరాల్సి ఉంటుంది. అలా ఎవరికైతే ముందుగా ఎస్‌పియూడి అక్షరాలు వస్తాయో వాళ్ల ఓడిపోయినట్లు మిగిలిన వాళ్ల ఆటను కొనసాగిస్తారు! ఈ ఆటవల్ల పిలల్లో మెంటల్ అలర్జ్‌నెస్ అలవడుతుంది. □

# వెరైటీ వడియాలు

పచ్చిమిర్చి, కొత్తిమీరల ఘుమాయింపుతో నోరూరించే చారన్నంలో కాసిని వడియాలు నంజుకుంటే చాలదా.. తృప్తిగా తిన్నామనిపించటానికి! తరచూ ఒకటే అయితే విసుగని.. బియ్యప్పిండి, మినపప్పు, రవ్వ, సగ్గుబియ్యం, గుమ్మడి.. రకాలు తింటుంటాం. వడియాల్లో ఇంకా బోల్డన్ని వెరైటీలున్నాయి..

## ఉల్లి..


**కావలసినవి:** మినప్పప్పు పావు కిలో, మిరపకాయలు 20, ఉల్లిపాయలు కిలో, పసుపు అర చెంచా, ఉప్పు రుచికి తగినంత, అల్లం ముద్ద చెంచా, ఇంగువ పావు చెంచా

**తయారీ:** మినప్పప్పును రాత్రి పూట నానబెట్టాలి. ఉదయం ఆ నీళ్ల తీసేసి, కాస్త ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఉల్లిపాయలు పొట్టు తీసి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. మిరపకాయలను



కచ్చాపచ్చాగా దంచాలి. మినప్పిండిలో ఉల్లి తరుగు, ఉప్పు, పసుపు, అల్లం ముద్ద, దంచిన మిరపకాయలు, ఇంగువ వేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చెంచాతో పాలిథిన్ కవరు మీద అంగుళం వెడల్పున వడియాలు వేసి ఎండబెట్టాలి. ఇక నూనెలో వేయించుకుంటే రసం, పప్పుచారు, సాంబారు, పులుసుల్లో సూపర్‌గా ఉంటాయి.

## పాలకూర..



**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, జీలకర్ర చెంచా, పాలకూర 2 కట్టలు, పచ్చిమిరప కాయలు మూడు, ఉప్పు రుచికి తగినంత, నువ్వులు పావు కప్పు

**తయారీ:** కడిగిన పాలకూరను తరిగి కొద్దిగా నీళ్ల పోసి గ్రైండ్ చేయాలి. బియ్యప్పిండిలో నాలుగు కప్పుల నీళ్ల, పాలకూర గుజ్జు వేసి కలియతిప్పుతూ ఉడికించాలి. అందులో ఉప్పు, నువ్వులు, జీలకర్ర, మిర్చి జతచేసి ఉండలు కట్టకుండా కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడ్డాక దించేసి వస్త్రం మీద వడియాలు పెట్టి.. రెండు రోజులు ఆరబెట్టాలి.

## టొమాటో..

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, సగ్గుబియ్యం పావు కప్పు, టొమాటోలు 4 అల్లంఅంగుళం ముక్క పచ్చిమిరపకాయలు 2, ఉప్పు రుచికి అవసరం, జీలకర్ర చెంచా

**తయారీ:** బియ్యప్పిండిలో రెండు కప్పుల నీళ్ళు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. సగ్గుబియ్యం కడిగి ఓ గంట నానబెట్టాలి. టొమాటో ముక్కలను గ్రైండ్ చేయాలి. ఆ గుజ్జు గిన్నెలోకి తీసి.. ఆరు కప్పులు నీళ్ల, నానిన సగ్గుబియ్యం, ఉప్పు కలిపి మధ్యమధ్యలో కలియబెడుతూ ఉడికించాలి. నాలుగు నిమిషాల తర్వాత బియ్యప్పిండి, జీలకర్ర, కచ్చాపచ్చ దంచిన అల్లం, పచ్చిమిరపకాయల ముద్ద వేసి కలపాలి. అడుగంటకుండా అప్పుడప్పుడూ కలియతిప్పుతూ పది నిమిషాలు ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి.. పాలిథిన్ పేపరు మీద చెంచాతో వెడల్పుగా వడియాలు వేసి.. రెండు రోజులు ఎండబెట్టాలి.



## బీట్‌రూట్ ..

**తయారీ:** బియ్యపిండి-కప్పు ఉప్పు-రుచికి తగినంత, బీట్‌రూట్-రెండు, ఎండుమిర్చి-రెండు, జీలకర్ర-చెంచా, మిరియాల పొడి - అర చెంచా.

**తయారీ :** బీట్‌రూట్ చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటికి ఎండుమిర్చి, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జులో ఐదు కప్పుల నీళ్ల, జీలకర్ర, మిరియాల పొడి జతచేసి ఉడికించాలి. బియ్యపిండిలో రెండు కప్పుల నీళ్ల పోసి ఉండలు కట్టకుండా కలపాలి. దీన్ని తెర్లుతున్న బీట్‌రూట్ నీళ్లలో వేసి.. కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడిన తర్వాత దించేసి.. శుభ్రమైన వస్త్రం మీద పల్చగా వడియాలు పెట్టి ఎండలో ఆరబెట్టుకోవాలి.



## సొరకాయ

**కావలసినవి :** మినపప్పు-పావు కిలో, సొరకాయ తురుము-6 కప్పులు, రాళ్లుప్పు-చెంచా, మెత్త ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి ముద్ద- 2 చెంచాలు.



**తయారీ :** మినపప్పును నాలుగైదు గంటలు నానబెట్టి.. ఆ నీళ్ల తీసేసి.. అస్త ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. కడిగిన సొరకాయను తురుముకోవాలి. చెక్కు తీయనవసరం లేదు. అందులో రాళ్లుప్పు చల్లి.. శుభ్రమైన వస్త్రంలో వేసి.. మూటకట్టాలి. దాని మీద చిన్న రోలు లాంటి బరువైన వస్తువునుంచాలి. నీరంతా పోయిన సొరకాయ తురుము, పచ్చిమిర్చి ముద్దలను మినప్పిండిలో కలపాలి. ఈ మిశ్రమంతో పాలిథిన్ కాగితం మీద కాస్త మందంగా, వెడల్పుగా వడియాలు పెట్టి.. మూడు రోజులు ఎండబెట్టాలి. వాటిని తడి లేని డబ్బాలో భద్రం చేసుకోవాలి.

## క్యాబేజీ..


**కావలసినవి :** మినపప్పు-150 గ్రాములు, క్యాబేజీ-పావుకిలో, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-అర చెంచా, పచ్చిమిర్చి ముద్ద-రెండు చెంచాలు, జీలకర్ర-ముప్పావు చెంచా, ఇంగువ-పావు చెంచా.

**తయారీ :** క్యాబేజీని సన్నగా తురమాలి. మినపప్పును ఐదు గంటలు నానబెట్టి ఉప్పు జోడించి మెత్తగా రుబ్బాలి. అందులో క్యాబేజీ తురుము, పసుపు, జీలకర్ర, ఇంగువ, పచ్చిమర్చి ముద్ద వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో వడియాలు పట్టి రెండు మూడు రోజులు ఆరబెట్టాలి. □



# యోనా మనకు నేర్పించే పాఠం..

'నేను హెబ్రీయుడను, సముద్రమునకును భూమికిని సృష్టికర్తయై ఆకాశమందుండే దేవుడైయున్న యెహోవాయందు నేను భయభక్తులు గలవాడనైయున్నాను.. (యోనా (1:9)..'ఇది చూడగా ఆ మనుష్యులు యెహోవాకు మిగుల భయపడి, ఆయనకు బలి అర్పించి మ్రొక్కుబళ్లు చేసిరి' (1:16). యోనా గురించి మనలో చాలామందికి తెలుసు. యోనాను చాలామంది ఒక్కకోణంలోనే చూస్తుంటారు. యోనా అనగానే అవిధేయుడైన యోనా అని అనుకుంటారు. యోనా అవిధేయుడైన వ్యక్తి అనడంలో ఎలాంటి సందేహం లేదు. దేవుడు చెప్పిన మాటను వినకుండా సొంతనిర్ణయంతో ముందుకు సాగిపోయాడు. అయితే యోనాలో అనేకులు గమనించని విషయాలున్నాయి. యోనా ఓడలో ఉన్న అన్యులకు దేవుడి గురించి పరిచయం చేసాడు. అంతేకాదు, దేవుడి సన్నిధి నుంచి పారిపోతున్నట్లుగా సత్యం చెప్పాడు. ఈ తుఫానుకు కారణం తన అవిధేయత అని చెప్పాడు. ఆ మాటలు విన్న ఆ మనుషులు భయపడ్డారు. ఏం చేయాలని యోనాను అడిగారు. అందుకు యోనా తనను ఎత్తి సముద్రంలో పడవేయమని చెప్పాడు. వారు ఆవిధంగా యోనాను సముద్రంలో పడవేయగానే, సముద్రం నిమ్మళించింది. తుఫాను ఆగిపోయింది. దీనితో వారు యెహోవా దేవుడికి భయపడి, ఆయనకు బలలను అర్పించారు. అంతేకాదు, వారు యోనాను సముద్రం లో పడవేస్తున్నపుడు ప్రార్థించి, మరీ వేసారు. అంటే వారు దేవుడిపై భయంతో



పాటు, ఆయన నిజమైన దేవుడని నమ్మారు. అసలు యోనా ఎందుకు నీనెవె పట్టణానికి వెళ్లకూడదను కున్నాడు అంటే ఆ ప్రజలు యూదులకు శత్రువులు. వారు దేవుడిని నమ్ముకోవడం యోనాకు ఇష్టం లేదు. అందుకే నీనెవె నుంచి తర్షీషు పట్టణానికి పారిపోవాలను కున్నాడు. యోనాకు తన జాతిప్రజలపై ఎనలేని ప్రేమ ఉంది. తాను తప్పు చేసిన సమయంలో కూడా ఆత్మహత్య మహాపాపం అని తెలుసు. అందుకే తనను సముద్రంలో పడవేయమని ఓడలో ఉన్నవారికి చెప్పాడు. మొత్తానికి నీనెవె పట్టణానికి వెళ్లి దేవుడి గురించి ప్రకటించాడు. వారిని దేవుడు రక్షించాడు. యోనాకు దేవుడితో సన్నిహిత సంబంధం ఉంది. అందుకే ప్రతిదానిలోనూ దేవుడితోనే వాదించేవాడు. తన కోపాన్ని ప్రదర్శించేవాడు. ఈ పుస్తకం ద్వారా మనం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిని తర్వాత తెలుసుకుందాం. ఒక్కటి మనం గమనించవలసిన అంశం ఏమిటంటే, దేవుడితో మనకు ఎంత సన్నిహిత సబంధం ఉంది, దేవుడితో మన పయనం ఎలాగుంది అని పరిశీలించుకుని, ఆవిధంగా విశ్వాసంలో సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# ఇంట్లో మేనిక్యూర్

**చేతులు కోమలంగా, గోళ్ల ఆరోగ్యంగా కనిపించాలంటే మేనిక్యూర్ అవసరమే. దీన్ని ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే...** ★. ముందుగా గోళ్లపై ఉన్న నెయిల్ పాలిష్ తొలగించండి. ఆపై అరచెంచా ఉప్పు, కొద్దిగా బాదం నూనె, కాస్త నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కనీసం 10 నిమిషాలపాటు గోళ్లను నాన బెట్టండి. దీనివల్ల గోళ్ల శుభ్రపడటమే కాదు... పసుపు తగ్గి ప్రకాశిస్తాయి. చేతులు టాన్ తగ్గి మెరిసిపోతాయి.



★ రెండో దశలో గోళ్లను కత్తిరించి రౌండ్, స్క్వేర్, ఓవల్... ఇలా మీకు నచ్చిన రూపు ఇవ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లలో రెండు చుక్కల షాంపూ లేదా బాడీవాష్ కలిపి అందులో కనీసం పది నిమిషాలు చేతుల్ని నాననివ్వండి. ★. తర్వాత ఆరెంజ్ స్టిక్ లేదా క్యూటికల్ పూషర్‌తో చుట్టూ ఉన్న మృతచర్మాన్ని తొలగించండి. ఆపై ఆలివ్ ఆయిల్‌తో రుద్దాలి. తర్వాత చిన్న బ్రష్ తీసుకుని గోళ్లపై రుద్దితే సరి. మురికి వదులుతుంది. ఇప్పుడు చెంచా చొప్పున పెరుగు, పంచదార, తేనె కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసి వేళ్లతో వలయాకారంగా స్క్రబ్ చేయండి.

★ చివరగా చేతుల్ని చల్లటి నీళ్లతో కడిగేసి కాస్త బాదం నూనె రాసి మరోసారి మృదువుగా మర్దన చేయండి. వారానికోసారి ఇలా చేయడంవల్ల చేతులు నాజూగ్గా కనిపిస్తున్నాయి. ఆరోగ్య ంగానూ ఉంటాయి. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఎక్కువగా చేసేవారు... రోజూ రాత్రిపూట గ్లిజరిన్ రాయడాన్ని అలవాటుగా మార్చుకోండి. □

# ఇటాలియన్ టెన్నిస్ ఫైనల్‌కు సిన్నర్

**న్యూఢిల్లీ:** మూడు నెలల డోపింగ్ నిషేధం తర్వాత తిరిగి వచ్చిన జానిక్ సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. రోమ్‌లో జరిగిన సెమీఫైనల్లో అగ్రస్థానంలో ఉన్న సిన్నర్ 1-6, 6-0, 6-3 తేడాతో 12వ ర్యాంకర్ టామీ పాల్‌ను ఓడించాడు. 1976లో అడ్రియానో పనాట్టా తర్వాత రోమ్ ట్రోఫీని గెలిచిన తొలి ఇటాలియన్ వ్యక్తిగా నిలిచేందుకు సిన్నర్ ప్రయత్నిస్తున్నాడు.



అంతకుముందు, అల్కరాజ్ 6-3, 7-6(4) తేడాతో లోరెంజో ముసెట్టిని ఓడించి తన తొలి రోమ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ నెల 18న జరిగే ఫైనల్ అక్టోబర్ తర్వాత సిన్నర్ మరియు అల్కరాజ్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ అవుతుంది, అల్కరాజ్ చైనా ఓపెన్ ఫైనల్‌ను మూడో సెట్ టైబ్రేకర్‌లో గెలిచాడు. సిన్నర్‌తో తన కెరీర్ సమావేశాల్లో అల్కరాజ్ 6-4 ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో తన అతి పెద్ద ప్రత్యర్థిపై వరుసగా మూడు విజయాలు సాధించాడు. కానీ బీజింగ్‌లో అల్కరాజ్ చేతిలో ఓటమి పాలైన తర్వాత సిన్నర్ ఒక్కసారి కూడా ఓడిపోకపోవడం విశేషం. సరికదా వరుసగా 26 మ్యాచ్‌ల విజయాలతో దూసుకుపోతున్నాడు. తొలుత క్వార్టర్ ఫైనల్స్‌లో కాస్పర్ రూడ్‌ను ఓడించి సిన్నర్ తన స్థాయిని దాదాపు పరిపూర్ణతకు చేరుకున్నాడు. పాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, సిన్నర్ మొదటి సెట్‌లో అనవసర తప్పిదాలు చేయగా, అతని అమెరికన్ ప్రత్యర్థి లైన్స్‌లో షాట్‌ల తర్వాత షాట్‌లు కొట్టాడు. కానీ సిన్నర్ త్వరగా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇక జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన మూడవ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌ను ఆడుతున్నాడు.




# చెస్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద్

## టైబ్రేకర్‌లో వాచియర్-లాగ్రేవ్ ఓటమి

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ 2025 ఛాంపియన్‌గా గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద్ నిలిచాడు. అతను అద్భుతంగా ప్రదర్శన ఇచ్చి టైబ్రేకర్‌లో వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద్ అలిరేజా ఫిరోజా మరియు మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌లపై జరిగిన టైబ్రేక్ ప్లేఆఫ్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా సూపర్‌బెట్ చెస్ క్లాసిక్‌ను గెలుచుకున్నాడు. తొమ్మిది రౌండ్ల తర్వాత, ప్రజ్ఞానంద్, వాచియర్‌లాగ్రేవ్ మరియు ఫిరోజా మొత్తం 5.5 స్కోరును సాధించారు. ఫలితంగా, విజేతను టై బ్రేకర్‌లో నిర్ణయించారు. మొదటి రెండు మ్యాచ్‌లు టై బ్రేకర్‌లలో డ్రా అయిన తర్వాత, ప్రజ్ఞానంద మూడవ మ్యాచ్‌లో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకు. పోటీలో ప్రజ్ఞానంద్ చాలా ముందున్నాడు. కానీ లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను డ్రా చేసుకోవడంతో ఫిరౌజా మరియు వాచియర్‌లాగ్రేవ్‌లు తమ చివరి మ్యాచ్‌లను గెలిచి సమం చేశారు. టైబ్రేక్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లు (ప్రజ్ఞానానంద్-ఫిరోజ్జా మరియు వాచియర్ లాగ్రేవ్-ఫిరోజ్జా) డ్రాగా ముగిశాయి. మూడో గేమ్ గెలిచింది. ప్రజ్ఞానంద అద్భుతంగా రాణించి వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. విజయం తర్వాత, ప్రజ్ఞానంద తన భావాలను వ్యక్తం చేస్తూ, "అద్భుతమైన అనుభవం, బుకారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నమెంట్‌ను ఇప్పుడే గెలుచుకుంది. నిరంతర ప్రోత్సాహానికి నా బృందం మరియు సహచరులకు ధన్యవాదాలు" అని అన్నాడు. కాగా భారత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ నాలుగు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇప్పుడు తదుపరి గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్, సూపర్ యునైటెడ్ రాపిడ్ అండ్ బ్లిట్జ్, జూలై 1 నుండి క్రొయేషియాలో జరుగుతుంది.

ఆట

# వన్డేల్లో నో ఔట్

## ముగ్గురి రూటే సెపరేట్

### టీమిండియా సౌరభ్, ఫజల్, భరత్

**న్యూఢిల్లీ:** వన్డే ఫార్మాట్‌లో ఎన్నో అరుదైన రికార్డులు ఉన్నాయి. కొత్తగా కొన్ని నమోదవుతుంటే, ఇప్పటికే ఉన్న వాటిలో కొన్ని బ్రేక్ అవుతున్నాయి. క్రికెట్ చరిత్రలో పరుగులు, సెంచరీల వర్షం కురిపించిన బ్యాట్స్‌మెన్లు చాలా మందే ఉన్నారు. కానీ, వన్డే క్రికెట్‌లో ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాని బ్యాట్స్‌మెన్లు ఉన్నారు. ప్రపంచంలో ఏ బౌలర్ కూడా వన్డే క్రికెట్‌లో వీరిని అవుట్ చేయలేకపోయారు. ఈ లిస్ట్‌లో కేవలం కొందరికే ఛాన్స్ దక్కింది. ఇందులో ముగ్గురు టీమిండియా ప్లేయర్లు ఈ అరుదైన రికార్డును సాధించారు. ఈ ముగ్గురు బ్యాట్స్‌మన్స్ వన్డేలో ఎప్పుడూ ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాకపోవడం విశేషం. ఈ జాబితాలోని సౌరభ్ తివారీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు, అతన్ని ధోని జిరాక్స్ అని పిలిచేవారు. సౌరభ్ పొడవాటి జుట్టు చూసి, ప్రజలు అతన్ని ధోనితో పోల్చేవారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించడం ద్వారా అతడు టీమ్ ఇండియాలో చోటు సంపాదించుకున్నాడు. సౌరభ్ 2010లో ఆస్ట్రేలియాపై వన్డే అరంగేట్రం చేశాడు. టీమ్ ఇండియా తరపున కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అందులో అతను రెండు ఇన్నింగ్స్‌లలో మాత్రమే బ్యాటింగ్ చేయగలిగాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సౌరభ్ తివారీ నాటౌట్‌గా నిలిచాడు. ఆ తరువాత అతన్ని జట్టు నుంచి తప్పించారు. అలాగే ఫైజ్ ఫజల్ దేశీయ క్రికెట్‌లో తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అందుకే అతనికి టీం ఇండియాలో కూడా అవకాశం లభించింది. కానీ, ఈ ఆటగాడు టీం ఇండియా తరపున ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. 2016లో జరిగిన ఈ వన్డే మ్యాచ్‌లో ఫైజ్ ఫజల్ జింబాబ్వేపై 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ అద్భుతమైన అర్ధ సెంచరీ తర్వాత కూడా అతన్ని జట్టు నుంచి తొలగించారు. ఇక నేటి యువతకు భరత్‌రెడ్డి పేరు తెలియకపోవచ్చు. కానీ, ఈ ఆటగాడికి కూడా భారతదేశం తరపున కేవలం మూడు వన్డేలు మాత్రమే ఆడే అదృష్టం కలిగింది. భరత్ రెడ్డి 1978 నుంచి 1981 వరకు భారతదేశం తరపున మూడు వన్డేలు ఆడాడు. అందులో అతనికి రెండుసార్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. రెండు సార్లు అజేయంగా నిలిచాడు. ఆ తరువాత, భరత్ రెడ్డిని కూడా టీం ఇండియా నుంచి తొలగించారు. అతని కెరీర్ కూడా విషాదకరమైన ముగింపునకు చేరుకుంది.




# ఇంగ్లండ్ టెస్ట్‌కు భారత్ టీం

## కెప్టెన్‌గా ఈశ్వరన్.. శ్రేయాస్‌కు దక్కని ప్లేస్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ టూర్‌కు భారత్ ఎ జట్టు సిద్ధమైంది. ఇండియా ఎ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు ఈ నెల 30 నుండి జూన్ 9వ వరకూ జరగనున్నాయి. ఈ పర్యటనకు గాను నిమించిన భారత్ జట్టుకు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను నియమిస్తూ సెలక్టర్లు నిర్ణయించారు. ఈ మేరకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ 18 మందితో కూడిన భారత్ జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్ టూర్‌లో ఈశ్వరన్‌కు డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ వ్యవహరించనున్నాడు. ఇక ఇండియా ఎ జట్టుకు చాలాకాలం తర్వాత వెటరన్ క్రికెటర్ కరుణ్ నాయర్ ఎంపికయ్యాడు. కరుణ్ 8 ఏళ్ల తర్వాత ఇండియా సీనియర్ టెస్టు జట్టులోకి సైతం రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కరుణ్‌తో పాటు, ఇషాన్ కిషన్‌కు కూడా భారత్ ఎ జట్టులో చోటు దక్కింది. అయితే ఆశ్చర్యకరంగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. దీంతో అయ్యర్ ఇంగ్లండ్‌తో టెస్టులకు ప్రధాన భారత్ జట్టులో ఉంటాడనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ జట్టులో భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్ కూడా ఉన్నారు. క్రికెట్ బోర్డు వారిని ప్రాక్టీస్ కోసం ముందుగా ఇంగ్లండ్‌కు పంపింది. అదే విధంగా ప్రస్తుత ఇండియన్ నప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్స్ తర్వాత శుభమన్ గిల్, సాయి సుదర్శన్‌లు ఇండియా ఎ జట్టుతో కలవనున్నారు. కాగా ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ హర్ష్ దుబే కూడా భారత్ ఎ జట్టులో భాగమయ్యాడు. ఈ విదర్భ స్పిన్నర్ 10 మ్యాచ్‌ల్లో 17 సగటుతో 69 వికెట్లు పడగొట్టాడు. మరో ఎడమ చేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. భారత్ ఎ జట్టులో అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), ధృవ్ జురెల్ (వైస్ కెప్టెన్) యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధృవ్ జురెల్, నితీష్ కుమార్, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేశ్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే ఉన్నారు.



# ప్రో కబడ్డీ లీగ్ వేలం

## ముంబయిలో పాల్గొననున్న 12 ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం ప్రక్రియకు సమయం దగ్గర పడుతోంది. ఈ నెల 31, జూన్ 1వ తేదీల్లో ఈ వేలాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంబైలో నిర్వహించే ఈ వేలానికి సంబంధించి 12 ఫ్రాంచైజీలు పాల్గొంటున్నాయి. ఈ వేలానికి ముందే ప్రో కబడ్డీ లీగ్ ఎలైట్ రిటైన్డ్ ప్లేయర్లు, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల, న్యూ యంగ్ ప్లేయర్ల జాబితాను ప్రకటించింది. ఫ్రాంచైజీలు ఇప్పటికే 83 మంది ఆటగాళ్లను నిలుపుకొన్నాయి. ఇందులో ఎలైట్ రిటైండ్ ప్లేయర్స్ విభాగంలో 25 మంది, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల విభాగంలో 23 మంది, న్యూ యంగ్ ప్లేయర్స్ విభాగంలో 35 మంది ఉన్నట్లు ప్రకటించింది. మొత్తం ప్లేయర్లను 4 వర్గాలుగా విభజించారు. ఎ కేటగిరి ప్లేయర్లకు రూ.30 లక్షలు, బి లో ఉన్న వారికి రూ.20 లక్షలు, సి లోని వారికి 13 లక్షలు, డి కేటగిరిలో ఉన్న ప్లేయర్ల కనీస వేలం ధర 9 లక్షల రూపాయలుగా వర్గీకరించారు. ప్లేయర్ల కొనుగోలు నిమిత్తం ఒక్కో ఫ్రాంచైజీ 5 కోట్ల రూపాయల మేర పర్స్ కలిగి ఉంటుంది. బెంగాల్ వారియర్జ్, బెంగుళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ కెసి, గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ తైలవులు, తెలుగు టైటాన్స్, యు ముంబా, యుపి యోధా ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. కాగా 2014 నుండి ఇప్పటి వరకూ జరిగిన 11 సీజన్లలో 8 వేర్వేరు జట్లు టైటిల్స్ గెలుపొందాయి. ఈ నేపథ్యంలో ప్రతీ జట్టూ టైటిల్ కోసం పోరాడుతునే ఉంది.

# వాణిజ్యం

# ఆర్‌బిఐ వద్ద 879.59 టన్నుల బంగారం

**న్యూఢిల్లీ, మే 17:** భారతదేశంలో పెట్టుబడి పరంగా బంగారానికి చాలా ప్రాముఖ్యత ఉంది. బంగారం వందల సంవత్సరాలుగా దాని విలువ, ప్రాముఖ్యతను నిలుపుకుంది. దీనిని ఆభరణాలుగా మాత్రమే కాకుండా పారిశ్రామిక అవసరాలకు కూడా ఉపయోగిస్తారు.

భారతదేశంలోని చాలా మంది ఆర్థిక సలహాదారులు ప్రజలు తమ ఆస్తులలో కొంత బంగారం రూపంలో ఉంచుకోవాలని సలహా ఇస్తుంటారు. భారతదేశ కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి సంవత్సరాలలో బంగారం కొనుగోళ్లను పెంచింది. 2021 నుండి ఇప్పటి వరకు, ఆర్‌బిఐ తన ఫారెక్స్ నిల్వలలో బంగారం వాటాను 25 పెంచింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు కూడా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. గత 3 సంవత్సరాలలో కేంద్ర బ్యాంకులు తమ నిల్వలకు 1,000 టన్నులకు పైగా బంగారాన్ని జోడించాయి. 2024లోనే ఆర్బీఐ 57.5 టన్నుల బంగారాన్ని కొనుగోలుచేసింది. మార్చి 2025 నాటికి ఆర్‌బిఐ వద్ద మొత్తం 879.59టన్నుల బంగారం ఉంది. అందులో 511.99 టన్నులు భారత దేశంలో, మిగిలినవి ఇంగ్లాండ్, ఇతర ప్రదేశాలలో భద్రంగా ఉంది. ఆర్బీఐ డేటా ప్రకారం..

భారతదేశ విదేశీ మారక నిల్వలలో (డాలర్లలో) బంగారం వాటా మార్చి 2021లో 5.87గా ఉంది. ఇది మార్చి 2025లో 11.7కి పెరిగింది. కేవలం నాలుగు సంవత్సరాలలో బంగారు ఆస్తులలో



ఆర్బీఐ పెట్టుబడి రెట్టింపు అయింది. మే 9 నాటికి ఆర్బీఐ విదేశీ మారక నిల్వలు 690 బిలియన్లు, అందులో బంగారం విలువ 86 బిలియన్లు. దీని అర్థం భారతదేశ విదేశీ మారక నిల్వలలో దాదాపు 12.46 బంగారంలో ఉన్నాయి.

# యుఎస్‌కు భారత్ జీరో టారిఫ్ ఆఫర్: ట్రంప్

**న్యూఢిల్లీ, మే 17:** జీరో టారిఫ్‌ల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే చాలారకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని మరోసారి పునరుద్ఘాటించారు. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో ట్రంప్ నుంచి పదేపదే ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి అని మరోమారు వ్యాఖ్యానించారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాల్ని 100 శాతం తగ్గించడానికి భారత్ అంగీకరించిందన్నా రు. ఇక భారత్‌తో వాణిజ్య ఒప్పందం గురించి తొందరలేదని.. తమతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ట్రంప్ వ్యాఖ్యలపై జైశంకర్ స్పందించారు. రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు



అవి కొనసాగుతూనే ఉంటాయి. వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది జరిగే వరకు దాని గురించి ప్రకటన చేయడం తొందర పాటే అవుతుం ది అని ట్రంప్ ప్రస్తావన లేకుండా మంత్రి మాట్లాడిన విషయం తెలిసిందే.

# తగ్గనున్న రెపో రేట్లు..!

**న్యూఢిల్లీ, మే 17:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి రెపో రేటులో పెద్ద కోతను పరిశీలిస్తోంది. ఈ సంవత్సరం జూన్ నుండి దీపావళి వరకు రిజర్వ్ బ్యాంక్ మూడు ద్రవ్య విధాన కమిటీ సమావేశాలు జరగనున్నాయి, ఈ తరుణంలో రెపో రేటును తగ్గించవచ్చు. ఈ కోత 0.50 నుండి 0.75 శాతం వరకు ఉండవచ్చని నివేదికలలో పేర్కొన్నాయి. రెపో రేటులో ఇంత తగ్గింపు ఉంటే సామాన్యులకు పెద్ద రిలీఫ్ లభిస్తుంది. మీడియా నివేదికల ప్రకారం ఆర్‌బిఐ ద్రవ్యవిధాన కమిటీ వచ్చే సమావేశం జూన్ 46 వరకు జరగనుంది, ఈ సమావేశం లో సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చు అలాగే రెపో రేటును దాదాపు 0.25 తగ్గించవచ్చు. దీని తరువాత ఆగస్టు 5 నుండి 7 వరకు లేదా సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 1 వరకు జరిగే సమావేశంలో 0.25 శాతం నుండి 0.50 శాతం వరకు కోత ఉంటుందని భావిస్తున్నా రు. సమాచారం ప్రకారం ఫిబ్రవరి నుండి ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడం ప్రారంభించింది. అప్పటి నుండి రెండు సమావేశాలలో 0.50 కోత వచ్చింది. ఈకారణంగా రెపో రేటు 6కి తగ్గింది. ఈసారి దీపావళికి ముందు సామాన్యులకు పెద్ద ఉపశమనం లభిస్తుందని, ఆర్‌బిఐ రెపో రేటు 0.75 వరకు తగ్గించవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6 వద్ద ఉంది. దీపావళి నాటికి ఇది 5.25కి తగ్గవచ్చు. సింపుల్‌గా అర్థం చేసుకోవాలంటే రెపోరేటు అంటే ఆర్‌బిఐబ్యాంకులకు రుణాలిచ్చే వడ్డీరేటు, తరువాత బ్యాంకులు కొంత వడ్డీని కలపడం ద్వారా కస్టమర్లకు లైన్స్ ఇస్తాయి. ఇలాంటి పరిస్థితిలో రెపో రేటు తగ్గితే మీ లోన్ కూడా తగ్గుతుంది ఇంకా మీ హోమ్‌లోన్ అండ్ కారు లోన్ చౌకగా మారుతుంది. ఆర్‌బిఐ సెక్యూరిటీస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సన్నీ అగర్వాల్ ప్రకారం, అన్ని అంశాలు రేటు తగ్గింపు వైపు చూపిస్తున్నాయి. ఇంకా పరిస్థితులు కూడా సాధారణంగానే ఉంటాయని భావిస్తున్నారు.

# అంబానీ, అదానీలకు కలిసొచ్చిన కాల్పుల విరమణ

**ముంబై, మే 17:** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత, ఆసియాలోని ఇద్దరు ధనవంతులైన వ్యాపారవేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీల అదృష్టం మారిపోయినట్లు కనిపిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ముఖేష్ అంబానీ రూ.100 బిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ సంపద కలిగిన బిలియనీర్ల గుంపులో చేరారు. మరోవైపు ప్రపంచంలోని టాప్ 20 ధనవంతుల జాబితాలో గౌతమ్ అదానీ చోటు దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ డేటాను పరిశీలిస్తే, ఆసియాలోని అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ నికర విలువ 5 రోజుల్లో 6 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆసియాలో రెండవ అత్యంత ధనవంతుడైన వ్యాపార వేత్త గౌతమ్ అదానీ నికర విలువ 9.2 బిలియన్లు పెరిగింది. ముఖేష్ అంబానీ మొత్తం నికర విలువ మే 9న 99 బిలియన్లు కాగా, మే 16న అది 105 బిలియన్లకు పెరిగింది. అంటే 6 బిలియన్లకు పైగా అంటే రూ.51 వేల కోట్లకు పైగా పెరిగింది. గౌతమ్‌అదానీ నికర విలువ మే 9న 74.4బిలియన్లు కాగా, మే 16న అది83.6 బిలియన్లకు పెరిగింది. అంటే గౌతమ్ అదానీనికరవిలువ 9.2 బిలియన్లు అంటే దాదాపు రూ.79 వేల కోట్లు పెరిగింది.

# రాబడుల్లో పెద్ద కంపెనీలతో పతంజలి పోటీ!

**ముంబై, మే 17:** భారతీయ ఎఫ్ఎంసిజి కంపెనీ పతంజలి ఫుడ్స్ ఆదాయం, లాభం నిరంతరం పెరుగుతోంది. బాబా రామ్‌దేవ్ కంపెనీ ప్రపంచంలోని పెద్ద నీలీదిబి కంపెనీలతో పోటీ పడటానికి ఇదే కారణం. నాల్గవ త్రైమాసిక గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ లాభంలో 74 శాతం పెరుగుదల కనిపించింది. కాగా కంపెనీ ఆదాయం కూడా పెరిగింది. ప్రత్యేకత ఏమిటంటే కంపెనీ నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను మాత్రమే విడుదల చేయలేదు. మొత్తం ఆర్థిక సంవత్సరం డేటాను కూడా విడుదల చేసింది. దీనిలో పెరుగుదల కనిపించింది. అంతకుముందు కంపెనీ షేర్లు దాదాపు ఒకటిన్నర శాతం పెరిగాయి. పతంజలి ఫుడ్స్ నుండి త్రైమాసిక ఫలితాల్లో ఎలాంటి గణాంకాలు వచ్చాయో తెలుసుకుందాం. నాల్గవ త్రైమాసికంలో



లాభం, ఆదాయంలో పెరుగుదల: గత ఆర్థిక సంవత్సరం జనవరి మార్చి త్రైమాసికంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ నికర లాభం స్వతంత్ర ప్రాతిపదికన 74 శాతం పెరిగి రూ.358.53 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.206.31 కోట్లుగా ఉంది. మరోవైపు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఒక ప్రకటనలో తన మొత్తం ఆదాయం 202324 ఇదే త్రైమాసికంలో రూ.8,348.02 కోట్ల నుండి రూ.9,744.73 కోట్లకు చేరుకుందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం అపారమైన పెరుగుదల ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ నికర లాభం రూ.1,301.34 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.765.15 కోట్లు. ఇక కంపెనీ మొత్తం ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.34,289.40 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.31,961.62 కోట్లు. గురువారం స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్లలో పెరుగుదల కనిపించింది. కంపెనీ స్టాక్ 1.41 శాతం లాభంతో రూ.1811.35 వద్ద ముగిసింది. అంటే ఒక్కో షేరుకు రూ.25.20. కంపెనీ షేరు రోజు గరిష్ట స్థాయి రూ.1824 కి చేరుకుంది. అయితే కంపెనీ షేరు రూ.1795.95 వద్ద ప్రారంభమైంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.